

గురువులు
సమర్ధ రామదాసు
ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సమర్థ రామదాసు

గ్రంథకర్త:

కళాప్రపూర్ణ

చిలకమర్తి లక్ష్మీనరసింహము

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1996

# ముందుమాట

ఈ పవిత్ర భారత దేశంలో జన్మించిన మహాపురుషులలో సమర్థ రామ దాస స్వామి ఒకరు. క్రీ.శ. 1608వ సం|| మహారాష్ట్రలో జన్మించిన ఈయన సుప్రసిద్ధ చారిత్రక పురుషుడైన శివాజీకి గురువు. దేశంలోని వివిధ పుణ్య స్థలాల్ని దర్శించి, సత్సాంగత్యంతో జ్ఞానాన్ని సముపార్జించి, భిక్షావృత్తితో జీవిత యాత్రను సాగిస్తూ హిందూ ధర్మ ప్రచారాన్ని జీవితాంతం సాగించిన మహాత్ముడు రామదాసు. బాల్యం నుంచే వైరాగ్య ప్రవృత్తి కల్గిన రామదాసుని అద్భుత సామర్థ్యానికి ఆశ్చర్యపడిన సాధువు ఈయన్ని సమర్థుడని పిలిచారు. నాటి నుంచే ఈయనకు సమర్థరామదాసు అనే పేరు స్థిరపడింది.

విద్వాంసుడు, కవి, రాజనీతిజ్ఞుడు ఐన రామదాసు జీవితంలో కర్తవ్యానికీ, స్వార్థ త్యాగానికీ అత్యంత ప్రాధాన్యమిచ్చేవాడు. భగవంతుని దృష్టిలో సర్వులూ సమానమేననీ, పరమాత్మునికి కావలసింది భక్తి మాత్రమేననీ, కాలాన్ని దుర్వినియోగంచేయకుండా సదా సత్కార్మలు చేస్తూ వుండటం మానవ ధర్మమనీ, తన్ను తాను తెలిసి కొనడమే నిజమైన జ్ఞానమనీ ఈ మహనీయుడు బోధించేవాడు. రామదాసుని రచనల్లో సుప్రసిద్ధమైన గ్రంథం 'దాసబోధిని' ప్రజల్ని హిందూ ధర్మోన్ముఖుల్ని చేయడానికై ఈ మహాపురుషుడు చేసిన బోధలు అజరామరాలు.

ప్రసిద్ధ కవి పండితులు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు విపులంగా సరళగ్రాంథిక భాషలో రచించి లోగడ ముద్రించిన ఈ సమర్థరామదాసు చరిత్రను తిరుమల తిరుపతి దేవస్థానాలు ఇప్పుడు తెలుగు ప్రజల కోసం స్వీయప్రకాశనంగా ముద్రించింది. మన పుణ్యభూమి ఎందరు ఎంతటి మహనీయులకు కన్నతల్లో తెలిసి కొనటానికిది ఉపయోగిస్తుంది. అందరూ సమర్థ రామదాస స్వామి చరిత్రనూ, బోధల్ని ఆకళింపుచేసికొని తమ జీవితగమనాన్ని సక్రమమార్గంలో సాగిస్తారని మా విశ్వాసం.

తిరుపతి, కార్యనిర్వహణాధికారి,
19-10-91. తి.తి. దేవస్థానములు, తిరుపతి.

# సమర్థరామదాసు

## మొదటి ప్రకరణము

శ్లో॥ యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.
శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్.
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే.
(భగవద్గీత అధ్యాయము 4 శ్లో॥ 6, 8)

ధర్మమునకు హాని కలిగినప్పుడును, అధర్మమునకు వృద్ధి కలిగినప్పుడును, నన్ను నేను సృజించుకొందును. (శ్లో॥ 6)

సాధుజనులను రక్షించుటకును, దుర్జనులనునాశనము చేయుటకును, ధర్మమును సంస్థాపించుటకును, యుగయుగంబున నేను పుట్టుచుందును. (శ్లో॥ 8) అని పై రెండు శ్లోకముల యభిప్రాయము.

ఈ పై వాక్యముల సత్యము ప్రతి యుగమునందు. సకల దేశములందు వ్యక్తమగుచున్నది. యూదుమతము భ్రష్టమైపోయినకాలమున నా దేశస్థులను బాగుచేయుటకై భగవంతుఁడు సకలధర్మమూర్తియగు యేసుక్రీస్తును బంపెను. అలాగుననే అరేబియా దేశము నీతిభ్రష్టమై ధర్మశూన్యమైన కాలమున పరమేశ్వరుఁడు నీతిమంతుఁడును బరమ భక్తాగ్రగణ్యుఁడును నైన మహమ్మదును బంపెను. ఆ మహమ్మదు, నీతిని ఏకేశ్వరారాధనమును ధర్మమును అరేబియా దేశమున నెలకొల్పెను. ఆ విధంబుననే భరతఖండ వాసులు యజ్ఞముల పేరుఁబెట్టి వేల కొలఁది జంతువుల హింసించుచు ధర్మభ్రష్టులై పాడైపోవుచున్నప్పుడు గౌతమబుద్ధుఁడు జనించి హిందూదేశ

మున బౌద్ధమతము స్థాపించెను. బౌద్ధమతము హీన దశలో నున్న కాలమున శంకరాచార్యులు, రామానుజాచార్యులు జన్మించి ఆస్తిక మత స్థాపనఁజేసి దేశీయుల నుద్ధరించిరి. ఆ విధముగనే మహారాష్ట్రదేశము విదేశీయుల పాలనకు లోఁబడి దేశస్వాతంత్ర్యమును మతధర్మములను గోల్పోయినతఱి దేశాభిమానియు రామభక్తాగ్రగణ్యుఁడును నైన సమర్థ రామదాసుఁడు జన్మించి మహారాష్ట్రులను మంచిమార్గమునఁ బ్రవేశ పెట్టెను. మహారాష్ట్ర దేశమున సతారా మండలమున జాంబ్ అని యొక గ్రామము కలదు. ఆ యూరిలో నిరువది యొక్క తరములనుండి ధొసరా కుటుంబమువారు నివసించుచుండిరి. రామదాసుఁడాకుటుంబములోని వాఁడే. వారివృత్తి గ్రామపౌరోహిత్యము, వారప్పుడప్పుడు కరణములుగఁ గూడ పని జేయుచుండిరి. ఆ వంశవృక్షములో మనకథానాయకుఁడైన రామదాసుని తండ్రి సూర్యాజీ యిరువది రెండవ పురుషుఁడు. ఆయన భార్య పేరు రాణూబాయి. ఆ వంశస్థులందఱు మొదటి నుండియు రామభక్తులై యుండిరి. పూర్వుల మార్గము తప్పకుండ సూర్యాజీకూడ రామపదభక్తుఁడై యుండెను. ఆ దంపతులకు రాముని మీఁద నెంత భక్తి యనఁగా శ్రీరాముడే వారికి సాక్షాత్కరించుచుండు ననియు నతఁడే వారికి రామమంత్రోపదేశము చేసెననియు లోకులు చెప్పకొందురు. వారి పవిత్రజీవనము గ్రామవాసులందఱకు మార్గదర్శకముగ నుండెను. ఆ దంపతులు ప్రాచీన మహర్షులచేత రచింపఁబడిన సకల గృహస్థధర్మములు నిత్యము నిర్వర్తించు చుండిరి. అందుచేత గ్రామవాసులేగాక యితర ప్రదేశ నివాసులుఁ గూడ వారిని మిక్కిలి గౌరవించుచుండిరి. ఆ వంశము యొక్క ప్రతిష్ఠ నిలుపుటకై యా దంపతులకు వారి తపఃఫలములో యనునట్లు కుమారులిద్దఱు గలిగిరి. అందు మొదటివాఁడు శ్రేష్ఠుఁడు. రెండవవాఁడు రామదాసుఁడు. మంచి దంపతులకు మంచిబిడ్డలే పుట్టుదురు. దుష్ట దంప తులకు సాధారణముగ దుష్టులే జనించుచుందురు. సూర్యాజీపంతునకు మొదటి కుమారుఁడైన శ్రేష్ఠుఁడు క్రీస్తుశకము 1605 సంllన జన్మించెను. ఆ కుమారునకు మొట్టమొదట గంగాధరుఁడని పేరుపెట్టిరి. అతఁడు సంతానములో జ్యేష్ఠుఁడును, గుణములచేత శ్రేష్ఠుఁడు నగుటచేత శ్రేష్ఠుఁ

డను పేరం బరగెను. అతని కీ రెండవ పేరు మహారాష్ట్రదేశపు భక్తులలో నుత్తముఁడైన యేకనాథస్వామి ప్రతిష్ఠానపురమునబెట్టెను. ఈ శ్రేష్ఠుఁడు తల్లిదండ్రుల పావన గుణములను గలిగి వర్ధిల్లెను. 1614 సం॥న అనఁగా నా బాలకునకుఁ దొమ్మిదేండ్ల వయస్సున శ్రీరామదేవుఁడు ప్రత్యక్షమై స్వయముగ మంత్రోపదేశము చేసెనని చెప్పుదురు. అతఁడుగూడ ననేక మతసంబంధములైన గ్రంథములువ్రాసెను. వానిలోనతఁడు రామిరామ దాసుఁడను పేరు వేసికొనుచుండెను. సూర్యాజీ మహాపురుషుఁడయ్యెను. అతని గర్భమున శ్రీరామపాదారవింద భక్తుఁడును, వానర వల్లభుఁడునైన మారుతి (హనుమంతుఁడు) జన్మించునని సిద్ధులు సెలవిచ్చిరఁట. జనులీ మాట విశ్వసించి యట్టియవతారపురుషుని కొఱకు నెదురు చూచుచుండిరి. మహారాష్ట్రదేశమున నా కాలమున చాలమంది భక్తులు జనించిరి. వారం దఱిలోఁ బ్రతిష్ఠాన పురవాసియైన యేకనాథస్వామి మిక్కిలి గొప్పవాఁడు. ఆయన రాణోజీబాయి సోదరుఁడైన భానోజీకి గురువు. ఏకనాథుని యొక్క గురువు పేరు జనార్దనస్వామి. గురువుగారి గురువుయొక్క తిథి ప్రయోజనమునకై ప్రతిసంవత్సరము భానోజీరావు ప్రతిష్ఠానపురము వెళ్ళుచుండును. అతఁడు సోదరియైన రాణోజీబాయిని తనవెంటఁ దీసికొని పోవుచుండును. పరమభాగవతుల యెడల మిక్కిలిభక్తిగల సూర్యాజీ యేఁటేటభార్యతోఁ గలసి యేకనాథుని సేవఁ జేయుటకై ప్రతిష్ఠా నపుర మరుగుచుండును. ఆయాత్రలోఁ బలుసారులు మహానుభావుఁడైన ఏకనాథుఁడు హనుమంతుఁడు వారి గర్భమునఁ దప్పక యవతరించునని నొక్కి వక్కాణించుచు వచ్చెను. అతఁ డొక్కఁడేగాక యేకనాథునివలెనే మహారాష్ట్ర దేశభక్తు లందఱు నట్టి యవతార పురుషుఁడు తమ దేశము నలంకరించునని వాక్రువ్వఁజొచ్చిరి. అట్లే క్రీ॥శ॥ 1608 వ సం॥న సూర్యా జీపంతు రామాయణపారాయణముఁ జేయుచుండఁగా రెండవకుమారుఁడు గలిగెనని శుభవార్త దెలిసెను. సూర్యాజీపంతు శ్రీరామనవమి మహోత్స వము చేయనారంభించి నవమినాఁడు మధ్యాహ్నము రెండు జాములవేళ రామవిగ్రహముపై నవపుష్పములు వైచి పూజ చేయుచుండెను. ఆ పుణ్య సమయముననే రెండవపుత్త్రుఁ డుద్భవించెను. ఆతని యానందమునకు

మేరలేదు. శ్రీరామనవమి నతఁడు మునుపటికంటె రెట్టింపు భక్తితోను, సంతోషముతోనుజేసి గ్రామవాసులందఱకు మధురపదార్థములనుబంచిపెట్టి పుత్రోత్సవముఁ గావించెను. ఆబాలుని మొట్టమొదటిపేరు నారాయణుఁడు. ఆ తరువాత నతఁడు రామదాసుఁ డనియు సమర్థరామదాసుఁడనియు లోకమున వ్యవహరింపఁబడెను. మరుసటి సంవత్సరము సూర్యాజీపంతును రాణోజీ బాయియు యాత్రార్థమై ప్రతిష్ఠానపురమునకరిగిరి. తల్లిదండ్రుల వెంట కుమారులిద్దరు పోయిరి. ఆంజనేయస్వామి యవతరించునని ఏకనాథస్వామి చెప్పుచుండుటచేత భార్యాపుత్రసమేతుఁడై సూర్యాజీ వచ్చుచున్నాఁడని విని ఏకనాథుఁడు మిక్కిలి సంతోషించెను. అతఁడు మేర మీరిన సంతోషముతో నా యవతార పురుషు నెదుర్కొనుటకుఁ బోయెను. ఏకనాథుఁడు రామదాసు నెత్తుకొని యానందపారవశ్యమున నాట్యముచేసి యిటువంటి కుమారుని గన్న తల్లిదండ్రులు ధన్యులు. ఈ దేశము ధన్యదేశము. మీ నోములు పండినవి. మీతపము ఫలించినది యని ప్రశంసించి యా బాలుని దీవించెను. శివుని యనుగ్రహమున నీ నందనుఁ డుదయించెను. ఇతఁడు నూతనశకమును స్థాపించి లోకుల బాధలు తొలఁగించి దేశము నుద్ధరించును. ఇటువంటి మహాపురుషుఁడు మన మధ్యమున జన్మించెను గావ నా జీవితము గూడ ధన్యమైనది. ఇంక నేను నా జీవితరంగముమీఁది కట్టె కడపటి తెఱ పడవైచెదను అనికూడ ఏకనాథుఁడు వచించెను.

---

# రెండవ ప్రకరణము

## బాల్యము - ఉపదేశము

నారాయణుఁడు చిన్నవాఁడు. అల్లారుముద్దుగాఁబెరిగెను. అతని మొగమెప్పుడు చిఱునగవుతో వెలయుచుండెను. ఏడుపన్న దేమో యతడెఱుఁగఁడు. రెండేళ్లు వెళ్లునప్పటికి మాటలు వచ్చెను. వయస్సు ముదిరిన కొలఁది బుద్ధికుశలతయు దానితో యుక్తాయుక్త వివేకము నలవడెను. భవిష్యత్కాలమున నతనిసాహసములు చిన్ననాఁటి యల్లరిపనులవల్లనే యూహింపఁదగియుండెను. ఆతనికి దయ్యములన్న భూతములన్న నమ్మకము లేదు. తన దుండగములు సహింపక తల్లిదండ్రులు బెదరించినప్పుడు వారి బిభీషికలకు భయపడువాఁడు కాఁడు. పిల్ల లల్లరిపనులు చేయునప్పుడు వారిని భయపెట్టుటకై చెప్పెడు భూతపిశాచముల కథల నతఁడు లెక్క చేయువాఁడు కాఁడు. ఆట లన్న నతనికి నత్యంత ప్రేమ. స్వేచ్ఛావిహార మతని ప్రకృతి. ఆ గ్రామమందలి బాలు రంద అతని సహచరులైరి. అతఁడు వారి నాయకుఁ డయ్యెను. ఈ పిల్లల కొంటెతనములు కోతి కొమ్మచ్చి మొదలయిన యాటలు పూర్వము రామాయణములోఁ జెప్పఁబడిన వానరుల చేష్టలవలెనుండెను. నారాయణుఁడు తనయనుచరుల హృదయములు రంజింపఁజేసెను. అందుచేత నతఁడేమి చెప్పిన నది వారు తప్పక చేయుచుండిరి. గోడల మీఁదనుండి దూకుట, నదులీఁది దాఁటుట, యొకచెట్టుమీఁద నుండి మరియొక చెట్టుమీఁదకు దుముకుట మొదలైనవి జాంబు నగరమున నీ చిన్నియన్నల చేష్టలలోఁ గొన్ని, నారాయణుఁడింటివద్ద చేయునట్టి దుండగములనుండి తప్పించుకొనుటకు సూర్యాజీ తన కుమారుని యా గ్రామమున నొక పాఠశాలకుఁబంపెను. ఆ యుపాధ్యాయుఁడు విశేష విద్యావంతుఁడుకాఁడు. అతఁడు నేర్చుకొన్న విద్యనంతయు నారాయణుఁడు రెండు సంవత్సరములలోనే గ్రహించెను.

అందుచేత నతఁడు సూర్యాజీని బిలిచి తాను నేర్చిన విద్యనంతయు నారాయణుఁడు గ్రహించెననియు నెక్కుడు విద్య కావలసినపక్షమున వేరే యేర్పాటు చేసికొనవలసినదనియు జెప్పెను. నారాయణునకు నైదవయేఁడు రాఁగానే తండ్రి తన స్థితిగతులకుఁ దగినంత వైభవముతో నందనునకు నుపనయనముఁ జేసెను. కాని దైవ యోగమున 1615 సంll న సూర్యాజీ కుటుంబ పోషణమునకు మాతృసంరక్షణమునకుఁ జిన్నపిల్లలైన శ్రేష్ఠుని, నారాయణుని విడచి కాలధర్మము నొందెను. ఏది వచ్చినను నారాయణుఁడు లెక్కచేయక దృఢనిశ్చయము కలవాఁడై యుండెను. కానున్నది కాకమానదని యతని యభిప్రాయము. చిన్నతనమందుఁ గూడ నితరుల దృష్టిలో నసాధ్యమని తోఁచిన విషయముకూడ నారాయణునకు సులభముగ సాధ్యమయ్యేడిది. ఇతరులు కార్యసాధనమునఁ గలవరపాటు నొందినప్పుడు నారాయణుడు తొందర యేమియు లేక నిశ్చలమనస్సుతోఁ గార్యసాధనము చేయువాఁడు. అతఁడు తలఁచుకొన్న పని ఎంత దుర్ఘటమైనను నెందరు వలదని వారించి నను దాని నతఁ డవలీలగా నిర్వహించువాఁడు. నారాయణునకు సమర్థరామదాసుఁ డని పేరువచ్చుటకు భవిష్యత్కాలమున బహుసాహసకార్యములు చేయుటకు నిదియే బీజమని చెప్పవచ్చును. అతని దృఢనిశ్చయము క్రమక్రమముగ నాత్మవిశ్వాసమును స్వతంత్రభావమును వృద్ధిపొందించెను. సూర్యాజీ మరణానంతరమున బాలకు లిద్దరు గృహకృత్యములను దేవతారాధన మొదలగు పవిత్రకృత్యములను నవవైధవ్య దుఃఖముచేత మూలఁబడియున్న తల్లికి సంతృప్తిగలుగునట్లు చేయఁదొడఁగిరి. శ్రేష్ఠుఁడు, తమ్ముఁడైన నారాయణునకు వేదము మంత్రశాస్త్రము మొదలగు విద్యలు శ్రద్ధతో నేర్పి యతనిని విద్యావంతుని జేసెను. నారాయణుఁడు విద్య నేర్చుటయే గాక యన్నగారి కంటె వైరాగ్యనిస్పృహత్వములయందు మిన్నయై యుండెను. సూర్యాజీ బ్రతికియుండఁగనే శ్రేష్ఠుఁడు వేదపాఠశాల యొకటిపెట్టి దానిని యథావిధిగ జరుపుచుండెను. అతఁడు విద్యార్థులను శోధించి తగిన వారికి మంత్రశాస్త్రము నుపదేశించి ప్రవీణులఁ జేయఁ దొడగెను. నారాయణుఁ డెనిమిది సంవత్సరముల వయస్సు గలిగి యున్నప్పు డన్నగారు తోడి బాలున కొకనికి మంత్రోపదేశముఁ జేయుచుండఁగ జూచి, తనకుఁ గూడ నది

యుపదేశించి గురువు కమ్మని ప్రార్థించెను. అప్పు డుపదేశమునకు సమయము కా దనియు, దానికిఁ దగిన కాలము వచ్చుననియు, నంతవఱకు వేఁగిరపడ వద్దనియు శ్రేష్ఠుఁడు తమ్ముని బ్రతిమాలి తండ్రివలె బుజ్జగించి చెప్పెను. అన్నగారి యాలోచనము నారాయణుని మనస్సునకు నచ్చనందున నతఁడు తలఁచిన తలంపు మానుకొనుట కిష్టము లేకపోయెను. అన్నగారు చేయని యుపదేశమును స్వయముగ దేవుని చేతనే చేయించుకొనవలెనని తిన్నగ మారుతి దేవాలయమునకుఁ బోయెను. కన్నులవెంట బాష్పములు గ్రమ్మ నారాయణుఁడు మిక్కిలి భక్తితో మారుతిని బద్యములతో స్తవము చేయనారంభించెను. ఆతఁడెక్కడకు వెళ్లెనో యింటిలో నెవరికిని దెలియదు. పగలెల్ల నతఁడు స్తవము చేసిన పిదప రాత్రి ప్రారంభమాయెను. భక్తిపరిపూర్ణదశ నొందెను. అతని మనోనిశ్చయము వయస్సును మించిన దయ్యెను. కన్నులు బాష్పములతో నిండెను. గొంతు బొంగురు వోయెను. చిట్ట చివర కతఁడు గర్భాలయములో నొక చీకటిమూల మూర్ఛ పోయెను. అర్ధరాత్రమున దివ్యతేజ స్సొకటి బయలుదేరి గుడియంతయు వెలిఁగించెను. అంత నారాయణుదు మేల్కొనెను. తెలివి వచ్చెను. అప్పు డతనికి దివ్య తేజస్సుతో మారుతి ప్రత్యక్ష మయ్యెను. నారాయణుఁడు వాని పాదములపైఁ బడి భక్తితో స్తుతి చేసెను. నారాయణున కుత్సాహ మెక్కువ కాఁగా బాష్పపరంపరచేత నాదేవుని పాదముల నతఁ డభిషేకించెను. ఆ బాలకుని యసమానభక్తికి సంతసించి మారుతి శ్రీరామదేవుని దర్శనము చేయించెను. శ్రీరాముఁడు స్వయముగ నారాయణున కుపదేశము చేసెను. ఆ యుపదేశమహిమ చేత నారాయణుని హృదయము భక్తిపరవశ మయ్యెను. అప్పుడు శ్రీరాముఁ డిట్లాజ్ఞాపించెను. "ఈభూమియంతయు నపవిత్రులైన మ్లేచ్ఛులచేత పాడయినది; కాన, నారాయణా! నీవు స్వార్థత్యాగివై కృష్ణానదీ తీరమున విరాగివై తపస్సుచేసి లోకమున నవీనపద్ధతి నవలంబించి దివ్యజ్ఞానము వ్యాపింపఁజేయవలెను." నారాయణుఁ డింటినుండి వెళ్లినది మొదలుకొని తల్లి వానికొఱకుఁ జిత్తక్షోభనొందెను. ఇరుగుపొరుగువారును మిత్రులును వానికొఱకు వెదకి వెదకి విసిగి యుండఁగ శ్రేష్ఠుఁడు సరిగ మారుతి గుడికి వెళ్లి తమ్ముని దోడ్కొని వచ్చెను.

---

# మూడవ ప్రకరణము

## వివాహము

ఉపదేశమైనది మొదలుకొని నారాయణుఁడు నిరంతర ధ్యానపరుడై విరాగివలె నుండును. ఆతని నడతవలన నతఁడు లోకవాంఛలమీఁద నాశ విడచినట్లు సంసారసంబంధమైన యురులలోఁ దగులుకొన నిష్టము లేనట్లు గనఁబడెను. నారాయణుఁడు బ్రహ్మచర్యమునందే కాలము గడపఁ దలఁచెను. గాని వృద్ధురాలైన యతని తల్లి తన కుమారుఁడు బ్రహ్మచారియై యుండుటకు యిష్టపడక త్వరగా వానికి వివాహముచేసి యొక యింటి వానివి జేయఁదలఁచెను. ఆ గ్రామ పురోహితులు కూడ వాని తల్లిమాటనే యాడి పెండ్లిచేసికొమ్మనిరి. సాధారణముగఁ బురోహితులు పెండ్లియీడు గల మగపిల్లలకు ఆడపిల్లలకుఁ బెండ్లిచేయుటయే పవిగాఁ బెట్టుకొందురు గదా! తల్లియు బంధువులు మిత్రులు నారాయణుని గృహస్థాశ్రమమునఁ బ్రవేశపెట్టుటకుఁ బట్టుపట్టిరి. అతనిమనస్సు రెండు తలంపుల నడుమ నుయ్యాల లూఁగ జొచ్చెను. మాతృవాక్య పరిపాలన చేయవలెనా? తన మనోభీష్ట ప్రకారము సంసారపరిత్యాగము చేయవలెనా? యను సంశయ మతని మనస్సును బీడింపఁ జొచ్చెను. ఆతనికి మాతృదేవతయన్న మిక్కిలి భక్తి. సంసారపరిత్యాగము చేయవలెనన్న మాతృభక్తి బంధము గోసివేయ వలెను. అది యతని కిష్టములేదు. ఏది యెట్లైనను నారాయణుఁడు వివాహవిముఖుఁడౌటకే నిశ్చయించు కొనెను. అది యతని జీవితములో మిక్కిలి గొప్ప సమస్య. అంతకంత కా సమస్య మూఁతి బిగిసి పోయెను. బంధుమిత్రులు పలుమారు నారాయణుని గలసికొని వివాహమాడుమని నొక్కి చెప్పఁ దొడఁగిరి. ఈ బాధ పడలేక నారాయణుఁ డొకనాఁడు గ్రామము వెలుపలనున్న యెత్తైన యొక వృక్షమెక్కి దాని కొమ్మల నడుమఁ గూర్చుండి తన సమీపమునకు వచ్చి వివాహము మాట యెత్తిన వారిమీఁద

రాళ్లు రువ్వఁ జొచ్చెను. అనేకులు నారాయణుఁడు పిచ్చివాఁడైనాఁడని తలంచి "నీకుఁ బిచ్చియెత్తిన"దని వానిమొగముమీఁదనే యనఁ జొచ్చిరి. ఈ మాటలచేత నతఁడు విసిగిపోయి కోపోద్రేకము నాఁపుకొనలేక చెట్టు క్రిందనున్న లోఁతునూతిలో దుమికెను. అది చూచినవారు నిశ్చేష్టులై వాని బంధువులు తమ్ము నిందింతు రేమో యని భయపడి గబగబ పారిపో యిరి. బాగుగా నీఁత నేర్చిన కొందఱు నూఁతిలో ఉరికిరి. కాని యతఁడు కనుపింపఁ డాయెను. ఈఁతగాండ్రు నూఁతిలో వెదకి వెదకి వాని జాడఁ గనుగొనలేక విసిగి యతఁడు క్రోధావేశమున నూతిలో బడి చచ్చె నని నిశ్చయించి యా దుర్వార్త సోదరునకును దల్లికిని దెలియఁ జేసిరి. నారా యణునకు నేమియు భయము లేదని శ్రేష్ఠుఁడు తల్లికి ధైర్యము చెప్పెను గాని పుత్రశోక జ్వరముచేతఁ గుందుచున్న తల్లిదుఃఖము నతఁడు సహింప లేకపోయెను. శ్రేష్ఠుఁడు తనకు సహజమైన మనోధైర్యముతో నూతికడకుఁ బోయి "నారాయణా! నారాయణా! నేను వచ్చినాను రా!" అని పిలి చెను. వీక్షించు వారందఱు విస్మయము నొందునట్లు నారాయణుఁడు వెంటనే నూతినుండి బయటకు వచ్చి సోదరునితోఁ బోయెను. అన్నగారి యెడల నారాయణునకు నత్యంత భక్తి గలదు. చెట్టుమీదనుండి నూతిలోఁ బడినప్పుడు నారాయణుని మొగము మీఁద నొక బొప్పి కట్టెను. అది యతని జీవితాంతము వఱకు మానక యుండెను. ఈవిషయము వలన నారాయణుని వివాహ ప్రయత్నము కొన్ని నాళ్లాఁగి పోయెను. కాని, పూర్తిగ నాఁగిపోలేదు. గ్రామ పురోహితుని మాటమీఁద నారాయణుని తల్లి యతనిని వివాహమాడు మని మాతృ సహజములైన శీతలవాక్యము లతో వివాహమున కతఁడొడంబడునట్లు చేయ యత్నించెను. శ్రేష్ఠుని వలె నారాయణుఁడు కూడ గృహస్థుఁడై సంసారముఁ జేయుచుండఁగాఁ జూడవలెనని యామె కెంతో యిష్టము. ఎట్టకేలకు మంచి సమయముఁ జూచి యొకనాఁడు రాణూబాయి కుమారుని జేరఁబిలిచి తన జన్మము వాని వివాహము వలననే సఫల మగునని, దన కున్న కోరిక యదొ క్కటియె యనియు నొక్కి చెప్పి బలవంతపెట్టెను. ఎంత వేఁడినను దల్లిమాట కతఁడిదమిత్థ మని ప్రత్యుత్తర మీయలేదు. తల్లిమాట కెదురా

డనని మాత్రము పలికెను. పెండ్లిపీఁటలమీఁదఁ గొంతసేపు గూర్చుండి పెండ్లికూతునకుఁ దనకు నడుమఁ దెఱ పట్టువఱకైనను నుండు మని యామె కోరెను. ఆ మాటలు విని బంధుమిత్రులు నారాయణుఁడు కట్టకడకుఁ దల్లిమాటలకు నంగీకరించె నని సంతోషించిరి. కాని, శ్రేష్ఠుఁడు మొదటినుండియుఁ దమ్ముని తత్త్వ మెఱిఁగిన వాడగుచే నతని మాటలు విశ్వసింపఁ డయ్యెను. వివాహ ప్రయత్నములు విసవిస జరుగజొచ్చెను. ఎట్టకేలకు వివాహమహోత్సవదినము వచ్చెను. చుట్టములు మిత్రులు చేరిరి. నారాయణునకుఁ బెండ్లికొడుకు సింగార మంతయుఁ జేసిరి. పెండ్లికూతునకు నెదురుగాఁ బెండ్లి పీఁటలమీద నతఁడు కూర్చుండెను. వధూవరుల నడుమ బ్రాహ్మణులు తెఱ పట్టిరి. పురోహితుఁడు బిగ్గరగా మంత్రములు చదువఁ జొచ్చెను. అంతలో సావధానుఁడవై యుండుమని పురోహితులు నారాయణుని హెచ్చరించిరి. ఇంకొక గడియలో వివాహమైపోవును. పెండ్లి కూఁతున కెదురుగఁ బీఁటలమీద కూర్చుండునని తల్లితోఁ జెప్పినమాట యతఁడు నిలుపుకొనెను. కాని, పెండ్లికూఁతు యొక్క దురదృష్టము చేతను మహారాష్ట్ర దేశస్థుల యొక్క యదృష్టము చేతను నతఁడు మఱి యొక దారి త్రొక్కఁదలఁచెను. అంతట నతఁ డకస్మాత్తుగాఁ బీఁటలపై నుండి లేచి పెండ్లికూతును బ్రియబంధువులను మాతృదేవతను సోదరుని విడిచి పెండ్లిపందిరిలోనుండి యావలకుఁ బాఱిపోయెను. అలోక సామాన్యమైన యీయద్భుతచరిత్రవల్లఁ బెండ్లిపందిరిలో గొప్ప గొడవ బయలుదేరెను. 'పెండ్లికొడుకు పాఱిపోయెను; పట్టుకొనుఁడు, పట్టుకొనుఁ' డని కేకలు వినఁబడెను. పెక్కంద్రు నారాయణుని వెంటఁ బఱుగెత్తిరి. కాని యతఁ డెవ్వరికిని జిక్కలేదు. మెఱపుఁదీవ వలె నతఁడు క్షణములో మాయమయ్యెను. అన్వేషింపఁ బోయినవా రాశాభంగ మొంది వెనుకకుఁ దిరిగి వచ్చిరి. ఈ వింతపని పెండ్లికొమారుని యింటను పెండ్లికొమార్తె యింటను విశేషదుఃఖము కలిగించెను. శ్రేష్ఠుఁడు నారాయణుని స్వభావ మెఱిఁగి యుండుటచే నతనికి నిర్బంధ వివాహము చేయుట పొరపాటని చెప్పెను. ఆ కాలపు దేశాచారమునుబట్టి జరుగుచున్న నిర్బంధవివాహ పద్ధతుల నతఁడు నిష్ఠురముగ ఖండించెను. ఈ విధముగ నాశాభంగ

పెండ్లికూఁతును మఱియొకని కిచ్చి వివాహము చేసిరి. ఈ 1620 సం॥న జరిగెను. అప్పటికి నారాయణునకుఁ బండ్రెండు ఁుల వయస్సు. అంత చిన్నవయస్సులో వైరాగ్యబుద్ధి కలుగుట నుకాదా! నారాయణుఁడు తల్లికోరినట్లు పెండ్లిపీఁటలపైఁ ను. కాని పెండ్లిచేసికొనక పాఱిపోయెను. అందుచేత మాతృ పాలన చేసిన వాఁడయ్యెను. తన పట్టు నెఱవేర్చుకొన్నవాఁ నారాయణుఁ డేల వివాహము మానెను? పెండ్లి యన్న నతనికి యెందులకు? వివాహవిధి పరిత్యజింపవలసినంత నీచవిధియా? ుఁడు దీనిని తన వేదాంతగ్రంథములలో నెచ్చటను దూషించి ను. వివాహ మాడఁదలఁచిన వారి యెడల వాని కంత ద్వేషము కపోవుటయే గాక, వివాహవిధిని గుఱించి యతఁడు ప్రసంగిం ంపత్యము నుత్కృష్టము చేసికొనుటకు మార్గము లుపదేశించు తనమట్టుకుఁ దాను సంసారబంధమునుండి విడివడుటయే ల్పముగాని తదితరము గాదు. మానవలోక కల్యాణమునకు ు స్వసుఖము విడచిపెట్టి కష్టపడుటయే ముఖ్యమని యతఁడు 'లోఁ జెప్పెను. పరమార్థము నిమిత్తము పాటుపడిన జన్మమే మానవు లనేకులేదో యొకదారి త్రొక్కి వేలకొలఁది ప్రతిదినము నిష్ఫలములు చేసి చనిపోవుచున్నారు. మనముక్తి మనము ంటయు మన ధనము మన సర్వస్వము భగవంతుని పాదముల ము మన జీవితపరమార్థము. దాసబోధలోఁ జెప్పిన పైమూఁడు ు నిరసించి జీవించినవాఁడు తల్లికి గర్భవేదన గలిగించినవాఁడు యగును. ఈ పై వాక్యములును మరి యిటువంటి వాక్య దివ్యజ్ఞాన సంపాదనెంత ముఖ్యమని నారాయణుఁ డెంత నొక్కి లియఁజేయును. మానవు లందఱు సోదరులని వారి సేమము. డు పాటుపడఁడో వాఁడు బ్రతికి యుండియు మృతి నొంది మనియు వాని జీవితము వ్యర్థమనియు నతఁడు బోధించెను. ధ్యములో దాసబోధలోనున్న యీ క్రింది మూఁడు విషయములు విశదపఱచుట యుక్తము.

తే॥ గీ॥ దేవదేవుఁడౌ శ్రీరామదేవుని కయి
యాప్తబంధువులును బరిత్యాజ్యు లవని
శాశ్వతసుఖంబు గోరెడి జనము లెల్ల
ప్రబల దుఃఖకారణమైన బంధుజనము
విడచి శ్రీరామపూజకే గడగవలయు.

తన చిన్న కుటుంబముయొక్క క్షేమమునేగాని విశ్వ మానవకుటుంబ క్షేమము నఱయువాఁడు స్వార్థత్యాగము తప్పక చేయవలెను. నారాయణుఁ డొక్కఁడే సంసారసుఖము నపేక్షింపక యట్లు చేసినవాఁడు. బ్రహ్మచర్యమే యుత్తమోత్తమమని నారాయణుఁడు గట్టిగ నమ్మెను. అతని భవిష్యజ్జీవిత మంతయు దానిమీఁదనే యాధారపడెను. గృహస్థాశ్రమమన్న నతఁడు భయపడలేదు. నిజముగ నతఁడు గృహస్థుఁడైన పక్షమున సాంసారిక యుద్ధము లతఁడు మిగుల శౌర్యముతోను మనోబలముతోను జేసి గెలిచి యుండును. కాని తాను తలపెట్టిన కార్యమునకు వైవాహికబంధ మెంత యాటంకమో యతఁడు తెలిసికొనెను.

# నాలుగవ ప్రకరణము

## నారాయణుఁడు రామదాసుఁ డగుట.

పెండ్లిపందిరిలోనుండి నారాయణుఁడు తిన్నఁగా నూరి బయటికిఁ బోయి యొక చెట్టు తొఱ్ఱలో మూఁడు దినములు దాఁగుకొనెను. అక్కడ నతఁడా మూఁడు దినము లన్నపానములు లేక యెవరికిఁ గనఁబడక యుండెను. అక్కడనుండి యతఁడు కృష్ణానదిగట్టు దారిఁబట్టి నాసిక పంచవటికిఁ బయనమై పోయెను. అక్కడ నతఁడు శ్రీరామ దేవాలయమున కరిగి యా దేవుని దర్శించి యటనుండి తకిలీ యను నొక చిన్న గ్రామమునకుఁ బోయెను. అచ్చట నతఁడు ఘోరమగు తపమాచరించి బహుకష్టముల బడఁజొచ్చెను. అతని నిత్య జీవిత మీలాఁగున నుండెను. పెందలకడ నిద్ర లేచి గోదావరినదికిఁ బోయి నడుములోఁతు నీళ్ళలో నిలిచి స్నానము చేసి సంధ్యావందనము చేసి మంత్రములు చదివి పరమధ్యాననిష్ఠుఁడై యుండును. ఈవిధముగ నతఁడు క్రమము దప్పక ప్రతిదినము ప్రొద్దు నెత్తిమీదికి వచ్చు వఱకుఁ జేయుచుండును. ఆ సమయమున మత్స్యములు మొదలయిన జలచరములు వానికాళ్ళు కొఱికి పుండ్లు చేయుచుండును. నిరంతరము నీటిలో నుండుటచే నడుము క్రింది భాగము తెల్లఁబడి యుండెను. రెండు జాముల తరువాత నతఁడు తన బసకు సమీపమున నున్న కొన్ని యిండ్లకు మాత్రమే పోయి మాధుకరము చేసికొని దేవునకు నైవేద్యము పెట్టి, యది దినమున కొక్కసారి మాత్రమే భుజించును. తన గుహలోఁ గూర్చుండి భోజనానంతరమున నతఁడు రాత్రి ప్రొద్దుపోవువఱకు ధ్యానశ్లోకములను గట్టిగఁ జదువు చుండును. ఆయన పదిమందితోఁ గలసి మెలసి యుండక సంఘ జీవితమును బరిత్యజించి యేకాంతముగ నుండుటకే యిష్టపడెను. రామదాసుఁడు చేసిన ఘోరతపస్సుచేత నతని శక్తి యుడిగెను. మేను శుష్కించెను. అప్పటికతఁడు ద్వాదశవర్షప్రాయుఁడు మాత్రమేయని పాఠ

కమహోశయులు గ్రహింపవలయును. ఈ బాలకుని తపస్సు చూడ భాగవతములోఁ జెప్పఁబడిన ధ్రువుని తపస్సు జ్ఞప్తికి వచ్చును. అట్టి మహాతపస్సు చేసినవారిలో చాలమంది జీవింపక నశింతురు. మహోత్సాహము, మనోనిశ్చయము, ధైర్యముగలవానికి నేదియు నసాధ్యము గాదు. ఈ తపస్సు వల్లను నేర్చిన మంత్రశక్తి వల్లను రామదాసుఁడు క్రమక్రమముగ యోగి యయ్యెను. అతని మొగమున బ్రహ్మవర్చస్సు తాండవమాడఁజొచ్చెను. లోపలనున్న దివ్యజ్ఞానము శరీరమంతటఁ బ్రతిఫలింపఁ జొచ్చెను. అతని కద్భుత శక్తు లలవడెను. సంభాషణము -- గంభీరమయ్యెను. చేత నొక దండమును చంక నొక జోలెయు మొలకొక లంగోటియు నతఁడు ధరించు చుండెను. అతఁడు రెండు గ్రంథముల రచియించెను. ఒకటి మానసిక శ్లోకములు. రెండవది దాసబోధ. అతఁడా గ్రంథములలో ముట్టని విషయము లేదు. ఆనాఁడు నేఁటివలె గొప్ప విద్యాభ్యాసములకు నవకాశములు లేవు. లేక పోయినను నేఁటికాలపు వారికి మహోశ్చర్యము గలిగించు విషయములు భావములు నాగ్రంథములలో నున్నవి. రామదాసుకడ గూడ నద్భుతశక్తులు కలవందురు గాని యా యద్భుతశక్తులను నతఁడెప్పుడు నుపయోగింప లేదు. ఉపయోగించుటకు నిష్టములేదు. అయినను తప్పినది కాదు. అతఁడు తకిలీ గ్రామములో నొక గుహలోఁదపస్సుఁ జేయుచున్న కాలమున నచట నొక యువకుఁడు క్షయరోగ పీడితుఁడై మృతినొందెను. అతని భార్య సహగమనము చేయఁదలంచి శ్మశానమునకుఁ బోయెను. కాఁడు పేర్చఁబడెను. అంతయు సిద్ధమయ్యెను. అప్పుడా యిల్లాలు సమీపమున నొక గుహలో మహాపురుషుఁ డొకఁడు తపస్సు చేయుచున్నాఁ డని విని యాతని దర్శనము చేయుటకై పోయి రామదాసునకు నమస్కరించెను. ఆమె నతఁడు దీవించి "ఎనమండుగురు బిడ్డలు నీకుఁ గలుగుదురుగాక" యని యాశీర్వదించెను. "స్వామీ! యీ జన్మముననా? మఱియొక జన్మముననా?" యని యామె యడిగెను. "మఱియొక జన్మ మేల? ఈ జన్మమునన" యని యతఁడు బదులు చెప్పెను. అంతకు ముందే తన భర్త కాలధర్మము నొందె నని మనవి చేసెను. భయము లే దని రామదాసుఁ డభయ మిచ్చి లేచి శ్మశానమునకుఁ బోయి శవమును జూచి రామ నామము స్మరించుచు

మీఁద కమండలూదకము చల్లి లెమ్మని యానతిచ్చెను. చూడ
ందఱు మహాశ్చర్య నిమగ్నులగునట్లు చనిపోయిన మనుష్యుఁడు
ాసునకు నమస్కరించి యతఁడే తన్ను బ్రతికించె నని చూపి
ంతట రామదాసుఁడు మరి యిద్దరు కుమారులు కూడ వారికి
ని దీవించి వెడలి పోయెను. ఆ పతివ్రత మొదటి కుమా
ాసునకు శిష్యునిగ నర్పింతు నని ప్రతిజ్ఞ చేసెను. అట్లే యా
ప్రథమపుత్రుని రామదాసునకు సమర్పించిరి. రామదాసుఁడు
వుఁ" డని పేరుపెట్టెను. అతఁడే రామదాసుని శిష్యగణములో
ు. క్రమక్రమముగ నామెకు పదిమంది బిడ్డలు గలిగిరి. ఆ
ుటుంబమునకు 'దశపుత్ర' వారని యింటి పేరు గలిగెను. ఆ
ప్పటికి నా కుటుంబమునఁ జరుగుచున్నది.

---

# ఐదవ ప్రకరణము

## హిందూదేశ సంచారము

అతఁడు మహారాష్ట్రదేశము విడిచి యుత్తరహిందూ స్థానమునకుఁ బోయి గయాక్షేత్రముచేరి యచ్చట పూర్వము బుద్ధదేవుఁడు తపస్సు చేసిన మఱ్ఱిచెట్టు క్రిందనే కూర్చుండి పండ్రెండు సంవత్సరములు ఘోరతపస్సు చేసి సాటిలేని యింద్రియ నిగ్రహమును, యసమానమైన యాత్మజ్ఞానమును సంపాదించెను. అతఁ డంతతోఁ దనివి నొందక భరతఖండమునఁ గల నానా భాగములకుఁ బోయిఁ యచ్చటి జనుల వేషభాషలను వివిధాచారములను గ్రహించి, సమస్త పుణ్యస్థలములను జూచి, తీర్థయాత్రలు సేవించి లోకానుభవము నార్జించి, పిదప స్వదేశమునకుఁ బోవలె నని సంకల్పించెను. తాను లే నప్పుడు తకిలీ గ్రామములో స్థాపించిన మారుతీ దేవాలయమునకు నిత్య పూజా కైంకర్యములు నీమముతో నడుపుటకు సర్వవిధముల నుద్ధవుఁడే యర్హుఁడని వాని నా యాలయమున నుంచి పోయెను. కాలినడకను కాశీపట్టణమునకు పోయెను. అచ్చట నతఁడు శ్రీవిశ్వేశ్వరస్వామివారి యాలయము ప్రవేశింపఁ బోవుచుండ నచ్చటి బ్రాహ్మణులు వాని నడ్డు పెట్టిరి. ఆతని లంగోటీ చూచియు జడలు చూచియు మలినమైన బట్టలను జూచియు నతఁ డెవఁడో తక్కువజాతి వాఁడని వారు భావించి యట్లు చేసిరి. అడ్డు పెట్టఁగానే యతఁడు వారితో వివాదపడక తిన్నగా నతఁ డటనుండి వెడలి పోయెను. రామదాసుఁ డట్లు వెడలి పోఁగానే విశ్వేశ్వరాలయములో నున్న శివలింగమదృశ్య మయ్యెనఁట. అర్చకులు ధర్మకర్తలు మొదలయినవారు మిక్కిలి యాశ్చర్యపడి కళవళపడి యా వింతకుఁ గారణము రామదాసుని రానీక వెడలఁ గొట్టుటయే యని నిశ్చయించిరి. వారు తొట్రుపడి వానివెంట పరుగులెత్తి వానిని గలసికొని, తమ్ము క్షమించి యాలయమునకు దయచేయు మని ప్రార్థించిరి. రామదాసుఁడు మారు

మాటాడక మౌనముతో వారివెంట విశ్వేశ్వరాలయమునకుఁ బోయెను. పోయిన తోడనే లింగమెప్పటియట్లు గుడిలోఁ గనఁబడెనఁట. అడ్డుపెట్టిన వారి గర్వభంగ మయ్యెనట. కాశికానగరములో నున్న దివ్యస్థలము లన్నియు నతఁడు సేవించెను. అన్నిటికేమి గాని యచ్చట హనుమాన్ ఘట్ట మని యొక ఘట్టము గలదు. పేరు హనుమాన్ ఘట్టమేగాని యచ్చట హనుమంతుని యాలయము లేదు. రామదాసుఁడు మారుతి దేవాల యముఁ గట్టించి, యందు హనుమంతుని విగ్రహము నెలకొల్పి పూజా నమస్కారములు ప్రతి దినము చేయు మని బ్రాహ్మణులకుఁ జెప్పెను. కాశీపురి నుండి రామదాసుఁ డయోధ్యాపురి కేఁగెను. అయోధ్యాపుర దర్శనము కాఁగానే యతని యానందము మితిమీఱెను. సూర్యవంశ ప్రదీ పకుఁడు, పితృవాక్య పరిపాలకుఁడు, పరమదైవతము నైన శ్రీరాముఁడు పుట్టిన చోటును, ఆ మహానుభావుఁడు రాజ్యమేలిన చోటును గనుఁగొను భాగ్యము తన కబ్బిన దని యతఁ డానంద పరవశుఁ డయ్యెను. అతఁ డక్కడఁ గొన్నిదినములు గడపి పిమ్మట మధురాపురము, గోకులము, బృందావనము, మొదలైన దివ్యక్షేత్రముల సేవించెను. ఆతని రాక విని జనులు మహానుభావుఁడగు నతని దర్శనము చేసి యాశీర్వచనము పొంద జనులు గుంపులు గుంపులుగఁ జేరిరి. ఏలయన నతని కీర్తి యతనికంటె ముందే యచ్చటికి జేరెను. రామదాసుఁడు తనకుఁ జిక్కిన యవకాశము లను వ్యర్థముగఁ బోనిచ్చువాఁడు గాదు. అందుచే నతఁడు అచ్చట కొందఱి కుపదేశములు చేసి మఠములు స్థాపించి తన బదులుగాఁ బనిచేయు మని వారిని నియోగించెను. అతని పనికి నదే ప్రారంభము. కాని యతఁ డుత్తర హిందూస్థానమున నధికముగ మతవ్యాప్తి చేయఁదలఁచుకొనలేదు. తన యావచ్ఛక్తిని దనకాలమును దన జ్ఞానమును మాతృదేశమైన మహా రాష్ట్రమునకే సమర్పింపవలె నని యతని నిశ్చయము. అతఁ డంతట శ్రీకృష్ణునకు మున్ను నివాసమైన ద్వారకానగరమునకు పోయి యచ్చట నొక శ్రీరామాలయము స్థాపించి సంప్రోక్షణాది కర్మలు గావించి యచ్చట నుండి కాశ్మీరమునకు రాజధానియైన శ్రీనగరమునకుఁ బోయెను. అచ్చట శిక్కుమత స్థాపకుఁడైన నానక్ గురువుచేత స్థాపింపబడిన మఠము కలదు.

యది పరమ పవిత్రమైనదని యా మతస్థులంద అచ్చటికి యాత్రఁ జేయు చుందురు. రామదాసుఁడు వచ్చినాఁ డని విని యా మతస్థులు తక్కిన శ్రీనగరవాసులు వానితో వేదాంత చర్చలు చేయఁదలఁచి వాని నాహ్వానించిరి. ఆహ్వాన మంగీకరించి రామదాసుఁ డక్కడకుఁ బోయెను. వారు రామదాసుని క్లిష్టములైన వేదాంత సమస్యా సముద్రమున ముంచివైచిరి. ఆతఁ డవి లెక్క సేయక సమస్యలన్నిటికి సమయస్ఫూర్తిగ యుక్తితోను నేర్పుతోను సమాధానము లిచ్చి వారిని జయించెను. వేదాంత శాస్త్రము యొక్క గుట్టు మట్టు తెలియక లోఁతు నందలేక పైపైనే వారీదులాడుచున్నా రని స్పష్ట ముగా నతఁడు వారికిఁ దెలియఁ జెప్పెను. నానకు మతస్థులు వాదములో పరాజయము పొందితి మని యొప్పుకొని యంతటినుండి రామదాసును దమకు బరమ గురువుగా నంగీకరించితి మని చెప్పిరి. వా రందఱు తమ కుపదేశము చేయుమని ప్రార్థించిరి. అందు కతఁడు సమ్మతింపక వారితో నిట్లనియె. "మహాపురుషుఁడైన నానకు మత బోధ కత్తియంచువలె పదునై నది. మహమ్మదీయులుఁగూడ "రామ రామ" యనుచుందురు. దానికిఁ గారణము నానకునందుఁ గల జ్ఞానజ్యోతియే కారణము. మీ రాయ నకు నమ్మిన శిష్యులు. మీగురువైన నాన కే ధర్మముల నుపదేశించెనో నా యుపదేశములు నట్టివే. మతము మార్చుకొనుట మిక్కిలి యాక్షేప ణీయమని నా యభిప్రాయము. నానకునే యనుసరింపుఁడు. అందుచేతనే మీకు శాశ్వతానందము కలుగును." అనంతరము రామదాసుఁడు బదరీ నారాయణమును, కేదారేశ్వరమును, హిమాలయపర్వత శిఖరముమీఁద నున్న మానస సరోవరమును గాంచెను. ఆ పర్వతముమీఁదనే శ్వేత మారుత విగ్రహము గల దని వినెను. మనుష్యమాత్రుఁ డచ్చటికిఁ బోఁలేఁడని కూడ నతఁడు వినెను. అక్కడకు వెళ్ళసాహసించిన మహానుభావుఁడు శ్రీ శంకరాచార్యుల వా రొక్కరు మాత్రమే యని యచ్చటి వారు చెప్పిరి. రామదాసుఁ డా క్షేత్రమునకుఁ బోయి మహాత్ముని దర్శించి వర్షకాలము నాలుగు నెలలు గడగడ వడకించు చలిలోను మంచులోను గడపెను. హిమాలయ పర్వతములు దిగి శ్రీ జగన్నాథ క్షేత్రమునకుఁ బోయి యచ్చటి నుండి తూర్పుసముద్రతీరమునఁ బ్రయాణముచేసి రామేశ్వరము పోయి

యచ్చటనుండి లంకకుఁ బోయెను. లంకాద్వీపము విడిచి రామదాసుఁడు పశ్చిమ సముద్రతీరమునఁ బ్రయాణముచేసి త్రోవలో నున్న పుణ్యక్షేత్రముల నన్నింటిని దర్శనము చేసి క్రమముగ మహాబలేశ్వరము చేరెను. ఈ మధ్యకాలమున నక్కడక్కడ మారుతి మఠముల స్థాపించి వానియందుఁ బూజా పురస్కారములు జరుగునట్లు చేసెను. ఇట్లు, పండ్రెండు సంవత్సరము లాసేతుహిమాచల పర్యంతమైన భరతఖండమంతయు యాత్రలు సలిపి సలిపి యెట్టకేలకు నాసిక జేరెను. అక్కడఁదన ప్రియశిష్యుఁడైన యుద్ధవుని గలిసికొని యతఁడు తన కృత్యములను శ్రద్ధాభక్తులతోఁ జేయుచున్నట్లు విని సంతోషించెను. పిమ్మటఁ బవిత్ర మగు గోదావరి జలమున స్నానముచేసి యతఁడు రామదేవుని యాలయమున కరిగిఁ నమస్కరించి యిట్లనియెను. "భగవంతుఁడా! శ్రీరామా! మీ యనుగ్రహము చేత నీ పండ్రెండు సంవత్సరములు పుణ్యక్షేత్రముల సేవించి యాత్ర సలిపితిని. ఈ యాత్రలో నే పుణ్యము సంపాదించితినో యది యెల్ల శ్రీరామార్పణ మని మీకర్పించెదను. కరుణించి స్వీకరింపుము" అని పలికి శ్రీరాముని హస్తములలో జలము ధారబోసెను. ఈ యాత్ర యంతయు రామదాసుఁడు జీవనాధారము లేక, చేత ధన మేమియు లేక కాలినడకనే జరిపె నని పాఠకులు గ్రహింతురుగాక. రామదాసుఁడు పాదచారియై పోవుటచేత భరతఖండమునఁ గల మండలము లన్నిటిలో జనుల యాచార వ్యవహారములను గ్రహించుట కవకాశము గలిగెను. ఈనాఁటి యాత్రలకు, రామదాసుఁడు పదునేడవ శతాబ్దమున జేసిన యాత్రలకు జాల భేదము గలదు. ఈ నాఁటివారు ఓడలలోను, ధూమ శకటములలోను నెక్కి పయనములు చేయుదురు. ఆంగ్లేయ కవియైన 'రస్కిను' అను నతఁడు "రైలు ప్రయాణము నిజమైన ప్రయాణము కాదు" అని వక్కాణించెను. ఏలయన నొక బంగీ పొగబండిలో బడవైచి యొక చోటనుండి మరియొక చోటికి బంపినట్లే మనుష్యుని గూడ నొకచోటఁ బొగబండిలో నెక్కించి మరియొకచోట దింపుదురు. కాన నది నిజ మయిన ప్రయాణము కా దని యతఁడు పలికెను. నిజముగ రామదాసుది మతసంబంధమైన తీర్థయాత్రయైనను, నతఁ డేఁగిన చోట నెల్ల నక్కడి స్థితిగతు లన్నిటిని దన భవిష్యత్కార్యమునకు

ననుకూలముగఁ జేసికొనునట్లు గ్రహించెను. ఒక స్థలమందు నతఁడిట్లు చెప్పెను. "ఈ ప్రపంచ మనేక విధములైన మనుష్యులతో నిండియున్నది. వారినడుమ సంచరించుటవలన మన కెంతో జ్ఞానము కలుగును. అది మన కాశ్చర్యముఁ గొలిపి యెన్నో జీవిత సమస్యలను సాధించును. కనుక మనము నిరంతరము ప్రయాణము చేయవలెను. నూతన ప్రదేశములను దర్శింపవలెను. దానివలన ననేక దేశముల పరిచయము మనకుఁ గలుగును. అనేక తపస్సులు చేయవలెను. అనేక పుణ్యక్షేత్రముల సేవింపవలెను. వైరాగ్యము కలిగి యుండవలెను. స్వార్థత్యాగముచేత నూతన శక్తులెన్నో ప్రభవించును." ఈ శక్తివల్లనే యతఁడు శివాజీకి సాయము చేయగలిగెను. తాను స్వయముగఁ బాదచారియై యాత్ర సల్పి రామదాసుఁడు తక్కినవారికి మార్గదర్శకుఁడయ్యెను. ఈనాఁడు లోకసేవఁ జేయఁ బ్రయత్నించువారు విఫలప్రయత్ను లగుటకు ముఖ్యకారణము జనసామాన్యముతో సంబంధము లేకపోవుటయే. జనులతోఁ గలసి మెలసి యుండని వాఁడు జనులపక్షమునఁ గట్టిగఁ బనిఁ జేయలేఁడు. కావున రామదాసుఁడు నానావిధములైన జనులతో మనము సంబంధము కలిగి యుండవలెనని బోధించుచుండును. కూపస్థమండూకము వలె నొకచోఁ గూర్చుండెడివాఁడు సకల వ్యవహారములు చెడఁగొట్టుకొనును. కావున దేశాటనము చేసి యనేకులతో సంభాషింపవలెను.

---

# ఆఱవ ప్రకరణము

## అప్పటి దేశస్థితి

ఆ కాలమున మహారాష్ట్రదేశము మిక్కిలి దుస్థితిలో నుండెను. ప్రజలలో నైకమత్యము లేదు. దేశాభిమానమంతకుమున్నే లేదు. ఆత్మ లాభపరాయణత్వమేగాని, స్వార్థత్యాగము లేదు. ఆత్మగౌరవ మంతరించెను. పరసేవాసక్తి క్షీణమయ్యెను. ఆ నాఁడు మహారాష్ట్ర దేశములో దక్షిణమున బిజాపురసుల్తాను పాలించుచుండెను. కన్నడదేశమునఁ గొంత భాగమును, మహారాష్ట్రమునఁ గొంత భాగమును బిజాపూరు ప్రభువుల పాలనకు లోఁబడియుండెను. దేశమందలి సరదారులు వీరులు బిజాపూరు సుల్తానుల కొలువులోఁ జేరి స్వదేశస్థుల మీఁదఁ గత్తిగట్టి ప్రభువుల యనుగ్రహము నకుఁ బాత్రులై వారిచేత బిరుదులు, ముఖాసాలు, జమీలు స్వీకరించి యధికారుల కనుసన్నల మెలఁగుచు దైవభక్తిగాని దేశభక్తిగాని లేక బానిస లట్లు మెలఁగుచుండిరి. కత్తిపట్టి పోరాడఁగల బంట్లు సయితము సుల్తానుల పటాలములలోఁ జేరి పొట్టఁ బోసుకొనుచుండిరి. బిజాపూరు సుల్తానులు, అహమ్మదునగర సుల్తానులు, లేనిపోని వంకలు గల్పించుకొని యుద్ధములు చేయుచుండిరి. దేశస్థుల యర్థప్రాణములకు క్షేమములేదు. స్త్రీలమాన ప్రాణములు దక్కించుకొనుట కష్టముగ నుండెను. అప్పుడప్పుడు మహమ్మ దీయ ప్రభువుల సేనాపతులును సరదారులును దేవాలయములపైఁ బడి దోఁచి నాశనము చేయుటయుఁ గలదు. ఈస్థితి రామదాసుఁడు చక్కఁగ గ్రహించి స్వదేశమును నుద్ధరించుటకు సమకట్టెను. రామదాసుకంటెఁ బూర్వము తుకారాము, ఏకనాథుఁడు, నామదేవుఁడు మొదలగు భక్తులు బయలుదేరి దేశస్థుల హృదయములలో నొక కొంత యాత్మ జ్ఞానమును దైవభక్తిని నెలకొల్పిరి. వా రాపనిఁ జేసియుండుట చేతనే రామదాసు పని సులభ మయ్యెను. యాత్మజ్ఞానము, దైవభక్తి కొంతయైనను గుదిరినఁగాని,

నిజమయిన దేశాభిమానము కుదురదని రామదాసు యొక్క దృఢవిశ్వాసము. రామదాసు బోధించిన ధర్మముపేరు మహారాష్ట్ర ధర్మము. ఇందు రాజకీయధర్మమును మతధర్మమును గూడ నిమిడి యున్నవి. ఈబోధకు రామదాసుఁడు చిరకాల తపస్సుచేతను, స్వార్థత్యాగముచేతను, దీర్ఘయాత్ర చేతను తగినంత యనుభవము గలిగి కావలసిన సాధనసామగ్రి నంతయుఁ జాగ్రత్త పెట్టుకొని పనిచేయుటకు నడుముఁ గట్టికొనెను. వర్ణాశ్రమధర్మ భేదము వృద్ధికిఁ గొంత యాటంకమయినను దానిని నాశనము చేసి సర్వ జన సౌభ్రాతృత్వ మను పేరఁ బూర్వపద్ధతులను కలగాపులగముఁ జేయుట కతనికిష్టము లేదు. ఏ యభివృద్ధి కయినను మతమే మూలాధార మని యతఁడు నమ్మి యున్నందున జనుల హృదయములలో మతాభిమాన మహాగ్నిని బ్రజ్వలింపఁజేయ సమకట్టెను. నిరాశాతాపముచే వాఁడిపోయిన జనుల మనస్సుల మీఁద రామదాసుఁడు చల్లని ధర్మోదకములఁ జల్లి చిగురెత్తఁ జేసెను. పనిని నతఁడు నిరాడంబరముగను, నిశ్శబ్దముగను బ్రారంభించెను.

శివాజీ యంతకుమున్నె స్వరాజ్యసంస్థాపన ప్రారంభించెను. ఆతని సాహసములవల్లను, విజయములవల్లను నతనికి గోబ్రాహ్మణ పరిపాలకుఁ డని పేరు వచ్చెను. సాధుజంతువు లయిన గోవులను మిక్కిలి పవిత్రు లయిన బ్రాహ్మణులను రక్షించుటకు శివాజీ కంకణముఁ గట్టికొన్నాఁ డని జనులు చెప్పుకొనుట కారంభించిరి. ఈ విషయములను రామదాసుఁడు వినకపోలేదు. రామదాసునకుఁ గావలసిన బనులుఁ గూడ నట్టివే. కాని శివాజీ యొక్క సాహసములు మహారాష్ట్ర సామంతులలోఁ గొందఱికి వానియెడ ద్వేషముఁ గలిగించెనే గాని, విశ్వాసము గలిగింపలేదు. శివాజీ కంటె ముందుండిన మహారాష్ట్ర ప్రభువులు స్వతంత్ర మహారాష్ట్రముఁ బ్రతిష్ఠించుటకుఁ బ్రయత్నింపరైరి. ఇట్టి యుదారభావము మొట్టమొదట శివాజీకే కలిగెను. మహారాష్ట్ర సామంతులు మహమ్మదీయ ప్రభువు లను గ్రహించి తమకిచ్చెడు బిరుదములతోను, గౌరవములతోను, జాగీరులతోను, సంతుష్టులై యున్నకుండిరిగాని, మాతృదాస్య విమోచనమునకునై పాటుపడిన వారొక్కరును లేరు. అట్టి స్వతంత్ర మహారాష్ట్ర సామ్రాజ్యసంస్థాపన గౌర

వము శివాజీకే దక్కెను. అందుచేతనే దేశస్థు లందఱు శివాజీని మిక్కిలి గౌరవించి పూజించుచున్నారు.

గట్టిస్వతంత్ర సామ్రాజ్యస్థాపనము మత మనియెడు గట్టి పునాదిమీఁదనే గాని నిలువఁబడ దని రామదాసు యొక్క నమ్మకము. అందుచేత రామదాసుఁడు జనులకు దేశాభిమాన మంత్రము, మతాభిమానమంత్రము జోడించి ప్రయోగించెను. ఆ కారణమున జనులకుఁ బరసేవాసన్నిపాత జ్వరము కొంత తగ్గెను. ఈక్రింది పద్యము రామదాసు యొక్క సంకల్పమును సంగ్రహముగఁ దెలియ జేయును.

తే॥ గీ॥ మొట్టమొదటను శ్రీహరి పూజనంబు
దేవసేవకు వెన్కను దేశసేవ
తక్కిన విషయములయందుఁ దగిన శ్రద్ధ
పూనవలయును మానక మానవుండు.

రామదాసుఁడు తీర్థయాత్రా సమయమున హిందూ దేశమునందు నానాభాగములలోఁ గల యాత్మజ్ఞానులను బ్రహ్మవేత్తలను దేశప్రఖ్యాతి గల సన్యాసులను యోగులను సందర్శించి వారితో వివిధ విషయములను బ్రసంగించి వారికిఁ దన పూనికను దెలియబఱచెను. వా రాతని వృత్తాంతమును విని యతని బ్రహ్మచర్య దీక్షకును దైవభక్తిని దేశాభిమానమునకును, యాతని నీమములకును నివ్వెఱపడి యాసేతుహిమాచల మగు భరతఖండమున నటువంటి యోగి లేఁడని నొక్కి చెప్పి వానిని దీవించి పంపిరి. రామదాసుఁడు మహారాష్ట్ర దేశమున స్థిరపడి ధర్మబోధ నారంభించిన తరువాత నాతని పరిచయము గల యోగులు సన్యాసులు పెక్కండ్రు వచ్చి వానిని సందర్శించి వేదాంతవిషయములను జర్చించి ధన్యులయి పోవుచుండిరి. నారాయణబువా, మాహులి నివాసియైన జయరామస్వామి, ప్రసిద్ధరాజయోగియైన రంగనాథస్వామి, తుకారాము మహారాజ్, చించివాడవాసియైన మొరయదియొ, రఘునాథస్వామి, ఆనందమూర్తి, రామదాసుని తఱచు సందర్శించు వారిలో ముఖ్యులు రామదాసుఁడు దేశసేవాపరాయణుఁ డయి తద్వృద్ధికై నిరంతరాలోచనామగ్నుఁ

డయినను నారీమతల్లియైన తన తల్లిని గాని సోదరునిగాని మఱువలేదు. ఆహా! తల్లి దండ్రులను సోదరులను ఎవఁడు మఱువఁగలఁడు. రామదాసు తన మాతృ దేవతను స్మరియింపని దినమే లేదు. పెండ్లిపందిరిలో నుండి హఠాత్తుగ రామదాసు పాఱిపోయినది మొదలు ప్రేమకు నిలయమైన యీ మాతృదేవి యిరువది నాలుగు సంవత్సరముల దీర్ఘకాలము దారుణ మైన యీ పుత్రవియోగదుఃఖము నెట్లు సహించెనో మాటలలో వర్ణించుట మిక్కిలి కష్టము. ముడుతలుపడిన యీమె చెక్కులు పుత్రునికై యీమె విడిచిన బాష్ప బిందుధారలచేఁ దఱచుగ దడియుచుండెను. నారాయణ నారాయణ యను నామము నిరంతరము నామెనోట నాడుచుండెను. రామదాసుని ప్రఖ్యాతిని వాని తల్లియు సోదరుఁ డయిన శ్రేష్ఠుఁడును విని యుండిరిగాని తమ నారాయణుఁడే రామదాసని వా రెఱుఁగరు. ఎఱిఁగియున్న యెడల వాని యసమాన కీర్తి వారికిఁ గొంత మనశ్శాంతిని, సంతుష్టిని గలిగించియుండెడిది. నిరంతర పుత్రశోక జ్వరముచేత నెల్లప్పుడు కన్నీరు గార్చినందున "రాణూబాయి" యొక్క దేహారోగ్యము చెడి యెట్టకేలకు నామె కన్నులు పోయెను. ఈ యిరువది నాలుగు సంవత్సరములలోను, రామదాసుని సోదరుఁడయిన శ్రేష్ఠుఁడు తగినంత యాత్మజ్ఞానము సంపాదించి వేదాంతియై గొప్ప గృహస్థుఁడై మాతృవాక్య పరిపాలకుఁడై భార్యానురాగియై యతిథులకు నభ్యాగతులకు నన్నోదకము లిచ్చి వారి నాదరించుచుఁ బేరుప్రతిష్ఠలఁ గాఁచుచుండెను. అంతతోఁబోక అతఁడు "భక్తి రహస్య" మను నొక మహాగ్రంథమును మహారాష్ట్ర భాషలో రచించెను.

ఎట్టకేలకు రామదాసుఁ డిరువది నాలుగు సంవత్సరముల తరువాత జన్మస్థాన మగు జాంబుగ్రామమునకుఁ జేరెను. చేరి మొట్టమొదట మారుతి దేవాలయమునకుఁ బోయి యా దేవుని సేవించి, తనయింటి ముంగిలి వాకిటికిం బోయి, తాను బిచ్చమునకుఁ బోవునపుడు పలికెడి పలుకులే "జయజయ రఘువీరసమర్థ" యని గట్టిగఁ బలికెను. మన దేశమున బిచ్చగాండ్రు "సీతారామాభ్యాం నమః" యను నట్లే యా దేశమున యాయ వారమునకుఁ బోవువారు జయజయ రఘువీర సమర్థ యనుట వాడుక,

అప్పుడు రామదాసుని తల్లి ముందటి వాకిటలో వసారా మీఁద గూర్చుండెను. ఎవఁడో బిచ్చగాఁ డనుకొని బిచ్చముఁ బెట్టు మని తన కోడలిని అనఁగ శ్రేష్ఠుని భార్యను బిలిచెను. అప్పలుకులు విని రామదాసుఁడు తల్లి నాన వాలు పట్టి మెట్లెక్కి వసారామీఁదికిఁ బోయి "అమ్మా యీ బిచ్చగాఁడు సామాన్యముష్టితోఁ దనివి నొందఁడుసుమీ" యనుచు జడలు గట్టిన తన తల యామె పాదములపైఁ బడవైచి నమస్కరించెను. ఆ స్పర్శవల్లనే యా తల్లి విషయము గ్రహియించి 'నాయనా! నా ప్రియపుత్రుఁడైన నారోబ మరల వచ్చెనా!' యని గట్టిగ నఱచెను. నారోఁబ యనఁగ నారాయణుని ముద్దు పేరు. "తల్లీ యతఁడే యితఁడు!" అని రామదాసుఁడు బదులు చెప్పెను. ఆ మాతాపుత్రసమాగమమందుఁ దల్లికిం గొడుకునకుం గలిగిన పారవశ్యమును ఎవఁడు వర్ణింపఁ గలఁడు. ఆమె కన్నులనుండి బాష్పములు దొడదొడఁ గారెను. శరీరము వడఁకెను. కంఠధ్వని గద్గద మయ్యెను. ఆమె కుమారుని గట్టిగఁ గౌఁగలించుకొనెను. 'నాయన, నారాయణ, నా కన్నులతో నే నిప్పుడు నిన్నుఁ జూడలేను. మందభాగ్యురాలను.' "అమ్మా మనము శ్రీరామచంద్రుని భక్తితోఁ గొలుచు చున్నప్ప డా మహాత్ముఁడు మన కోర్కెలను దీర్పఁడా," యని పలికి రామదాసుఁడు తన చేతితోఁ దల్లి కన్నులను నిమిరెను. అంతట శ్రీకృష్ణ వరప్రసాదమున ధృతరాష్ట్రునకు దృష్టి వచ్చినట్లు నామెకు నద్భుతముగ దృష్టి వచ్చెను. రాణూబాయి కన్నులు విప్పి బిచ్చపు జోలితో, జడలు గట్టిన తలతో మొగమునుండి వెలువడు బ్రహ్మతేజస్సుతో, దండముతో మాఱిపోయిన రూపుతో దన యెట్టయెదుట నున్న కుమారుని గని తల్లి సంతసించెను. ఆతని యన్న గారైన శ్రేష్ఠుఁడు లోపల సంధ్యావందనముఁ జేసికొనుచుఁ దమ్ముని కంఠధ్వని విని పఱుగు పఱుగున వచ్చి తమ్ముని జూచి మహానందభరితుఁ డయ్యెను.

రామదాసుఁడు వచ్చినాఁ డని విని గ్రామవాసు లందఱు గుంపులు గుంపులుగ నచ్చటకు వచ్చిరి. తమ పూర్వ మిత్రుఁడైన నారాయణుఁడు రామదాసుఁ డను పేర గొప్ప యోగీశ్వరుఁ డయినందుకు వానిరూపుఁ జూచి యాశ్చర్యము నానందముఁ బొందిరి. చూడఁగనే వా రప్రయత్న

ముగఁ దలలు వంచి యా యోగికి నమస్కరించిరి. ఆతని బాల్యస్నేహి తమ పిల్లలను వెంటఁ బెట్టుకొని రామదాసుని జూడవచ్చిరి. పూర్వః వారు రామదాసుని మిక్కిలి చనువుతోఁ బిలిచి సమీపింపకుండ శిర వంచి చేతులు జోడించి దూరమున భయభక్తులతో నిలిచిరి.

రామదాసుఁడు కొన్ని దినములు తన తల్లితోను, సోదరునితోను వారియాజ్ఞను దీవనలను బొంది, తాను దలపెట్టిన మహత్కార్యః వారికిఁ దెలిపి, మహారాష్ట్ర ధర్మమును జనులకు బోధించుటకు నిల్లు కృష్ణానదీతీరమునకుఁ బోయెను.

---

# ఏడవ ప్రకరణము

వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వావా భోక్ష్యసే మహీమ్
దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః॥
సుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ
యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యపి॥

-- భగవద్గీత. అ. 2.

తివా స్వర్గమును బొందుదువు. గెలిచితివా భూమి ననుభవిం
మచేత నో యర్జునా! యుద్ధము చేయసిద్ధమై లెమ్ము.

దుఃఖములను లాభాలాభములను జయాజయములను సమముగా
మునకు సిద్ధము గమ్ము! పాపము చెందవు."

యూ శ్లోకముల యర్థము.

)భ్రాతృ సందర్శనమైన తరువాత రామదాసుఁడు స్వగ్రామము
ండాకొండలో నొక గుహఁ జేరెను. అచ్చట నతఁ డున్నాఁడని
రెఱుఁగకపోయినను నా మహాత్ముఁడా జనుల నెట్టు లభ్యుద్ధ
ి నను విచారమున నిరంతరము నిమగ్నుఁడై యుపాయముల
నుండెను. అట్లనేక మాసములు రామదాసుఁడు నిర్జనమైన యా
సౌమిత్రహీనుఁడై యేకాకియై ధర్మభ్రష్టమైన స్వీయమహారాష్ట్ర
రించుటకు మార్గములు రేయింబవళ్లు దలపోయఁ జొచ్చెను.
ని కాత్మబలము పరమేశ్వరునియందలి విశ్వాసమే. అతని
మతనియాత్మ విశ్వాసమే. అతని యైశ్వర్యము ప్రపంచజ్ఞానమే.
ప సాధనములతో మహారాష్ట్ర దేశమును బునస్సృష్టి చేసినట్లు

మార్చి, ధర్మసంస్థాపనముచేసి జాతీయ స్వాతంత్ర్యము సమకూర్చవలె నని యతఁడు సంకల్పించెను.

ఇట్లతఁడు ప్రయత్నములు చేయుచుండ నతని ప్రభావమునుగూర్చి విని మాహులీనివాసి యగు నారాయణబువాయు, వడగాన్ నివాసి యగు జయరామస్వామియు శ్రమపడి యెట్టెటో యతని జాడలు గనుఁగొని యతనిని దర్శింపవచ్చిరి. యోగి మహిమ పరమయోగి యెఱుఁగునన్నట్లు మహనీయులు మహనీయుల మహిమ లెఱుంగుదురు. రామదాసుఁడు వారిని సగౌరవముగ నాదరించి వారి స్వస్థానములగు మాహులి, వడగాన్ మొదలగు ప్రదేశములకుఁ దాను నడుమనడుమ నరగుచుండును. అనంతర మతఁడు రంగనాథస్వామి, తుకారాంబువాను, చించివాడ నివాసియైన మోర్యాదేవుడు తక్కిన మహారాష్ట్ర భక్తులను గూడ దర్శించెను. వారును మిక్కిలి సంతసించి మరల నతని నివాసమునకుఁ బోవుచుండిరి. ఈ యన్యోన్యదర్శనముల వలన రామదాసుపేరు దేశ మందంతట వ్యాపించెను. మతము నందాసక్తి గల జనులు రామదాసుఁ డెక్కడ నుండునో వాని దర్శన మెట్లగునో యని విచారింపఁ దొడఁగిరి. తన కడకు వచ్చిన భక్తులను, యోగులను, మిక్కిలి గౌరవించి, వేదాంత చర్చలు మున్నగునవి సమర్థతతోఁ జేయుచుండుటచే వారు తన స్వభావ మెఱిఁగి యతఁడు సమర్థుఁ డని చెప్పఁజొచ్చిరి. పైన నుదహరింపఁబడిన భక్తులు రామదాసున కంటె ముందుగా దేశములోఁ గొంతపనిచేసిరని యిదివఱకే చెప్పఁబడినది. ఇప్పుడు వా రందరు రామదాసు యొక్క యుద్యమమును ఘోషించుటకు సాధనములైరి. ఇది క్రీ॥ శ॥ 1644 సం॥రమున జరిగెను.

ఇది జరిగిన కొలఁది కాలములోనే రామదాసుఁడు సతారా మండలములోని చఫాల్ కొండలోయకుఁ బోయి యచ్చట నివాసమేర్పఱుచుకొనెను. ఈక్రొత్తచోటు జరాండా కొండగుహకంటె నిర్జనమై ప్రశాంతమై బాహ్యప్రపంచ సంబంధము లేక యుండెను. అతఁడెంత బాహ్యప్రపంచ సంబంధమును విడిచి రహస్యస్థలములలో దాఁగినను వానిపేరు లోకమున విశేషముగా మ్రోగుచుండుటచే మహనీయుఁడైన యాతని దర్శనము చేసి

కృతార్థులు గావలెనని కోరి జనులు బహువిధ ప్రయత్నములుచేసి, వాని జాడలు తీసి గుంపులు గుంపులుగా నా వివిక్తస్థలమునకుఁ బోయి కన్నులార నతనిఁ జూచి చేతులార నమస్కరించి యేదే నుపదేశమును బడసి మఱలిపోవుచుందురు. రామదాసునకు వివిక్తస్థల నివాసము మిక్కిలి ప్రియము. దానిం గూర్చి యతఁ డొకచో నిట్లు చెప్పెను.

సత్యాన్వేషణము తఱచుగా వివిక్త స్థలములలోనే చక్కఁగా జరుగును. కావునఁ బ్రతిమనుష్యుఁ డెల్లప్పు డట్లు చేయఁదగును. ఈ వివిక్త నివాస మలవరించుకొన్న యతఁడు కాలక్రమమున సర్వమనోరథసిద్ధిఁ బొందును.

శివాజీ మహారాజు యొక్క మామ్లతదారుఁడై యా మండలమును బరిపాలించుచున్న నర్సోమాల్ నాదుఁడును, చాఫల్ నివాసియు, భాగ్య వంతుఁడు నైన యానందరావు దేశపాండ్యయును రామదాసుకడకుఁ బోయి తమ శరీరమును, తమ సర్వస్వమును వారికి సమర్పించి, సంసారతర ణోపాయ మంత్రముపదేశించి శిష్యులుగా జేకొమ్మని ప్రార్థించిరి. రామ దాసుఁడందు కంగీకరించి వారిని శిష్యులుఁగాఁ బరిగ్రహించెను. అది మొదలుకొని వారు రామదాసుఁ డెప్పు డే పని చెప్పిన నప్పుడది వారు తప్పక మిక్కిలి వినయముతోడను, భక్తితోడను జేయుచు వచ్చిరి. 1648 సం॥రమున రామదాసుఁడు చాఫలు వద్ద శ్రీరామ దేవాలయ మొకటి నిర్మించి నిరంతరాయముగ నా రామదేవునకుఁ బూజానమస్కారములు నిత్యసేవలు జరుగునట్టు యేర్పాటును జేయుమని వారి కానతిచ్చెను.

ఆ యేకాంతస్థలమున నివసించుచున్న కాలముననే తన యుద్యమ రథమును సురక్షితముగా దేశమున నడుపునట్టి యుపాయముల నన్నిటినిఁ జింతించి నిశ్చయించెను. అతఁడు పట్టణములకుగాని, గ్రామములకుఁగాని తఱచుగాఁ బోయెడువాఁడుగాఁడు. ఒకవేళఁ బోయిన నిరాడంబర జీవితము గల యా మహాత్ముని జూచి జనులు పిచ్చివాఁ డని భావించు చుండిరి.

అతఁడు కొన్ని మహిమలు చేసినట్లు జనులలో గొప్ప వాఁడుక పుట్టెను. అతని పిచ్చివాలకము జూచిన వారటువంటి మహామహిమలు

చేసిన యోగీశ్వరుం డితఁడా యని యక్కజంపడి యా మాట విశ్వసింపఁ జాలక చిత్తమునఁ గలఁత నొంచుచు వచ్చిరి. ఆడంబర శూన్యమై వెడఁగుదనమును సూచించుచున్న యా శరీరములో దేశము నందలి యజ్ఞానాంధకారమును బటాపంచలుగ విఱియఁ జేయునట్టి తేజోరాసి యున్నదని సామాన్యు లూహింప లేకపోయిరి. కాని, యతని ముఖమందలి తేజస్సును జూచిన వారును, వానితో నొక్కసారి మాటలాడునట్టి భాగ్యము గలిగిన వారును, సామాన్యు లట్లు గాక వాని మహత్ప్రభావమును గుర్తెఱింగిరి. బాహ్యమైన యా నిరాడంబర జీవితమును గుఱించి రామదాసుఁ డిట్లు చెప్పుచుండెను.

"మన పై వాలకము పిచ్చివానివలె నుండవలెను; కాని మన హృదయములు బహువిధ ధర్మమార్గములతో నిండి యుండవలెను. కాని మనతోఁ గలసి మెలసి యుండు జనుల యొక్క మైత్రి మాత్రము చెడకుండునట్లు జాగ్రత్తపడవలెను."

అతఁడు పైకి దిగులుఁ జెందినట్లు, విచారపడుచున్నట్లు గనఁబడుచున్నను లోలో నతఁడు మహానందమున నోలలాడుచు నిరంతరము పరమేశ్వరపాదధ్యానము చేయుచుండుటచే సుఖపడుచునే యుండెను.

అతనినోట వెడలిన ప్రతియొక్కమాట యమృతపు సోనవలె జనులను సంతోషసముద్రమునఁ దేల్చును. అందుచే జనులు తమ కెట్టిట్టి పనులున్నను వాటిని విడిచియైన వారి దర్శన మొకసారి చేసి వారి పలుకులు వినవలెనని కోరుచుందురు.

కాని, యతఁ డెక్కడను గనఁబడఁడు, కనఁబడెనాయెంతో దుఃఖమున మునిఁగినవానివలెఁ గనఁబడుచుండును. ఈ వర్ణనలనుబట్టి యీ నాఁటి మనవారు మంచిపాఠము నేర్చుకొనవచ్చును. మనుష్యులు తాము గొప్పవారు గాక సామాన్య మనుష్యులయి యున్నప్పుడే మిక్కిలి గొప్పవారనిపించు కొనవలెనని యొక దురుద్దేశ్యమునకు లోనై యున్నారు. అట్టి దురభిప్రాయమును వారు రామదాసుని చరిత్రముఁ జదువుకొన్న తరువాత

నైనను వదలవలెను. మంచిమంచి దుస్తులు మనుష్యునకుఁ గొప్పతనమును, గౌరవమును దీసికొని రావని రామదాసుని యభిప్రాయము. ఇది నిజమే, ఏ చాకలివానినో యాశ్రయించి కాసునకైన గతిలేని నిర్భాగ్యుఁడో, గుణహీనుఁ డైన బాలిశుఁడో, వెలగల దుస్తులు దెచ్చుకొని వానిని ధరించి పురమున సంచరించినంత మాత్రమున వానిని గొప్పవానిగ నెవ్వరు భావింతురు? తెలియని వారొక వేళ నతఁడు ఘనుఁడని గౌరవించినను గౌరవము క్షణభంగురమే యగును. మనుష్యున కుండవలసినది విజ్ఞానము. భర్తృహరి తన సుభాషిత రత్నావళిలోఁ జెప్పిన పద్యమిచ్చుట ననువదించుట సముచితము.

ఉ. భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగదతారహారముల్
భూషితకేశపాశమృదుపుష్ప సుగంధజలాభిషేకముల్
భూషలుగావు పూరుషునిభూషితుఁ జేయు పవిత్రవాణి వాక్
భూషణమే సుభూషణము భూషణముల్ నశియించు నన్నియున్.

కాలక్రమమున నతనిప్రభావము దేశమందంతట నలము కొనుటచే జనులాసక్తితో నతని దర్శనమెప్పుడగునా, మనమెప్పుడు తగిన సపర్యలుచేసి కృతకృత్యుల మగుదుమా యని యతని రాకల కువ్విళ్లూరుచుందురు.

రామదాసుఁడు గొప్ప కర్మవాది. అతనికంటెఁ గర్మవాది యీ నవీన యుగములో లేఁడు. అతఁడు స్వార్థము నంతయుఁ బరిత్యజించిన సన్యాసి. విశుద్ధుఁడైన విరక్తుఁడు. అతఁడు కర్మను వదలివేయలేదు. తన శిష్యులను గూడఁ గర్మను వదలివేయ వలదని యాజ్ఞాపించెను. శ్రీకృష్ణుఁనివలెనే యంతర్జీవితము, బాహ్యజీవితము గూడ కర్మబద్ధమైన దని యతఁడు వాదించెను. ఈ మహాప్రపంచము యొక్క చక్రములు నిరంతరము కదలుచుండునట్లు మన మెల్లప్పు డేదో పనిచేయుచుండవలయుననియు, నూరకుండిన నా చక్రములు మన మీఁదుగఁ బోయి మనల నాశనము చేయుననియు నతఁడు చెప్పుచుండెడువాఁడు, కాని యెట్లయిన నేదో కర్మము జరుగుచుండుననియే యాతని యాశయము. తన దాసబోధలో సన్యాసియు, విరక్తుఁడు చేయవలసిన కృత్యముల నీ క్రింది విధముగ వివరించెను.

1. విరక్తుఁడు ధర్మము నుద్ధరింపవలయును. నీతిని నిర్వహింపవలయును. మిక్కిలి గౌరవముతో దోషులను క్షమియింప వలయును.

2. విరక్తుఁడు విద్యావ్యాసంగములం దుండవలెను. అతఁ డెప్పుడుఁ బాటు పడుచు, క్షీణించి చెదరిపోయిన పరమార్థమును దన వాక్పటిమచే జనులకు బోధించి పునరుద్ధరింపవలెను.

3. విరక్తుఁడు ప్రపంచవ్యవహారములలోఁ బ్రవేశింపవచ్చును. కాని వైరాగ్యమును మాత్రము లవమైన విడువఁగూడదు. దురాశలకు దుస్తంత్రములకు నెఱగాఁకూడదు.

4. విరక్తుఁడు దృఢమనస్కుఁడై కష్టముల నోర్చునట్టి ధైర్యముగల వాఁడై యుండవలెను. ఈ ప్రపంచ మంతయు మాయ యనియు వినశ్వర మనియు భావించి తన సత్ప్రవర్తనముచేతను దన సాహచర్యము చేతను ధర్మము క్రమముగా వికాసము నొందునట్లు చేయవలయును.

5. విరక్తుఁ డొక్క పక్షము మాత్రమే వహింపగూడదు. ఒక్క శాస్త్రము మాత్రమే చదువఁగూడదు. అన్ని శాస్త్రములుఁ జదివి వానిలోఁ బాండిత్యము సంపాదింపవలెను.

6. విరక్తుఁడు గొప్ప తపస్సులను జేయవలెను. బహువిధములైన పూజలను నిర్మింపవలెను. భగవంతుని గ్రంథములను బఠించుచుఁ గీర్తనలు భజనలు చేయుచుండవలయును. దుర్మార్గులయొక్క నోళ్లు మూఁతలుపడునట్లు పరిహసించువారు సిగ్గునఁ దలవంచుకొనునట్లు కీర్తనలలోను భజనలలోను నిరుపమానమైన యుత్సాహము కనఁబరుపవలెను. ఇవి రామదాసుని దాసబోధలో నక్కడక్కడనుండి యెత్తి వ్రాయబడిన విడివాక్యములు.

తన గ్రంథములో రామదాసుఁ డుపయోగించిన మహారాష్ట్రభాష యతిమనోహరమై లలితమై గంభీరభావ సమన్వితమై యుండును. దాని యర్థగౌరవము మృదుత్వము చెడకుండ భాషాంతరీకరించుట యసాధ్యము. కాని దాని భావము మాత్ర మెట్లో తీసికొని రావచ్చును.

రామదాసుఁడు ధర్మసంస్థాపనమునకై పని యీ క్రింది విధముగ నారంభించెను. చాఫల్ గ్రామములోఁ గట్టిన రామదేవాలయములో శ్రీ రామజన్మోత్సవములు, మారుతిజన్మోత్సవములు ప్రతి సంవత్సరము జరుప నారంభించెను. ఇవియే గాక నింక ననేకోత్సవములుగూడ నతఁడు చేయఁజొచ్చెను. ఈ యుత్సవములు హిందువులలో నదివఱకే యుండి నను రామదాసుఁడు వానికిఁ గ్రొత్తస్వరూప మిచ్చి దేశస్థులందఱు నచటికిఁ జేరునట్లు చేసెను. ప్రతిసంవత్సరము వేనవేలు జనులక్కడికిఁ జేరుచుం డిరి. అట్టి సమయములలోఁ బురాణములుఁ జదివించును. భజనలుఁ జేయించును. కీర్తనలు జరిపించును. ఇంకనెన్నో విచిత్రములైన సేవా విధానములు గలిపించును. అవి అన్నియు మహావైభవముతోఁ జూప ఱకు నయనానందకరము గాను, హృదయానందకరముగాను నుండునట్లు చేయించును. మొదటి సంవత్సరము ముగిసినతోడనే యీ యుత్సవముల వార్త మహారాష్ట్రదేశమం దంతట వ్యాపించెను. అతిదూరము ప్రవహించి వెళ్లినకొలఁది వెడలుపై పలు పొలములకు నీ రొసంగి సస్యవృద్ధిని చేయునట్టి మహానదివలె మహోత్సాహము పెచ్చుపెరిగి దుర్భరమయ్యెను. అందుచేఁ గొందఱక్కడికిఁ బోవుట మిక్కిలి కష్టముగా భావించి తమ గ్రామ ములలోను, తమ యిండ్లలోను నట్టి యుత్సవములఁ జేయనారంభించిరి. ఈ యుత్సవప్రతిష్ఠానములు కారుచిచ్చులవలె దేశమంతట వ్యాపించునని రామదాసుఁడు ముందే యెఱుంగును. వెంటనే యతఁడు దేశమందు నానాభాగములలోఁ గొన్ని మఠముల స్థాపించి యీ చుట్టుప్రక్కల నున్న జను లక్కడ జరుగునట్టి యుత్సవములకుఁ బోవున ట్లేర్పాటులు చేసెను. ఈవిధముగా ననేకోత్సవముల శిష్యులచేత నతఁడు శ్రద్ధతో జరిపించు చున్నను నతఁడుమాత్ర మెక్కడఁ గనఁబడువాఁడుగాఁడు. నూతనములైన యీ మహోత్సవముల నెలకొల్పిన మూలకారణము తానే యని ప్రకటిం చుకొనుట యతని కిష్టము లేదు. అందుచే నతఁ డా యుత్సవములకుఁ బోక తన గుహలో నేకాంతముగ నుండుచు వచ్చెను. ఈ సందర్భములో నతఁ డిట్లు చెప్పెను.

విరక్తుఁడు ప్రతిష్ఠలమునందు నుపాసనలు జరుగునట్లు చేయింపవలెను. కాని యతఁడు స్వయముగా నెచ్చట నుండఁడు. అతఁడు తెరచాటున నుండవలెను. అట్లుండిన ప్రజల దురభిప్రాయము లనెడు బాణముల కతఁడు గుఱిగాక యుండును.

దీనింబట్టి రామదాసుఁడు భగవద్గీతలో శ్రీకృష్ణుఁడు చెప్పినట్టి ఫలాపేక్ష లేని నిష్కామకర్మమం దభిలాషగలవాఁడని నిశ్చయింపవచ్చును. "నేను ప్రపంచమునం దున్నాను. కాని, నాకుఁ బ్రపంచసంబంధము లేదు." యని యా మహాయోగి యనుచుండును.

ఈ కాలముననే రామదాసుఁడు మనాచీ శ్లోకములు రచియించెను. మనాచీశ్లోకము లనఁగా మానసబోధశ్లోకములు. ఈ పద్యకావ్యమునందు 205 చిన్న శ్లోకము లున్నవి. శ్లోకమునకు నాలుగేసి చరణములు గలవు. ఇందు గుప్తవేదాంతమున్నది. అదిగాక మనుష్యులు ప్రతిదినము చేయవలసిన పవిత్రజీవనమును గుఱించి కొన్ని సూచనలును గలవు. మరియు శ్రీరామునిపై దృఢతరముగా మనస్సును నిలిపి భజింపవలయుననిగూడ నాగ్రంథములో నున్నది.

నిజ మారయ జనసామాన్యమునకు ధర్మోపదేశముఁ జేయుట కా కాలమున రామదాసుఁ డొక్కఁడే నిజమైన సమర్థుఁడు. అట్లయిన నతఁడు తన మనస్సున కేల బోధించుకొనవలయును? మనాచీ శ్లోకములలోఁ దన మనస్సునకుఁ దానే బోధించుకొని నట్లున్నది. అందుచేత నీ సందేహము గలుగుచున్నది. తా నాచరింపకుండ ధర్మమునైన నితరులకు బోధించుట యప్రశస్తము. కావునఁ దన మనస్సునకు ముందుగాఁ దానే బోధించుకొన్న ట్లతఁడు చెప్పినాఁడు. నిజముగా నతని మనస్సునకు బోధ మవసరములేదు. ఈ విషయమై యతఁ డిట్లు చెప్పెను.

"ఏ పనియైన ముందుగా మన మాచరించి పిమ్మట నితరులచేత నాచరింపఁ జేయవలెను. ఏ పనినైనఁ జేయుటకు మనమే ముందుగా నాలోచించి చేయవలయును. అట్లు చేయు మని పిమ్మట నితరులను బ్రోత్సాహము చేయవలయును."

"మొదటఁ జేయుము. తరువాత జేయింపుము." ఇదే రామదాసు విజయమునకు నుత్తమ కీలకము. ఇందుచేతనే దేశస్థు లందఱు నతఁడు చూపిన మార్గము నందు మాఱు మాటాడక నడచిరి.

ఏ కార్యముం జేయని వట్టి ప్రేలరిమూకను రామదాసుఁడు పనికిమాలిన దుర్జను లని నిర్భయముగాఁ బలుకుచుండును. తమ రెన్నో ధర్మోపదేశములు పరులకుఁ జేయుచుఁ దాము స్వయముగా నాచరింపఁజాలని శూరమ్మన్యుల నెందఱనో మనము గూడఁ జూచుచుందుము. మాటలు కోటలు దాఁటునట్లు చెప్పవా రనేకు లుందురు. కాని కార్యరంగమున దిగి ఫల మపేక్షింపక ధర్మకార్యములం జేసి కృతకృత్యులగువార లరుదు. ఆచరణము లేక వట్టి మాటలు చెప్పు బోధకులు చాలమంది యుండవచ్చును. కాని వారిగంభీరోపన్యాసములు గౌరవముతో వినువారు తక్కువగా నుందురు. తన శిష్యులు భిక్షములకుఁ బోయినపుడు, వల్లించు కొనుటకై "మానాచీ శ్లోకములు" ముఖ్యముగ రామదాసుఁడు రచియించెను. పరమార్థమునకు రాచబాటను లోకులకుఁ జూపుటకును స్వమతములో నున్న ప్రాశస్త్యమును మధురములై సహేతుకములైన వాక్యములతో నరఁటి పండొలిచి చేతికిచ్చి తెలుపుటకును "మానాచీ" శ్లోకములు రామదాసునిచే నుద్దేశింపబడినవి. గ్రంథకర్త సంకల్పము సంపూర్ణముగ నెరవేరెను. హృదయోత్సాహకరములైన యాశ్లోకములు జనులయొక్క శ్రద్ధ నాకర్షించి తమతమ కృత్యముల యందు వారు స్థిరముగ నిలుచు నట్లు చేసి విద్యుచ్ఛక్తి వలె వారి తత్త్వముల మార్చెను. పరమార్థమునకుఁ దాను జూపిన రాచ బాట తప్ప మరియొక రాజవీధి లేదనియు, సనాతన మహర్షులు మున్నుగు వారా పుంతనే నడచి ముక్తులైరనియు. మతావేశము గలిగించు నీ శ్లోకములనే హిందువు లందఱు వల్లించి సారము గ్రహించి తత్ప్రకారము నడుచుకొనవలయు ననియు రామదాసుఁడు దేశమంతకును సందేశము నంపెను. అవి జనుల యుద్దేశములకు సరిపోయినందున వారందఱు నిద్రలోనుండి మేలుకొని నట్లొక్క మాఱు తెలివి తెచ్చుకొని పరమప్రీతితో నా శ్లోకములఁ జదువుకొనిరి.

ఉపాసకుఁడు మొట్ట మొదట కర్మము చేయవలెను. పిదప నుపాసన చేయవలెను. అటుపిమ్మట నతనికి జ్ఞానము గలుగును. జ్ఞానము వలన ముక్తి సంప్రాప్తించును. ఇది రామదాసుని బోధామృతసారము.

ఈ వరుస ననుసరించి నడువవలయునని మహారాష్ట్రుల కెల్ల రామదాసుఁ డాదేశ మిచ్చెను. శ్రీరామునిపై నిశ్చలముగ మనసు నిలిపి ధ్యానింపదలఁచు వారు తమకు ఏయే కర్మలు విధింపఁ బడినవో యా కర్మలు తప్పక చేయవలెను. అప్పు డతఁడు సద్గురుని యాశీర్వచనములు బడయుట కర్హుఁడగును. అంతటఁ గార్యక్రమమును బట్టి జ్ఞానము పిత్రార్జితమువలె నతని కప్రయత్నముగ సంక్రమించును. అట్లు కృషి చేసిన యతఁడు తప్పక ముక్తిని బడయఁగలడు. ఇదియే "మనాచీ" శ్లోకములలో నున్న సారము. మహారాష్ట్ర వేదాంత గ్రంథములలో నేదియు రచనావిధానమునకు విషయబోధమునను, హేతుకల్పనమునను, విశేషించి గొప్ప యర్థమును జిన్న మాటలలో నిముడ్చునట్టి శక్తిలోను, "మనాచీ" శ్లోక గ్రంథమును బోలదని చెప్పుట యతిశయోక్తి గాదు. అందుచేతనే తత్కాలపుభక్తులు, పండితులు నైకకంఠ్యముగా నేతద్గ్రంథము వేదములకుఁ దాళముచెవి యనియు, శాస్త్రముల సారమనియు వచించిరి. ఆ గ్రంథ మంతయు నీక్రింది ముఖ్య భాగములుగా విభజింపఁ బడవచ్చును.

1. ఉపాసన యొక్క ప్రాశస్త్యము, వెల.
2. రామనామస్మరణ యొక్క ప్రాధాన్యము.
3. సాధు సజ్జన సాంగత్యము యొక్క యావశ్యకత.
4. మనో వాక్కాయ కర్మముల యేకీభావము.
5. ఇంద్రియ నిగ్రహముయొక్క యవసరము.
6. పరోపకారమునకై యుద్యమించుట.
7. పనికి మాలిన చర్యలు, సోమరితనములు పరిత్యజించుట.
8. వివేకము యొక్క ప్రాశస్త్యము.
9. సద్గురు సేవ.

10. రాముడు పరమేశ్వరుం డని నమ్ముట.

11. విగ్రహ రూపములో రాముని జూచుట.

ఈ యంశములే గ్రంథ మందంతట పడుగుపేక వలె నల్లు కొని యున్నవి. భాషా మాధుర్యము, భావగౌరవము, మనోహరశైలియు వానికి వన్నె వెట్టుచున్నవి.

మహారాష్ట్ర దేశమందుఁ బలుతావుల యందు రామదాసుఁడు నెల కొల్పిన యుత్సవములు మొదలగునవి జనుల సోమరితనమును దవ్వుగఁ దోలెను. వారు రామదాసుని వలన నుపదేశము బడయుటకై యెంతో యుబలాటపడుచు వచ్చిరి. శివాజీ మహారాజు యొక్క కొలువుకాండ్రు మున్నగు నుద్యోగస్థులు సైతము రామదాసుని శిష్యవర్గములలోఁ జేరిరి. అందుచే శిష్యసంఖ్య మఱింత యెక్కువయ్యెను. ఆత్మలాభమే చూచుకొనుచుఁ దక్కిన వారిగతి చూడక యెవరి కర్మములకు వారిని వదలి వేయునట్టి యీక్రొత్త శిష్యులకొఱకు రామదాసుఁ డంతగా శ్రద్ధ చేయలేదు. అతఁడు స్వార్థత్యాగము, మనోనిశ్చలత గల యువకులను జాలమందిని జేరదీసి వారికా బోధలు చేసి, తయారు చేసి, దూరమునందు నెలకొల్పబడిన మఠములలో ధర్మ వ్యాపనముఁ జేయుటకై వారిని నియోగించెను. మొత్తము మీఁద రామదాసుఁడు దేశమున నూట యేఁబది మఠముల స్థాపించెను. వానిమీఁద డెబ్బది యిద్దరు ముఖ్యశిష్యులు పరామరిక చేసెడు నుపద్రష్టలై యుండిరి. వారి చేతిక్రింద నింక దక్కువ తరగతిలోని యుద్యోగు లనేకు లుండిరి.

మహంతులు క్రొత్త మహంతులను నిర్మించి, వారికిఁ దెలివి తేటలు, నైపుణ్యము గలిగించి ప్రతి విషయమున వారి ననుభవ శాలురుగఁ జేసి దేశ మందంతట వారిం బ్రతిష్ఠింప వలయునని యాతని యాజ్ఞ. ఆ సూత్రముల నతని శిష్యులెల్లప్పుడు ననుసరించుచుండిరి.

ప్రతి మఠమునందు మారుతి విగ్రహము స్థాపింపఁబడెను. మఠాధిపతులు దినమునకును ముమ్మారు సేవలు కైంకర్యములు మొదల

గునవి చేయుచుండవలెనని యాజ్ఞాపింపఁబడిరి. శిష్యులందఱు సన్యాసులు, అందుచేత గురువువలెనే వారును విరాగులు. బిచ్చమెత్తుట, కీర్తనలు భజ నలు చేయించుట తప్ప మఱి యే యితర లోకసంబంధములను వారు పెట్టుకొనఁగూడదు. ప్రతి శిష్యుఁడు తన మఠము చుట్టునున్న కొన్ని యిండ్లకుఁ బ్రతి దినము పోయి బిచ్చ మెత్తుకొనవలయును. బిచ్చమునకై యే యింటికిఁ బోవఁ దలచునో యా యిల్లు చేరఁగానే యాతఁడొక శ్లోకమును చదువ వలెను. అక్కడ బిచ్చము నిమిత్తము కొన్ని నిమిషములు మాత్రమే యుండవలెను. అంతలో బిచ్చము దొరికినను, దొరకకున్నను గిరుక్కున మరలి మఱియొక యింటికిఁ బోవలెను. సంపూర్ణ స్వార్థత్యాగ దీక్షయే రామదాసుని మతమునకు గీటురాయి. శిష్యులు దినమున కొక్క పూటమాత్రమే కొంచెము పప్పు, అన్నము దిని రాత్రి నిరాహారులై యుండ వలయును. తక్కిన కాలము వారు తమతమ మఠములలో మతబోధలు చేయుట, నుపాసనలు జరిపించుట మొదలగు కార్యములను జేయుచుండ వలెను. ఆ బోధనలు వినుటకు జను లనేకు లక్కడికిఁ జేరుచుందురు. ప్రధాను లగు యీ శిష్యులు సమస్త మత రహస్యముల యందు బోధి తులై యాఱితేరిన వారగుటచే వారియొక్క వాగమృతమును గ్రోలి జను లానందించు చుండిరి.

కొన్ని సంవత్సరములలోనే రాముదాసుఁడు తన మఠముల వలను దేశమందంతటఁ బన్ని వ్యాపింపఁ జేసెను. శిథిలమైన హిందూమతము నుద్ధరించుట యపారమైన యాత్మజ్ఞానము, నాత్మవిశ్వాసము గల రామ దాసుని వంటి మహాధీరులకు సైతము దుష్కర మని యా కాలపు చరిత్ర నెఱిఁగిన వారి కందఱకుఁ దోఁచకపోదు. క్రమ క్రమముగా- శిష్యు లకు శిష్యులు, వారికిఁ బ్రతిశిష్యులు బయలుదేరి మహారాష్ట్ర దేశమునం గల ప్రతి గ్రామమునకుఁ బ్రతి పల్లియకుఁ బోయి యెల్లచోట్ల రామదా సుని ధర్మములు, మతము బోధించుచు "మనాచీ శ్లోకములు" జదువుచుఁ సూర్యరశ్మివలె నది ఎల్లయెడల వ్యాపించునటులఁ జేసిరి. ఆయున శిష్యులు దేశస్వాతంత్ర్యము నిరసింపకుండ మతబోధకుఁ దోడు స్వేచ్ఛను గూడ బోధించిరి. తమ మాతృభాష యగు మహారాష్ట్ర భాష యెంతో యద్భు

తముగా, రుచిగా నున్న దనియు, మరాఠీ భాషలోని పద్యకావ్యములు, గద్యకావ్యములు, మిక్కిలి ప్రభావవంతములై జ్ఞానదాయకములై యున్నవ నియు, దమ సనాతన ధర్మము పరమపావన మగుటచే దాని ననుసరించిన వారికి మోక్ష పదమెంతో సులభ మనియుఁ దమ భాషలోనే మతము, విద్య నేర్చుట సర్వోత్తమమనియుఁ గూడ వారు బోధించిరి. అది విని జను లాయన పద్యములు జదువుకొని ధన్యులైరి. ఆ పఠనముతో నదివఱకు వారి హృదయముల నెలకొని యున్న నిరాశ నిర్మూల మయ్యెను. తమ దేశము నకు మేలైన కాలము వచ్చుచున్నదని మహారాష్ట్రు లందఱి హృదయములలో నాశాంకురములు మొలక లెత్తెను.

---

# ఎనిమిదవ ప్రకరణము

## మతము - రాజ్యపాలనము

అన్నిటికంటె మొదటిది సర్వశక్తుఁ డగు భగవంతుని పూజ. రెండవది రాజ్యపాలన. మూఁడవది తక్కిన విషయములలో విరివిగా జ్ఞానముండుట. ఈ విషయములు దాసబోధలో పదునొకండవ అధ్యాయములో నాలుగు, ఐదు శ్లోకముల యందు ఉన్నవి. ఈప్రకరణమునందు రామదాసుని మతము యొక్క మూలసిద్ధాంతములను పాఠక మహాశయులకుఁ గ్రమ క్రమముగాఁ దెలియఁ బరచుచున్నాము. కాని రామదాసుఁడు భగవంతుని యవతారపురుషుఁడు కాఁడని స్పష్టీకరించుచున్నాము. రామదాసుని జీవిత చరిత్రము మహారాష్ట్రభాషలో ననేకులు వ్రాసిరి. కాని వారందఱు మూఢ విశ్వాసము గల వారై యా చరిత్రములను ఛాందసముగా వ్రాసిరి. వారం దఱు రామదాసు యొక్క సమకాలికులే. వారి వ్రాఁతలలో రామదాసుడు భగవంతుని యవతారమూర్తి యనియు నందుచేత యనేకాద్భుతములు చేసెననియు వ్రాసిరి. ఆ యద్భుతములు మానవ శరీరములకు సాధ్యమ యినవి కావు. ప్రకృతిశాస్త్రము మిక్కిలి యభివృద్ధి చెందిన యీ కాలములో నటువంటి మహిమలు జనులు నమ్మరు. మహాపురుషుల కిట్టి మహిమ లారోపించుట లోకమున నూతన విషయము కాదు. వా రవతార పురుషు లని చెప్పుటయు నూతన విషయము కాదు. అద్వైత మత స్థాపకుఁడైన శంకరాచార్యులు శివుని యవతార మని యద్వైతు లందురు. వైష్ణవ మతోద్ధారకులైన రామానుజుల వారు శేషుని యవతార మని విశిష్టాద్వై తులు నమ్ముదురు. అట్లే మధ్వరాయలవారు వాయుదేవుని యవతార మని ద్వైతుల విశ్వాసము. లింగమత స్థాపకుఁడైన బసవేశ్వరుఁడు శివుని వాహనమైన నందియొక్క యవతారమూర్తి యని లింగధారులు దృఢముగా నమ్ముదురు. వంగదేశమున వైష్ణవమతము స్థాపించిన చైతన్యస్వామి శ్రీకృష్ణ

పరమాత్ముని యపరావతారమని యా దేశస్థులు గాఢముగ విశ్వసింతురు. ఈనాఁటి హేతువాద పరాయణులు రామదాసుఁడు భగవంతుని యవతారము కా దనియు నతఁడు పవిత్ర చరితుఁడైన యొక ఋషియనియు నొప్పుకొందురు. మహిమలు మొదలయిన యమానుష కృత్యములు దీసివేసిన యెడల వా రాతని చరిత్రము నాదరభావమునఁ జూతురు. అతిశయోక్తులు, మహామహిమలు దూరముగఁ ద్రోసివేసిన యెడల రామదాసుఁడు రచియించిన దాసబోధ యను గ్రంథము నుండియే యాతని చరిత్రమును మనము గ్రహింపవచ్చును. అదృష్టవశమున దాసబోధలో శిష్యులు గాని మరి యితరులు గాని రామదాసు రచియింపని క్రొత్త పద్యములను జేర్చ లేదు. ఈలాగునఁ జేర్చుట మన పురాణములలోను భారత రామాయణాది గొప్ప గ్రంథముల లోను జరిగినది. అట్టి యవస్థ దాసబోధకుఁ బట్టలేదు. ఆ కారణమున నది విశ్వసింపఁదగిన గ్రంథముగ నున్నది. ఇతరులు వ్రాసిన యతని జీవిత చరిత్రముకంటె దాసబోధనే మన మాధారముగఁ జేసికొని యతని జీవితచరిత్రముఁ గొంతవఱకు లిఖింపవచ్చును. రామదాసునియొక్క అభీష్టదైవతము మారుతి, అనఁగా హనుమంతుఁడు. హనుమంతుఁడే రామదాసున కాదర్శదైవతము. నిరాడంబర జీవనము గంభీరమైన తత్త్వవిచారము ముఖ్యముగ నుండవలయు నని రామదాసునియొక్క యాశయము. గంభీరమైన తత్త్వవిచారమునకు నాదర్శమైన దైవతముండి తీరవలెను. ఆ దైవతము రామదాసు మత ప్రకారము మహోత్కృష్ట పురుషుఁడైన హనుమంతుండే. హనుమంతుఁడు శ్రీరామభక్తుఁ డని జగత్ప్రసిద్ధమేగదా! అటువంటి మహాదైవతము నందు విశ్వాసము లేకపోవుటచే మహారాష్ట్ర దేశము బహు కష్టముల పాలైనది. ఈ దైవతమును నమ్మిన తరువాత జనుల కనేక కష్టములు దొలఁగినవి. మారుతి బలభీముఁ డని రెండవ పేరు గలదు. ఈ దైవతమును రామదాసుఁడు పండ్రెండు సంవత్సరములు ధ్యానించి తుదకు మారుతిలో లీనములై యున్న మహాశక్తులను గొన్నింటిని దనయందు సంక్రమింపఁ జేసికొనెను. జనులను మహోత్సాహ భరితులను జేయవలసి వచ్చినప్పుడు మారుతియే పరమదైవతమని జనులకు బోధించెను. అతఁడు దుష్టజన భయంకరుఁ డని మహాభక్తుఁ డని గొప్ప

మేధావి యనియు లోక మెఱుంగును కదా! పిల్లలకు భూత భేతాళ పిశాచములు సోకకుండ హనుమద్విగ్రహముచెక్కిన బిళ్లలు బిడ్డల మెడలలో వ్రేలాడుచుండుట మన మెఱుంగుదుము. శ్రీరామునివలన యోగవిద్యను హనుమంతుఁ డుపదేశము పొందినట్లు 'సీతారామాంజనేయము' అను గ్రంథములో నున్నదిగదా! భారత యుద్ధములోఁ గౌరవులను జయించుటకై యర్జునుఁడు తన ధ్వజము మీఁద హనుమంతుని విగ్రహము నిలుపుకొనినట్లు మహాభారత యుద్ధపర్వములో ననేకచోట్లఁ జెప్పఁబడి యున్నది. ఒక జాతిని బలపమేతముగాను మహోత్సాహవంతముగాను జేయుటకై యాతని యందే శక్తికల దని రామదాసుని నమ్మకము. ఆ దేవుని యొద్ద మూఁడు శక్తులు కలవు. అవి యేవనఁగా నొకటి దేహశక్తి. రెండు మనశ్శక్తి. మూఁడు ఆత్మశక్తి. దుష్టభూయిష్ఠ మైన ప్రపంచము దేహశక్తి వల్లనే లోఁబఱచుకోవలెను గదా! దేహశక్తి లేనియెడల జనులకు స్వాతంత్ర్యముగాని శాంతిగాని సౌఖ్యముగాని స్వప్నవార్తలు గదా. ఇతర శక్తులెన్ని యున్నను దేహశక్తి లేకున్న నవి, యన్ని నిరర్థకములుగావె. దృఢమైన మనశ్శక్తి లేకపోయిన యెడల నీ దేహశక్తి కేవలము పశుబలముగఁ బరిణమించును. దేశమును నాగరికముగ నుంచుటకుఁ గ్రమపద్ధతిగ నడుపుటకు, దేహబలముతోపాటు మనోబలము జ్ఞానబలము కూడ నుండవలెను. దేహబలము, మనోబలమే మానవ జాతియొక్క యభ్యుదయమునకుఁ జాలునని యీ నాఁటివారి నమ్మకము.

కాని పాశ్చాత్య మతమునకు మన ప్రాచ్యమతమునకు నీ విషయమున విశేష భేదము కలదు. దేహ మనశ్శక్తు లాత్మశక్తితోఁ గలపియుండని యెడలఁ బ్రపంచము పశుబలమున కధీనమై నానాబాధలు పడవలసి వచ్చును. అందు చేతనే ప్రాచ్యదేశస్థులైన మహర్షులు పరమోత్కృష్టమైన యాత్మశక్తి మొట్ట మొదటిదిగాను, దేహ మనశ్శక్తు లప్రధానములుగాను బరిగణించిరి. మారుతి నాదర్శ దైవతముగ బెట్టుకొన్న యెడలఁ దమ దేశస్థుల కీ మూఁడు శక్తులు చులకనగ నలవడు నని రామదాసు యొక్క నిశ్చితాభిప్రాయము. భగవంతుని యారాధనము మొట్టమొదటఁ జేసి పిమ్మట దేశ రాజ్యాంగ విషయములు చూచుకొన వలెనని రామదాసు బోధ. మన జీవిత

మీరెండు విషయములతోఁ గూడి యుడవలెనని యాతని యాశయము. మానవ కృత్యము లన్నింటిలో మతము ప్రధానముగ నుండవలె ననుమాట భౌతికవిషయ పరాయణులైన పాశ్చాత్యులచెవికి మిక్కిలి వింతగాఁ దోచ వచ్చును. ఏలయన వారిబుద్ధి వినశ్వరమైన యీ భౌతిక ప్రపంచమును దాటి ఎన్నడుఁ బోలేదు. దేహమనశ్శక్తుల సహాయమున సౌఖ్యమును శాంతిని బొంది జీవితము గడపవచ్చునని వారి నమ్మకము. వారిమతము యొక్క యసంపూర్ణస్థితి దృష్టిగోచరములైన పదార్థముల మీఁదికేగాని మరణానం తర జీవితముయొక్క స్థితినిగూర్చి వారి కాలోచన సోకపోవుటచే వారట్లు నమ్మిరి. కాని ప్రాచ్య దేశస్థులమైన మనము మతమే ముఖ్యముగఁ జేపి కొన్నాము. మతమునకు, రాజకీయమునకు సంబంధము లేదని పాశ్చాత్యుల యభిప్రాయము. మనవారి కట్టి యభిప్రాయము లేదు. అందుచేతనే గాంధి మహాత్ముఁడు జాగ్రత్తతో నహింస సత్యము మొదలైన మతధర్మములను రాజకీయ విషయములతోఁ గలిపెను. హిందువులకు మతమే ప్రధానము. బిడ్డపుట్టినప్పుడు జాతకరణ నామకరణాది కర్మలు మతముతో సంబంధించి యున్నవి. మనుజుఁడు మృతినొందినపు డుత్తర క్రియలు మతముతోనే కలిసి యుండును. వివాహాది శుభకార్యములు కూడ మతమును విడిచియుం డవు. దీనినిబట్టి మన ప్రాచీనులు మతమునకే ప్రాధాన్యమిచ్చి రని తేలు చున్నది. అందుచేతనే రామదాసుఁడు లోకవ్యవహారములకంటె మతమునే ముఖ్యముగ నెంచెను. ఇప్పటి ప్రకృతిశాస్త్రవేత్తల యభిప్రాయము మతము నకు ఇతరవిషయములకు మధ్య గీటుగీచి రెండింటిని వేరుచేయవలయు ననియు, మతము పనిపాటలు లేనివారు తీరుబడిగాఁ గూర్చుండి చర్చిం పవలసిన విషయమనియు, మనుష్యుఁడు భూలోకమందు దేవుని ప్రతినిధి యగుటచే నీశ్వరగుణ సంపర్కముచేఁ గాని యతఁడు లౌక్యవ్యవహారము లలో నెఱవేరలేఁ డని యతఁడు చెప్పుచుండును. మూఁడు శక్తులు కలపి యున్నప్పుడే మానవుఁడు తన లోపల శత్రువులను పైశత్రువులను జయింప జాలునని యతఁడు పలుమాఱు జెప్పుచుండును. జాతిక్షీణించినప్పుడు దాని ధర్మము కూడ క్షీణించును. అందుచేత నవి బాహ్యాంతర శత్రువులకుఁ త్వరగా లొంగిపోవును. క్రమముగా నది బానిసతనమునఁ బడిపోవును.

అట్టితటి మతమొక్కటే జాతిని బ్రతికించి యుద్ధరించునది. అందు చేత మానవ సముద్ధరణమునకు మతమే సర్వవిధముల నవలంబనీయమని రామదాసుఁడు నొక్కివక్కాణించుచుండును. పడిపోవుచున్న మనుష్యులు కఱ్ఱనూఁతగొని నిలుచునట్లు పడిపోవుచున్న జాతి మతము నూఁతగా గొని నిలువఁబడవచ్చునని యాతఁ డుపదేశించు చుండును. అతఁడు రాజకీయ విషయముల గుఱించి యంతగాఁ బనిచేయలేదు. దానికి రెండవ స్థానమిచ్చి మతమునకే ప్రధాన స్థానమిచ్చెను. రాజ్యాంగవిషయము పాశ్చాత్యులకు జీవనాధారము. దానిని వారు రాణిగాఁ బూజింతురు. మతమే మనకు ముఖ్యమగుటచే గ్రీకులు పారశీలకులు క్రైస్తవులు మహమ్మదీయులు మొద లగు విదేశీయులు మనపైఁ బలుమాఱు దండయాత్రలు సలిపినను మన మతము దేశమును జెక్కుచెదరక నిలిచి యున్నవి. భరతఖండమునకుఁ బడ మటనున్న ఆఫ్గనిస్థానము పారశీకము మున్నగు దేశములు మహమ్మదీయ దేశము లయ్యెను; అమెరికా ఖండము పూర్తిగా క్రైస్తవదేశ మయ్యెను. మతము దేశవ్యవహారము నీరక్షీరములట్లు, ఎట్లు కలిసి యుండవలెనో యతఁడు జనులకు నేర్పెను. ఆ రెండును చదరంగములో గుఱ్ఱములవలె నొకదాని నొకటి కాఁచుచుండును. ఒకటి నాశనమైన పక్షమున రెండ వది కూడ నాశనమగుచుండును. మనము చరిత్ర శ్రద్ధగాఁ జదివిన పక్షమున గ్రీసు దేశము జ్ఞానమునకు నిధియని తెలిసికొనవచ్చును. ఆ జ్ఞానము క్రమ క్రమముగ రోముదేశమునకు, అటనుండి యింగ్లాండు దేశ మునకు నటనుండి యమెరికా దేశమునకు వ్యాపించెను. నేఁటి కాలమున జపానీయులు ఆ జ్ఞానవృక్షము నంటు గట్టుకొని తమ దేశమున నాఁటు కొనిరి. ఆత్మజ్ఞానవిరహితమైన యీనాఁటి విజ్ఞానము గ్రామములను బరశురామప్రీతి చేయుటకును బిడ్డ లనక స్త్రీ లనక వృద్ధులనక మను ష్యులను వినాశము చేయు విమానములను ఫిరంగులను బాంబులను జేయుటకుఁ బనికివచ్చుచున్నది. ఇంతకన్న శోచనీయమైన యవస్థ లేదు. ఆత్మజ్ఞానము లేకపోవుటయే దీనికి ముఖ్యకారణము. రామదాసుఁడు మత వ్యాప్తితోఁ గూడ మహారాష్ట్రులకు స్వరాజ్యమును గూడ సంపాదింపవలె నని తలంపు గలిగి యుండెను. రామదాసుని మతము నవలంబించినవారు

విరక్తులై యుండవలెనని యాతని శాసనము. విరక్తు లనఁగా సన్యాసులు కావలెనని యతని యభిప్రాయము కాదు. మనుష్యులు గృహస్థులై సంసారముచేయుచు కేవలము లోకవ్యవహార నిమగ్నులుగాక యీశ్వరభక్తి గలిగి ధర్మమార్గమున సంచరించు చుండవలె నని యతని బోధన సారము. ప్రతి మనుష్యుడు ధర్మమును దాను ముం దాచరించి చూపి పిదప జనులకు బోధింపవలసినదని యాతని యుత్తరువు. ఆచరణతోఁ గూడని మాటలు వట్టి బూటకములు. వట్టిమాటల పోగులు కుక్క మొఱఁగుల వంటివి. ధర్మాచరణము చేసిన వారు బోధించినప్పుడే ప్రజలా ధర్మము నాచరింతురు గాని వట్టి మాటలచే గాదు.

---

# తొమ్మిదవ ప్రకరణము

## బోధకులు - బోధకధర్మములు

ఒకజాతి పదభ్రష్ట మైనప్పుడు జనులు దేశలాభము చూడక స్వలాభ పరాయణులై ధర్మహీనులై వర్తింతురు. దేశమట్లు పాడైనప్పుడు దైవానుగ్రహ ముచేత నెవరో కొందరు స్వార్థత్యాగులు బయలుదేరి దేశసముద్ధరణమునకై పాటుపడుదురు. అట్టి స్వార్థత్యాగులు మానవ సేవఁ జేసి లోకముద్ధరించు టకై ప్రయత్నముజేసి తమ ప్రాణములనైన ధారవోయుదురు. స్వదేశమును వెండియు నుద్ధరించుటకు రామదాసుఁడు స్వార్థవిహీనులైన యువకు లనే కులఁ జేరఁదీసి వారిని శిష్యులుగా స్వీకరించెను. పదుచువాండ్రు లోకసేవఁ జేయుటకై ముఖ్యమైన యాటంక మొకటి గలదు. ప్రతి మనుష్యుఁడు తనపొట్టఁ బోషికొనుచు యాలుబిడ్డలఁ బోషించుకొనవలసిన భారమొకటి యున్నది గదా? మానవుఁ డూరకుండినను బొట్ట యూరకుండదు. ఆకలిచే బాధ పడుచున్న వాఁడును కుటుంబ సంరక్షణ చేసికొనలేనివాఁడును లోక మున కేమిమేలు చేయఁగలడు? సర్వధర్మములను బరిత్యజించి తన్నొక్కనినే నమ్మిన వానిని సకల కష్టములనుండియు సకల పాపముల నుండియు విము క్తుని జేయుదు నని శ్రీకృష్ణ భగవానుఁడు గీతలోఁ జెప్పియున్నాఁడు గదా! గొప్ప మనోదార్ఢ్యము గల మహాత్ములు దప్ప సామాన్య జను లా వాక్యము ననుసరించి నడువలేరు గదా! శిష్యులకు నిత్యభుక్తి గడచుటకు రామ దాసుఁడు మతబోధకు లందఱు భిక్షావృత్తిచేత జీవింపవలె నని శాసించెను. ఈ యుపాయముచేత మతబోధకు లొకరి యండ నుండకుండ యొకరికి విధేయులై యుండకుండ యథేచ్ఛముగా సర్వతంత్ర స్వతంత్రులై వ్యవహ రించుటకు వీలుకలిగెను. ఈ భిక్షావృత్తి మతబోధకుల యాకలి దీర్చుటకు మాత్రమే యుద్దేశింపబడెను. గాని వారు దాని నొక జీవనాధారముగఁ జేకొని ధన కనక వస్తు వాహనములు సంపాదించుకొనుటకుఁ గాదు. ఈ

వృత్తి వలన స్వార్థత్యాగులైన యువకులు పొట్టకై ననవసరములైన వ్యవహారములలో దిగకుండ తన కృత్యము తాను నిర్విఘ్నముగఁ జేసికొనుట కవకాశము గలిగెను. పూర్వకాలమున భిక్ష మెత్తు సన్యాసులు లోకానుగ్రహార్థమై పాటుపడెడి వారని వారిని జనులు గౌరవించెడివారు. భిక్షాటనము నేఁటికాలమున సోమరిపోతులకు శ్రమలేనిదియు, లేశము పెట్టుబడి లేనిదియునైన యొక వ్యాపారమైనది. ఇది దేశముయొక్క దురదృష్టము. పని చేయగలవాండ్రు పనిచేయక సంసారయాత్ర నేదోవిధముగ గడుపుకొను లోకులను బీడించుట శోచనీయము. రామదాసుఁడీ భిక్షావృత్తిని గుఱించి దాసబోధ యను గ్రంథములో సకల సందేహములు నివేదించెను. తన మహారాష్ట్ర ధర్మము నవలంబించిన ప్రతి బ్రాహ్మణునకుఁ బ్రతి మానవునకు విద్యుక్తధర్మమని విధించెను. బ్రాహ్మణుఁ డనఁగా బ్రాహ్మణ జన్మము నెత్తినవాఁడు కాదు. బ్రహ్మజ్ఞానము కలవాఁడు మాత్రమే బ్రాహ్మణుఁడు. దేశ సేవా పరాయణుఁడే బ్రాహ్మణుఁడు. ఈ యభిప్రాయము మనసులోఁబెట్టుకొనియే రామదాసుఁడు బ్రాహ్మణులనే గాక యర్హులని తోఁచిన వారిని నాలుగువర్ణములనుండి శిష్యులుగ గ్రహించెను. అందుఁ బురుషులేగాక స్త్రీలుగూడ నుండిరి. పవిత్రవర్తనము వైరాగ్యభావము గల వారిని మాత్రమే యతఁడు చేరఁదీసెను. రామదాసుఁడు శిష్యులే విధముగ ధర్మముల నవలంబించవలె నని విధించెనో విచారింతము. ఇందుకై యతఁడెన్నో మఠముల స్థాపించెను. ప్రతి మఠమునకు నొక్క శిష్యుని మఠాధిపతిగా నియమించెను. ప్రతి మఠాధిపతియుఁదన మండలములో మిక్కిలి శ్రద్ధతో జనులకు బోధింపవలెను. ఈ యుద్యమమునకై యా బోధకుఁ డేదో యొక గ్రామమున పెక్కునాళ్లుండక బోధించుచు నొక పల్లెనుండి మరి యొకపల్లెకు సంచారము చేయుచుండవలెను. రామదాసుఁడు తాను తీర్థయాత్రలు చేసిన పండ్రెండు సంవత్సరములలోను జ్ఞానసంపాదన చేసినట్లే బోధకులు గూడ సంచార సమయమున బహు విషయపరిజ్ఞాన మార్జింపవలెనని యతని కోరిక. కాని యతఁడు మఠమును విడచి సంచరించరాదు. తన మఠ మే మండలములో నున్నదో యా మండలములో మాత్రమే యతఁడు సంచరింపవలెను. ఈ విధముగ రామదాసుఁడు లెక్కలేనన్ని

మఠములు స్థాపించి లెక్కలేనంతమంది శిష్యుల నేర్పఱచి వారిని సంచార కార్యమున సంచరించు చుండవలెనని యాజ్ఞాపించుటచేత నతఁడెంత దూరముగ నాలోచింపఁ గలవాఁడో తెలుసుకొన వచ్చును. మతబోధకుఁ డెట్లు జనుల హృదయముల నాకర్షింపవలెనో వారి నెట్లు రంజింపచేయవలెనో యా విషయమై యతఁ డిచ్చిన యుపదేశములు శ్లాఘాపాత్రములు. ప్రతి గ్రామము పోకముందు బోధకుఁడు గ్రామముయొక్క పరిస్థితులు చక్కగా విచారించి ప్రవేశింపవలెను. ఈ విచారణమువలన గ్రామవాసులలో నెవ్వరు సాధుజనులో, ఎవ్వరు ధర్మపరాయణులో, ఎవ్వరు వట్టి ప్రేలరులో, ఎవ్వరు వట్టి స్తోత్రపాఠకులో, ఎవ్వరు స్వార్థపరులో తెలిసికొని తన వల పన్ని పని చేయుటకు నవకాశము కలుగును. ఆ బోధకుఁడు దుర్జనులను, ద్రోహులను బహిరంగముగ ఖండించి దూషించఁ గూడదు. దుర్జనులను కనుఁగొనవలసినదేగాని వారిని దూషించి వారితో విరోధము దెచ్చుకొనఁ గూడదు. తక్కిన జనులకంటె వారిని మిక్కిలిగా భూషింపవలెను. ఈ విధముగ నేర్పఱుపఁబడిన మతబోధకులు మహారాష్ట్రదేశమునఁ గల నగరములలోను, బట్టణములలోను, బల్లెలలోను సంచారముచేసిరి. మానవుల సమస్త విషయములలోను రామదాసీ శిష్యవర్గము వలన సకల జ్ఞానమును సంపాదించెను. నీవు భిక్షుకుఁడవుగ సంచరించినప్పుడు "గొప్ప గ్రామమైనను కుగ్రామమైనను బేదయూరైనను, సంపదగల గ్రామమైనను, వెళ్లి గుడిసె గుడిసెకుఁ దిరిగి సమాచారము సంగ్రహించుకొని రమ్మని యతఁ డాజ్ఞాపించెను. అటువంటి భిక్షుకుఁడు స్వార్థపరుడని యెవఁడనఁ గలఁడు. ధనముగాని వస్త్రములుగాని గ్రహింపక వారు బిచ్చ మెత్తినపుడు గుప్పెడు ధాన్యము తప్ప మరి యే వస్తువు పుచ్చుకొనఁ కూడదని యతఁడు కఠినముగ శాసించెను. బోధకుఁడు సంతుష్టి గలిగి యుండవలయును గాని యాశాపాతకుఁడు కాఁగూడదు.

మన ప్రాణము లితర ప్రాణములతోఁ గలుపవలెను. మన యాత్మ యితరుల యాత్మలతో మైత్రిచెందవలెను. ఆహా! యిది యెంత యమూల్యమైన యుపదేశము. ఈ యుపదేశము ననుసరించినవారు మహారాష్ట్ర జాతికి నిర్మాతలైరనుట ఆశ్చర్యముగాదు. దేశముద్ధరింపఁ దలఁచినవారు

జనులను బీడింపఁగూడదు. వారు నడచిన త్రోవలనే నడచుచు వారి సంభాషణాను పారముగానే భాషించుచు వారి హృదయములఁ జూఱ గొవ వలెను. పిల్లలకు బోధింపవలసినప్పుడు వారి గ్రహణశక్తిని జ్ఞానమునుబట్టి బోధింపవలెను. ఎవరికి బోధించినను వారి జ్ఞానమును బట్టియే బోధనము చేయవలయును. మీరేమి చేయఁదలఁచినను జనహృదయములను రంజింపుచునే చేయవలయును. వారి నెప్పుడు పీడింపఁగూడదు. ఈ విధముగ రామదాసుని శిష్యులు జన సామాన్యముతో గలసిపోయి వారి విశ్వాసమునకుఁ బాత్రులై రామదాసు యొక్క సంకల్పము నెఱవేర్చిరి. శిష్యులు సంచారము చేయుచు నీ క్రింది పద్ధతులను శ్రద్ధగాఁ నాచరించుచుండిరి. (1) వైరాగ్యము. మూఁడు లోకముల సామ్రాజ్యము వారి కర్పించినను వారు దానిని గడ్డి పరకగఁ జూడ నారంభించిరి. (2) వేద శాస్త్ర పఠనమును, స్నాన సంధ్యా ద్యనుష్ఠాన నిర్వహణమును వారికి ముఖ్యములు. (3) ప్రతి గ్రామము నందును శిష్యులు భజన కీర్తనలు తప్పక చేయుచుండవలెను. శిష్యుఁడొక గ్రామమునఁ గొన్ని గంటల కన్న నెక్కువగ నుండఁగూడదు. ఏ విధమగు బహుమానమును స్వీకరింపఁగూడదు. (4) పరోపకారము తప్పక చేయుచుండవలెను. శిష్యులు మతబోధయందేగాక వైద్యము మంత్రశాస్త్రము గూడ నేర్చుకొని చేతనైనంత సాహాయ్యము జనులకుఁ జేయుచుండెడివారు. ఈ శరీరము పరులమేలు కొఱకే యుపయోగింపవలెను. పరోపకారార్థ మిదం శరీరమ్," అను మాటను జ్ఞప్తిలో నుంచుకొనవలెను. కాని శిష్యులు "శరీర మాద్యం ఖలుధర్మసాధనమ్" అను మాట గుఱిజేసికొని తమ శరీరములను సంరక్షించుకొనుట మానరాదు. ఆరోగ్యము చెడఁగొట్టుకొనఁ గూడదు. శిష్యులు జనుల హృదయముల యొక్క లోఁతు తెలిసి కొనవలెను. ఇది స్వకార్యనిర్వహణమున నతని కెంతో పాయపడుచు వచ్చెను. జనులయొక్క హృదయముల నెఱిఁగినవాఁడు దేశకాల పరిస్థితులను గ్రహించి తన ధర్మమును సంతుష్టికరముగ నెఱవేర్చుకొన వచ్చును. తన సంచారములో లభించిన సమాచార లేశములను సంచారాంతమున నెమరు వేసికొని శిష్యుఁడు కార్యసాధనమునకు వినియోగించుకొనవలెను. ఈ పరిశోధనమువ నెవరు తవకార్యమువకు

వనుకూలురో యెవరు ప్రతికూలురో యేవిధముగ వారిని సమీపింపవ లెనో యెత్తెఱంగున దన విధి నెఱవేర్పవలెనో శిష్యుఁడు తెలిసికొనఁదగిన యవకాశము గలుగును. ఏ కార్యమైనను నా దినమునఁ జేయఁదగినది మరునాటివఱకు నిలుపు చేయఁగూడదు. గురువుగారి మార్గమునే శిష్యుల ననుసరించుట చేత శరీరము నీటిబుగ్గవలె క్షణభంగుర మని తెలిసికొని యెప్పటికార్య మప్పుడు చేయుచుండిరి. ముందు నిముషము నందేమి సంభవించునో మన మెఱుఁగము గాన నిరంతరము రామనామ స్మర ణము చేయుచు శిష్యులు స్వకార్యదీక్షాపరతంత్రులై యుండిరి. ఏకాంత స్థలమున కరిగి ధ్యానము చేయుచుండవలెను. ఆ ధ్యానమువలన మన శ్శాంతియు నసాధారణ ధైర్యము కలుగును. మహారాష్ట్రదేశ మంతయు నధోగతిలో పడిపోయినప్పుడు రామదాసు సింహమువలె గర్జించి బలిష్ఠమైన తన హస్తమును వారికందించి వారి నా బురదనుండి లేవనెత్తెను. కష్టము లేకుండ ఫలము లభింపదు. పరిశ్రమ లేకుండ స్వరాజ్యము చేకూరదు. కార్యశూరత్వము లేక నే లాభము గలుగదు. కర్మము విషయమై శ్రీకృష్ణ భగవానుఁ డేమి చెప్పెనో మన మెఱుఁగుదుము. పనికే కర్మ యని పేరు. కర్మ చేయక నెవఁడును నుండలేఁడు. ఏలయన వినుట కర్మ, చూచుట కర్మ, నడచుట కర్మ ఏ పనిని జేయక యుండుట స్వభావ విరుద్ధము. తాను స్వయముగఁ బని చేయక యితరుల నమ్ముకొన్నవాఁడు పరమ మూర్ఖుఁడు అని చెప్పుచు రామదాసుఁడు శ్రీకృష్ణభగవానుని వాక్యములే వొక్కివక్కాణించి శిష్యులను బనికై పురికొల్పెను. కార్యదీక్ష లేకుండ నెట్టి కార్యములు నెఱవేరలే దని చరిత్రయే సాక్ష్యమిచ్చుచున్నది. పరోపకారము నీతియుఁ బ్రధానముగా మంచుకొన వలసిన దని రామదాసు తన శిష్యులకు పలుమారు బోధించుచు వచ్చెను. శరీరమును నీతిమార్గమునకుఁ ద్రిప్పి నవాఁడును, నాత్మ నశింపక శాశ్వతముగ నుండునని నమ్మినవాఁడును మరణ మన్న లేశము భయపడఁడు. పేరు ప్రతిష్ఠలకొఱ కేపనిని చేయ వద్దని రామదాసుఁడు తన శిష్యులను గఠినముగ శాసించెను. మనుష్యుఁడు ఫలాపేక్ష లేక నిష్కామకర్మ చేయవలెను. కష్టపడి పనిచేసిన వారికి సుప్ర తిష్ఠ దా నంతట యదే వచ్చును. మానవుఁడు తన దారాపుత్రాదులను

భరించుటే గాక లోకమునకుఁ గూడఁ గొంత సేవ చేయవలెను. మతాధిపతియైన మహంతు లోకారాధనమే చేయవలెను. అతని హృదయము స్వార్థపరత్వమునకుఁ జోటీయఁ గూడదు. అట్లిడ మిచ్చినవాఁడు మహంతు శబ్దమునకుఁ దగఁడు. స్వార్థపరు లెన్నఁడును, దమకును నితరులకును గూడ మేలు చేయఁ జాలరు. జనరంజకముగఁ బనిచేయఁ దలఁచిన వాఁడు జనరంజకముగ మాటలాడవలెను. జన వశీకరణ శక్తి జిహ్వాకే కలదు. ఇతరుల సౌఖ్యమే తన సౌఖ్యముగాను, ఇతరుల బాధలే తన బాధలుగాను బోధకుఁడు భావింపవలెను. సత్యము నతిక్రమింపని స్వాదు సంభాషణ వలన నితరులు వశంవదు లగుదురుగాని కఠినోక్తుల వలన లొంగరు. పిచ్చివానిని పిచ్చివాఁ డనఁ గూడదు. ఏ రహస్యము బయలు పెట్టరాదు. సానుభూతియు, శాంతియు, తప్పును క్షమించు స్వభావమును ప్రాముఖ్యములు, కోపము మిత్రులను శత్రువులఁ జేయును. మధుర సంభాషణము శత్రువులను మిత్రులుగఁ జేయును. కొంటెవాండ్రు గాని దుర్జనులు గాని తమ వాదముల ఖండించి యెదురు తిరిగి కార్యవిఘ్నము చేయఁదలచినప్పుడు వారిని జయించుటకు శాంతవచన ప్రయోగములే మహాయుధములని యతఁడు బోధించెను. వేయేల; బోధకుఁడు పరిపూర్ణుఁడుగ నుండవలె నని రామదాసుని యభిప్రాయము. అన్ని విద్యలలోఁ గొంచెము కొంచెము వ్రేలుపెట్టక యేదో విద్యలో పరిపూర్ణుఁడై యుండుట మంచిదని రామదాసుని యభిప్రాయము. ఈ పై బోధలను జూడ రామదాసుఁడెంత ప్రజ్ఞావంతుఁడో, యెంత కార్యసాధకుఁడో సులభముగఁ దెలిసికొన వచ్చును.

---

# పదియవ ప్రకరణము

## శివాజీ - రామదాసులు

బోధన ప్రచారము గొప్ప దశలో నున్న కాలమున రామదాసుడు మహారాష్ట్రదేశమున సంచారము చేయ నారంభించెను. మతములన్నింటిని జూచి పరిశోధించుటకును, జనుల మనస్సులమీద మతబోధ యెంతవఱకు నాటు కొనినదో దెలిసికొనుటకును నతడీ సంచారము ప్రారంభించెను. జనులు గాఢ నిద్రనుండి మేలుకొని స్వమతావిష్టులై దేశము కొఱకుదమ సర్వస్వమును ధారవోయుటకు సిద్ధముగ నుండిరని యతడు తెలిసి కొనెను. ప్రపంచములో దుర్జనులు లేకుండ బోవరు. రామదాసు శిష్యులు చేయుచున్న సత్కార్యమున కిష్టపడక విఘ్నములు కలిగించి వారికి గొందఱపకారము గూఢ జేయదలంచిరి. అట్టి దుష్టులవల్ల గొందఱికి బ్రాణాపాయముగూడ గలుగునట్లు కనుపించెను. కాని యా శిష్యులు తమ గురువు పేరునకు భంగము కలుగుకుండ మెలకువతో వర్తించి ప్రాణాపాయములు దప్పించు కొనుచు వచ్చిరి. లంచములు నిరాకరించుచు సత్కార్య ధురంధరులైన యా శిష్యుల కార్యదీక్షవలన రామదాసుని పేరు మహారాష్ట దేశమున బ్రతి కుటీర మునందును, ప్రతి యంతఃపురమునందును గూడ జెప్పకొనబడుచుండెను. రామదాసుని పేరు చెప్పని వారు తలపనివారు లేరు. ఈ మత బోధల పర్యవసాన మెట్లుండునా యని ప్రతి వ్యక్తి విచారింపజొచ్చెను. ప్రస్తుతము రామదాసు సంకల్ప మటుండనిచ్చి శివాజీని గుఱించి కొంత విచారింతము. శివాజీ గర్భస్థుడై యున్నప్పుడు శివాజీ తండ్రి, షాజీ, శివాజీ తల్లిని నిరాదరణచేసి దుఃఖముల పాలుచేసెను. ఆమె తండ్రియైన యాదవరావు లుకజీ రాజకీయ సమస్యలలో నల్లుడైన షాజీతో నభిప్రాయభేదములు కలిగి యితనితో విరోధము పెట్టుకొనెను. షాజీ యింటిపట్టు విడిచి యొక స్థలము నుండి వేఱొక స్థలమునకు బాఱిపోజొచ్చెను. మామ యల్లుని వెంట

వంటి తలుమం జొచ్చెను. అట్టి పరిస్థితులలో షాజీ తన భార్యను షివనీర్ కోటలో నుంచెను. శివాజీతల్లియగు జిజియాబాయి మిగుల నాత్మగౌరవము గల స్త్రీ. గర్భభారముచేతఁ గ్రుంగియున్న యామె మృదుమానసముమీఁద నీ దురవస్థయెంతో పనిచేసెను. అధికారములో నున్నవారు తన భర్తకుఁ జేయుచున్న గౌరవము, పంపుచున్న బహుమానములు మొదలైన వన్నియు నీటి బుగ్గలవలె నస్థిరము లనియు హిందువులలోఁ బ్రధాన పురుషులకుఁ బరస్పర వైషమ్యములు కల్పించి స్వాధీనము చేసికొని యేలుటయే వారి యభిప్రాయమనియు నూహించెను. షాజీ మహారాష్ట్రమున మిక్కిలి పలుకుబడి గల పురుషుఁడు. బీజపూరు సుల్తానులను సింహాసన మెక్కించుట దింపించుట మొదలగు పనులలో నతడు మిక్కిలి గట్టివాఁడు. బీజపూరే గాక యహమద్ నగరు సుల్తానులు గూడ యాతని చేతిలోని కీలుబొమ్మలే. అతఁడెట్లాడించిన వా రట్లాడుచుండిరి. అతఁడు గొప్ప రాజ్యవ్యవహారవేత్త యని పేరు గలదు. అతడు పూనా జాగీరుదారుఁ డయ్యెను. ఆమె యెక్కడనో యొకమూల నొకకోటలోఁ బడియుండుట యెంతమాత్ర మిష్టము లేదు. మగపిల్లవాఁడు పుట్టినను, ఆడపిల్ల బుట్టినను స్వతంత్ర భావములతో నా బిడ్డను బెంచవలెనని యామె సంకల్పించెను. తరువాత స్వల్పకాలమునకే 1627 వ సంవత్సరమున ఏప్రియల్ 10 వ తేదీని నామె గర్భమున శివాజీ కుమారుఁడు జన్మించెను. ఆమె గర్భవతి యైనది మొదలు పలు కష్టములు పడెను.

శివాజీ బాల్యకాలమున విద్యాభ్యాసము చేయునప్పుడు రామాయణ వీరులు భారతవీరులు మొదలగు మహాపురుషుల యద్భుత సాహసములు విని మెచ్చి తాను గూడ నట్టిచర్యలు చేయవలెనని యాశపడు చుండెడివాఁడు. ఒకసారి బీజపూరు సుల్తాను షహజీని బిలిచి యతని కుమారుని శివాజీని చూడ వలెనని కోరెను. అప్పటికి శివాజీ కెనిమిది సంవత్సరములు వయస్సు. షాజీ యందుకు సమ్మతించి సుల్తానువద్ద మిక్కిలి వినయ విధేయతలు గలిగి దర్బారు మర్యాదల ననుసరించి నడుచు కొనవలెనని బుద్ధులుచెప్పి కొడుకును దీసికొని పోయెను. ఆ నాఁడు సుల్తాను గొప్ప దర్బారు చేసెను. దర్బారులోఁ బ్రతి మనుష్యుఁడు వంగి మోకాళ్ళమీఁద

నిలువఁబడి సుల్తానుకు సలాము చేయవలెను. ఎన్నిబుద్ధులు చెప్పినను. ఎన్ని పంజ్ఞలు చేసినను దండ్రిచెప్పినట్లు చేయక శివాజీ నిర్భయముగ నిలువఁబడి తలవంచుకొనక కన్నులు తెఱచి సుల్తాను వంక చూచెను. దుర్వినయము గల యట్టి కొడుకువల్ల దనకెట్టి కీడు మూడునో యని షాజీ భయపడెను. దర్బారు ముగిసెను. శివాజీ సెలవుగైకొనకయే చివాలున కొలువునుండి లేచిపోయెను. కొడుకును మందలింపవలె నని షాజీ కూడఁ గొలువు విడచి యావలకుఁ బోయెను. కాని యింతలో శివాజీ ఘోరకృత్యమొకటి చూచెను. రాచబాటకుఁ బ్రక్కనే యొక కటికవాఁడు. గోవు నొకదానిని జంప సమకట్టి దానిని తెగవేయుటకు కత్తినెత్తెను. ఆ ఘోరకృత్యమును జూచి శివాజీ సహింపలేక కటిక వాని చేయి యెత్తిన దెత్తినట్లుండఁగానే శివాజీ యాహస్తమును దన ఖడ్గముతో నఱికి వేసెను. షాజీ యా వార్త సుల్తాను విన్నచో నేమి ప్రమాదము వాటిల్లునో యని శంకించి వెంటనే బాలుని పునహాకు పంపించివేసెను. పోవునప్పుడు బాలుఁడు తండ్రిపైఁ గోపించి పట్టపగలు నడివీథిలో గోహత్యలు జరుగుచుండగా వారింపని ప్రభుత్వముకడ నేల యుద్యోగము చేయుచున్నా వని తండ్రిని మందలించెను. శివాజీ సాహస మట్టిది. అతఁడుపాధ్యాయుని శిక్షనుగాని తండ్రిశిక్షనుగాని బొందువాఁడుగాఁడు. శివాజీకిఁ బదియాఱు సంవత్సరములు వచ్చునప్పటికి సాహసకృత్యములయందు నభిలాష గలిగి తనవలెనే సాహసికుల కొందఱు యువకులఁ జేర్చుకొని యాయుధములు ధరించి కొన్ని యూళ్ళపై దండు వెడలి కొన్ని చిన్న కోటలను బట్టుకొన నారంభించెను. క్రమక్రమముగ నతఁడు పెద్దవాఁడై పెద్దకోటలు పట్టుకొన నారంభించెను. బీజపూరు సుల్తాను వాని దుండగములు విని వాని సాహసము మాన్పించుటకై ఒక రిద్దరు సేనాపతులను బంపెను. కాని వారిని శివాజీ మాయోపాయము చేత గెలిచెను. వారిలో ముఖ్యుఁడు అఫ్జుల్ ఖాన్ అను సేనాపతి. ఇతఁడు మిక్కిలి బలవంతుఁడు. శివాజీ సబబుగ వానిని రావించి తా నొక యినుప కవచము తొడుగుకొని కవచముచాటున నొక చిన్న యాయుధమును మఱుగు పఱచి మహమ్మదీయ సేనాపతిని గౌఁగిలించుకొన్నట్లు నటించి తన చిన్న యాయుధముతో నతని గుండెలలోఁ బొడిచి చంపెను. దానితో

వాని పేన చెల్లాచెదరై పాఱిపోయెను. ఈవిధముగ శివాజీ క్రమక్రమముగ బలవంతుఁడై 1664 వ సంవత్సరమున మహారాష్ట్రమునకు మహారాజై పట్టాభిషేకము చేసికొనెను. రామదాసుఁడు తన బోధనమును వల పన్నునప్పటికే శివాజీ రాజయ్యెను. రాజైనను శివాజీ గర్విష్ఠుఁడు గాక యేయోగి గనఁబడినను రాజ్యము వదలి వారివెంట బోవుచుండెడివాడు. భజనలు కీర్తనలు వెచ్చట జరుగుచుండినను నచ్చట కతఁడు బోవుచుండెడివాఁడు. దైవభక్తి యాత్మజ్ఞానము మఱచువాఁడుగాఁడు. రాజ్య మద మెంత మాత్రము నతనికి లేదు.

శివాజీకి శ్రీతుకారాంబావాజీ యనిన మిక్కిలి భక్తి. ఎంత దూరము నందుండియైన నతని భజనలకుఁ గీర్తనలకు వెళ్లుచుండెడివాఁడు. అతఁడు భక్తిపారవశ్యమున నొకనాఁడు తుకారాము కడకుఁ బోయి నిజమగు భక్తి నుపదేశింపు మని యతనిని బ్రార్థించెను. తుకారాంబావాజీ "నేను కాదు నీ కుపదేశించువాఁడను. మంచి యుపదేశము కావలసినయెడల నీవుపోయి సమర్థ రామదాసుని కాళ్లపై బడు" మని మృదుమధుర భాషణములతో వానతిచ్చెను. రామదాసు యొక్క మతబోధనంతయు శివాజీ యెఱిఁగినవాడగుటచే నతని దర్శనము చేయవలెనని యప్పుడప్పుడు తలపోయుచుండెను. కాని యవకాశము చిక్కలేదు. రామదాసుని యొక్క జాడలు తెలిసికొనవలెనని శివాజీ పలుమాఱు ప్రయత్నించెను. కాని రామదాసుని శిష్యులకే యతని జాడలు సరిగఁ దెలియవు. శివాజీకి రామదాసు నతని బోధకుల యెడల మిక్కిలి భక్తి గలదు. అందుచే నతఁడు బోధకులఁ గలసినప్పుడెల్ల వారికి గౌరవ ప్రపత్తులు జరుపు చుండెను. రామదాసుని యాత్మజ్ఞానమును నిండు పూనికను మహారాష్ట్ర దేశోద్ధరణ సంకల్పమును శివాజీ గుర్తెఱిఁగి యుండెను. రామదాసుని యుద్యమమే మహారాష్ట్ర దేశమున వీరులైనంతవఱకు నిజమైన యుద్యమము. అంతకుముం దిట్టి యుద్యమ మెందును లేదని శివాజీకిఁ దెలియును. ఎట్లైన రామదాసుని జూచి తీరవలెనని శివాజీ యొకమాఱు నానా మఠములను నానారణ్యములను దిఱిగి వానిపొడ గానక రామదాసు దర్శన మగువఱకు నన్నము ముట్ట నని నీరు త్రాగ నని ప్రతినఁ బట్టెను. ఎట్టకేలకు శివాజీ యెట్టయెదుట నొక

మహాపురుషుఁడు కనఁబడెను. మీరెవ రని యడుగఁగనే రామదాసుఁడ నని చెప్పెను. మరునాఁ డుదయమున శివాజీ నిద్రమేల్కొనక మునుపే రామదాసు వద్దనుండి యొక సన్యాసి జాబుతెచ్చి వాకిట నిలిచియున్నాఁ డని సేవకులు శివాజీకిఁ జెప్పిరి. వెంటనే యతఁడు పానుపు దిగి యా సన్యాసికి నమస్కరించి గౌరవించి యా జాబు నందుకొని దానికి నమస్కరించెను. ఆ జాబులో ని ట్లుండెను. "యాత్రకుఁ బోవలసిన పుణ్యక్షేత్రము లన్నియు నాశము చేయఁబడినవి. బ్రహ్మక్షేత్రము లపవిత్రము చేయఁబడినవి. ప్రపంచ మంతయు నల్లకల్లోలముఁ జేయఁబడినది. ధర్మ మెచ్చటను గానఁబడదు. ధర్మమును గాపాడుటకై భగవంతుఁడు నిన్నేర్పఱచినాఁడు. ఈ దేశమున ననేక మహారాజులు మంత్రులు రాజనీతికోవిదులు గొప్పపండితులు నున్నను ధర్మము రక్షించు వారెవ్వరును లేరు. మహారాష్ట్ర ధర్మ మంతయు నీ మీఁదనే యాధారపడి యున్నది. నేను నీ రాజ్యములోనే యిన్నినాళ్ళున్నప్పటికి నన్ను నీవు కనుఁగొనుటయే లేదు. అందుకుఁ గారణ మేమో నేఁ జెప్పఁజాలను. నీ మంత్రులు బుద్ధిమంతులే. నీవు ధర్మమూర్తివి. అందుచేత నీకు మాటిమాటికి హితోపదేశము చేయనక్కఱలేదు. ధర్మము పునరుద్ధరించుట యను ప్రతిష్ఠ నీ కే దక్కవలెను. అది నీవు పోఁగొట్టుకొనఁ గూడదు. అతి మాత్రములైన రాజకీయ విషయములపై నాశ్రద్ధ నిలిచి యున్నది. ఈ యుపదేశమునకు మనసున నాగ్రహింపక నన్ను క్షమింపుము." ఈజాబు మనస్సును గఱఁగించువట్టి జాలిమాటలతో మహారాజు గౌరవమునకుఁ దగినట్లు వ్రాయబడినది. ఆ రాయబారము తెచ్చిన సన్యాసిని శివాజీ మన్నించి పూజించి విలువగల వస్త్రముల బహుమాన మిచ్చి పంపెను. వెంటనే రామదాసుని యొక్క పాదపద్మములయొద్దఁ బడుటకుఁ దాను బయలుదేరి వచ్చుచున్న ట్లొక ప్రత్యుత్తరము వ్రాసి యా సన్యాసి కిచ్చి పంపెను. ఆ దినముననే శివాజీ స్వల్ప పరివారముతో నిద్దఱు ముఖ్యమిత్రుల వెంటఁ బెట్టుకొని రామదాసును గలిసికొనుటకు బయలుదేరి ఛాఫల్ మఠమునకుఁ బోయెను.

అంతకుముందే రామదాసుఁ డా మఠమును విడిచి షైగాన్ వాడీకి వెళ్ళిరని శిష్యులు చెప్పిరి. ఆ మఠమున అక్క యను నొక యువతీమణి

మఠాధికారిణియై పెత్తనము చేయుచుండెను. రామదాసుఁడు వచ్చువఱకు నచటనుండి భోజనము చేయుమని యామె ప్రార్థించెను. శ్రీరామదాసుని యాశీర్వచనముఁ బడయువఱకుఁ దా నన్న పానాదులు ముట్టనని ప్రతిజ్ఞ చేసినట్లు శివాజీ యామెతోఁ జెప్పెను. సరిగ దారిచూపుట కొక శిష్యుని వెంటఁ బెట్టుకొని షైగాన్‌వాడి మఠమునకుఁ బొమ్మనియు నచ్చట రామదాసుని దర్శనము తప్పక దొఱకు ననియు నామె చెప్పెను. శివాజీ షైగాన్‌వాడీ వెళ్లుసరికి రామదాసుఁడు కొండక్రింద నొక లోయలోనున్న యొక తోటను జూడఁబోయెను. కళ్యాణస్వామి యను శిష్యుడు శివాజీ రామదాసునకు వ్రాసిన జాబు నప్పుడు చదువుచుండెను. కళ్యాణస్వామి శివాజీ చెయ్యిపట్టుకొని గురువు నొద్దకు తీసికొని పోయెను. శివాజీ వినయముతో నమస్కరించి చేతులు జోడించుకొని వాని యెదుట నిలిచెను. "ఆహా! నీవు నీ జాబు నొక్కసారియే వచ్చినవని" రామదాసు వానిని బలకరించెను. "నేను జిరకాలమునుండి నీ దేశములో నివసించుచున్నాను. నీవు నా యోగక్షేమము లరయుచున్నందులకు నేను చాల సంతోషించుచున్నాను." తన్ను గుఱించి శివాజీ యే మాత్రము కనుఁగొనుట లేదని యతనిని దెప్పుటకై యీ మాట రామదాసు పలికెను. శివాజీ తలవంచుకొని పశ్చాత్తాపపడుచు నిట్లనియె. "స్వామీ! నేను మిక్కిలి పాపాత్ముఁడను. నేఁ జేసిన తప్పులన్నిటిని మీకృపాతిరేకమున క్షమింపుఁడు." శివాజీయొక్క వినయ విధేయతాదులను గనుఁగొని యుపదేశము పొందుటకు సిద్ధముగ నుండుమని రామదాసు యాజ్ఞాపించెను. శివాజీ వెంటనే తన వెంట వచ్చిన బాలాజీకిని నీలవంతునకును బూజా ద్రవ్యములు తీసికొని రమ్మని వర్తమాన మంపి తాను స్నానమునకై పోయెను. పూజాద్రవ్యములు రాఁగానే రామదాసుఁడు శివాజీని గొండశిఖరముమీఁద నొక మూలకుఁ దీసికొనిపోయి యుపదేశము చేసెను. ఈ యుపదేశ కార్యమెన్నఁడు బహిరంగముగ జరుపఁబడలేదు. రామదాసు శిష్యులలో నొకఁ డగు దివాకర్ భట్ శివాజీ రామదాసునకుఁ జేసిన పూజాసమయమునఁ బురోహితుఁడై పూజామంత్రములఁ జదివెను. శివాజీ పూజాకాలమున గురువర్యుఁ డగు రామదాసునకు విలువగల జరీబట్టలు, పట్టుబట్టలు, నగలు, రత్నములు,

ముత్యములు, మొహిరీలు విశేషముగ సమర్పించెను. అభిషేక విధి సమయమున శివాజీ యొక లక్షరూపాయల విలువగల వెండి బంగారు నాణెములను గురువు శిరస్సున నభిషేకము చేసెను. ఈ గురుసందర్శనము 1649 సం॥ ఏప్రియల్ 12 వ తేదీని జరిగెను. తెలుఁగు తేదీ ప్రకారము విరోధినామ సం॥ వైశాఖ శుద్ధ నవమి గురువారమునాఁడు జరిగెను. గురుపూజానంతరమున శివాజీ చేతులు జోడించుకొని నిలువఁబడి తన్ను దీవించి పరమార్థ విషయముల నుపదేశింపు మని గురువును వేడుకొనెను. శివాజీ నోట వెడలిన మాట లన్నియు వ్రాసియుంచుమని రామదాసు శిష్యుఁ డైన కళ్యాణస్వామిని నాజ్ఞాపించెను. కళ్యాణస్వామి వ్రాయుటకు సిద్ధమైన తరువాత రామదాసుఁడుపదేశమును జెప్పి వ్రాయించెను. రామదాసుఁడు శివాజీని దీవించి యతనికి నొక కొబ్బరికాయయు గుఱ్ఱపులద్దెయు విభూతియు కొన్ని గులకరాళ్ళను ఇచ్చెను. ఈ విపరీత బహుమానముల యొక్క అర్థము సామాన్యముగ నెవరికి దెలియలేదు. ఆ బహుమానములను శివాజీ తన తల్లికిఁ జూపినప్పు డామెయు వాని యర్థమును దెలియక పోయెను. అప్పుడు శివాజీ యా సమస్య నిట్లు విప్పి చెప్పెను. "గుఱ్ఱపులద్దె వలన గుఱ్ఱపుదళము వృద్ధియగుఁగాక యనియు విభూతివలన భూమి చాల జయింతువుగాక యనియు గలకరాళ్లవలనఁ బలుకోటలు నిర్మింతువుగాక యనియు నర్థము" అని చెప్పెను. రామదాసుఁడు చేసిన యాత్మ జ్ఞానోపదేశము శివాజీ హృదయమున వైరాగ్య మహాగ్నిని రగులు కొలిపెను. సహజముగనే యాత్మజ్ఞాన శక్తి గల చిత్తము ప్రబుద్ధమై యప్పుడు శివాజీ యిట్లనియెను. "స్వామీ! తేజోమయములైన మీవాక్యములు వర్ణనాతీతమైనవి. వినశ్వరములైన యీ భౌతిక విషయములను విడచుటకు నే నాతురపడుచున్నాను. మీప్రియశిష్యుల వలెనే నేను గూడ నొక సన్యాసిని గావలెనని యున్నది. అట్లనుగ్రహింపుఁడు. ఈ రాజ్యాంగవిషయసంకటము లిఁకఁ జాలును. నేను జేయవలసిన దేదో చేసియుంటిని. రాజ్యవిషయములం దాసక్తి గలవారు దానిని బూని తక్కిన పని చేయుదురుగాక!" ఆ మాటలు విని రామదాసుఁడు నవ్వి యిట్లనియె "శివబాబా, నీవు క్షత్రియుఁడవు. రాజ్యపాలనము, ప్రజారక్షణము, ఈశ్వరసేవయు నీ ధర్మములు. కావున

నీవు సన్యసింపఁగూడదు. ఈ ధర్మములు వదలినయెడల నీకు మహాపాపము సంక్రమించును. నీవింకను జేయవలసిన మహాకార్యములు పెక్కులున్నవి. ఈ మ్లేచ్ఛులచేత జగ మెట్లాక్రమింపఁబడినదో నీవు చూచుట లేదా? మహా మహుఁ డైన రఘురాముఁడు భూమినంతను మ్లేచ్ఛులనుండి విడిపింపఁ గోరుచున్నాఁడు. ఈ ధర్మమును నిర్వర్తించితివా, కఠినతపస్సు చేసిన వారికంటె నెక్కువగా నీకు ముక్తి కరతలామలక మగును. రాముఁడు, హనుమంతుఁడు, పాండవులు మొదలగు మహాపురుషుల చరిత్రములు నీ వెఱుఁగుదువు. వారు ధర్మము నిమిత్తము తమ సర్వస్వము ధార పోసిరి. ఎంత గొప్ప వంశమునుండి నీ వుద్భవించితివో యదియు నీ వెఱుఁగుదువు. నీ పూర్వులైన సిసాద్ సింగ్, పృథ్వీపాల్ సింగ్ లక్ష్మణసింగ్ మొదలగువారి చరిత్రలు జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము. వారియడుగుల జాడనే వర్తింపుము. నీకు దారి చూపుటకే వారి చరిత్రలు వ్రాయఁబడియున్నవి" యని రామదాసుఁడు శివాజీకి క్షత్రియ ధర్మమును, రాజధర్మము నుప దేశించెను. ఈ యుపదేశవాక్యములు శివాజీని స్వధర్మమువైపు ద్రిప్పెను. తన కభిషేకించినసొమ్ము ప్రోగుచేసి పేదగొల్లపిల్లలు గ్రహించి సుఖించు టకై యడవిలో నన్నిప్రక్కల వెదజల్లు మని చెప్పెను. మఱునాఁడు నీలపంతు మొదలయిన శివాజీ యనుచరులకుఁ గూడ రామదాసుఁ డుప దేశించెను. ఆయుత్సవము ఛాఫల్ మఠములో మహావైభవముతో జరిగెను. శివాజీయొక్క యుద్యోగస్థులకును రామదాసుయొక్క శిష్యులకును సంత ర్పణలు జరిగెను. శివాజీ బ్రాహ్మణులకు నన్నవస్త్రము లిచ్చి గురుదక్షిణగా రామదాసుని పాదములపై నపారధనరాసులు పోసెను. అప్పుడు గొప్పసభ జరిగెను. రామదాసుఁడు శివాజీ యనుచరులలోఁ గొందఱ కుపదేశము చేసెను. అత్తఱి బాలాజీ నీలపంతుల విశ్వాసమును రాజభక్తిని రామదా సున కెఱుక పఱచి కొని యాడెను. రామదాసుఁ డదివఱకే వారి సౌశీల్య మెఱిఁగినవాఁ డగుటచే వారికిఁగూడ నుపదేశము చేసెను. ఉపదేశానం తరమున రామదాసుఁడు సేవకధర్మమునుగుఱించి ప్రసంగించెను. ఈ సేవకధర్మము వాని గ్రంథములలోఁగూడఁ గలదు. అంతవఱకు బాలాజీ శివాజీకి మిత్రుఁడై పనిచేసెను. అంతటినుండి యతఁ డతనిగురుబంధుఁ

డయ్యెను. శివాజీ చాఫల్ మఠములో నొక వారము దివము లుండి యాదినములలో రామదాసుని శిష్యులలో ననేకులకుఁ బట్టాల నిచ్చి యాతనికార్యము తుద నెగ్గుటకు ధనసహాయముగూడఁ జేసెను. శివాజీ నిరంతరము రామదాసుని సన్నిధానమున నుండఁగోరెను. కాని రామదాసు దానికిఁ గట్టిగ నిరాకరించెను. "నేను సన్న్యాసిని గావున నే నెల్లప్పుడు వనములలో నుందును. నీవు నాతో నుండఁగూడదు. నీవు క్షత్రియుఁడవై పుట్టినందులకు దేశపరిపాలన చేసి ధర్మము కాపాడవలెను" అని యతఁడు బదులుచెప్పెను. ఉపదేశము నాఁటికి శివాజీ వయస్సిరువది రెండు సంవత్సరములు. అది మొదలుకొని శివాజీ ప్రతివారము రామదాసుని దర్శనము చేయుచు వెనుకటివారమున జరిగిన సంగతుల నన్నియు వానికిఁ జెప్పుచు ముందువారము జరుపవలసిన కార్యములగుఱించి యతని నాలోచన లడుగఁజొచ్చెను. కాలక్రమమున శివాజీ యొక్క రాజకీయ వ్యవహారములు మితిమీఱిపోయినందున మునుపటివలె నతఁడు ప్రతివారము గురుదర్శనము చేయలేకపోయెను. తఱచుగా రామదాసుని దర్శన భాగ్యము లభించుటకై రాయఘడ్ కోటకుఁగాని ప్రతాప్‌ఘడ్ కోటకుఁగాని షాజ్జాన్ కోటకుఁ గాని బస మార్పు మని శివాజీ రామదాసును వేఁడుకొనెను. అందుకు రామదా సిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "శివబాబా, నేను వన సంచారిని. నా కీ చోటు, ఆ చోటు అన్న మాటలేదు. అటువంటివాఁడను నేను స్థిరముగా నొక చోట నెట్లుండఁగలను? అదిగాక నీవు రాజువు. సముద్రమును, నిప్పును, రాజును నమ్మఁగూడ దని శాస్త్రములు చెప్పుచున్నవి. మా వంటివారికి రాజసహవాస మెన్నఁడు క్షేమకరముగాదు. నా ప్రస్తుతస్థితి నాకు సుఖకరముగానే యున్నది. నాక్షేమము విషయమై నీకుఁ గల శ్రద్ధకుఁ జాల సంతోషించుచున్నాను. నిరంతర సహవాసము మన కనవసరము." ఈమాటలు శివాజీ హృదయమున వ్రణముగా నాఁటెను. అందుచే నతఁడు విచారమగ్నుఁ డయ్యెను. ఈ విచార మతని రాజ్యాంగ విషయములను గొంత పాడుచేయునేమో యని సందేహము కలిగెను. ఆ మాటలు విని రామదాసుఁడు తాను పరాలీకోటలో నుండ నిశ్చయించితి నని శివాజీకి వర్తమాన మంపెను. వెంటనే శివాజీ పరాలీవద్ద గొప్ప

కోటను, మఠమును, రామదాసుని కిష్టమగున ట్లతని యాలోచన ప్రకారము కట్టుఁడని యాజ్ఞ యిచ్చెను. 1650 సం॥ మొదలుకొని పరాలీ మఠము నందును, షాజ్జాన్‌ఘడ్ నందును రామదాసుఁడు నివసింపఁజొచ్చెను. వాని పోషణ నిమిత్తము కొన్ని భూములుగూడ నిచ్చెను. రామదాసుని మఠ వ్యవహారముల నన్నిటిని కనుఁగొనుటకును, దేవతోత్సవముల నన్నింటిని సరిగ జరిపించుటకును శివాజీ కొంతమంది బెద్ద యుద్యోగస్థులను, కొందఱఁ జిన్న యుద్యోగస్థులను నియమించెను. 1652 సం॥ రామదాసుఁడు తన తల్లిని సోదరుని జూచుటకు జాంబ్ గ్రామమునకు వెళ్లెను. అక్కడనుండి యతఁడు మాళవ దేశమునకుఁ బోయి యుద్ధవుఁ డను నొక శిష్యుని బ్రధాన మఠాధిపతిగా నియమించి 1654 సంవత్సరమునఁమఱల దన స్థానమునకుఁబోయెను. అతని తల్లి రాణూభాయి 1655 సం॥నను, తమ్ముఁడు శ్రేష్ఠుఁడు 1657 సంవత్సరమునను గ్రమముగ మరణ మందిరి.

శివాజీ మఠములకుఁ జేసిన దానములు వేర్వేఱఁ బేర్కొన నక్కఱ లేదు. కాని శివాజీ రామదాసుయొక్క బోధనావ్యాపారమును దనపరిపాలనావిషయములో నొక భాగముగ స్వీకరించె నని చెప్పినఁ జాలును. ఈశ్వరధర్మ స్వరాజ్యముల సమ్మేళనము మహారాష్ట్ర కర్ణాట మాళవ దేశములలో నద్భుత మైన మార్పు కలుగఁజేసెను. ఈ విధముగ మతబోధనము మహారాజుయొక్క ప్రాపు గాంచిన తోడనే దేశమునందలి ప్రతివ్యక్తియుఁ దన ధర్మము నెడలను రాజ్యము నెడలను నెట్లు నడచుకొనవలెనో తెలిసికొనెను. వ్యవసాయము వృద్ధిచెందెను. పంటలు పుష్కలముగఁ బండెను. పశుసమూహము బాడియు వృద్ధిపొందెను. సాంఘిక వ్యవహారములు బలమైన పద్ధతులమీఁద నడచెను. వేయేల పరస్పర సహకారము జనసామాన్యముయొక్క మనస్సుల నుత్సాహ పఱచెను. మొట్టమొదట శివాజీయొక్క సంకల్పములలో నడుగడుగునకు నాటంకముఁ గల్పించిన స్వదేశ జనులే యిప్పుడతనికిఁ దోడుగ వచ్చిరి. రామదాసునియొక్క సహాయ సహకారములు లేకపోయిన పక్షమున శివాజీ ప్రతిష్ఠాకర మైన స్వతంత్ర స్వరాజ్యమును స్థాపింపలేకుండును. రామదాసుయొక్క సహకార మను విద్యుచ్ఛక్తిచేతఁ బ్రదీప్త మైన శివాజీ రాజదండము నాలుగు ప్రక్కలనుండి

శౌర్యసాహసములు గల పరాక్రమవంతు లగు గుంపులను దీసికొనివచ్చి శివాజీచుట్టుఁ జేర్చెను. సామాన్య పురుషులయొక్కయు, స్త్రీలయొక్కయు హృదయములుకూడ శౌర్యోత్సాహములతో నిండి తటతట గొట్టుకొనెను. శివాజీ తలపెట్టిన యీమహాకార్యమునకుఁ దన సర్వస్వము ధారపోయుట యుక్త మని ప్రతి మనుష్యుఁడు తలంచెను. శివాజీ యొక్క రణ దుందుభి మ్రోగినతోడనే ప్రతిమనుష్యుని హృదయమందును దేశాభిమాన మను మహాగ్ని ప్రజ్వలింపఁజొచ్చెను. కొన్ని సంవత్సరములలోనే మహారాష్ట్రుఁ డను శబ్దము విదేశకులకు గర్భనిర్భేదక మయ్యెను.

1674 సం॥న శివాజీ శాస్త్రయుక్తముగఁ బట్టాభిషేకము చేసికొనెను. అతని బిరుదు "గోబ్రాహ్మణ పరిపాలక ఛత్రపతి శివాజి మహారాజ్" అని యుండెను. చిరకాలము తనహృదయమున నెలకొని యుండిన తన కోరిక ఫలించుటచే రామదాసుని యొక్క యానంద మెంతో మనమూహించు కొనవచ్చును. రామదాసు ముందుగఁ బవిత్రస్నానము చేసెను. శివాజీ సింహాసన మెక్కక మునుపు రామదాసునకు రాజాలంకారము చేసిరి. ఆతని తలమీఁద రాజలాంఛన మైన శ్వేతచ్ఛత్రమునుబట్టిరి. ఆయన మొట్ట మొదట సింహాసన మెక్కెను. పిదప గద్దె శివాజీ యెక్కెను. తాను సింహాసన మెక్కుటకు రామదాసు చేసిన ప్రయత్న మంతకు శివాజీ తన కృతజ్ఞత నెట్లు తెలుపుకొనెనో దీనివలన మనము గ్రహింపవచ్చును. అప్పుడు రామదాసు యొక్క యాజ్ఞప్రకారమే శివాజీ రాజ్యమును స్వీకరించి యభి షేకముఁ జేసికొని గద్దె నెక్కెను.

ఒకానొకనాఁడు రామదాసుఁడు హఠాత్తుగా రాయఘడ్ కోటకుఁ బోయి శివాజీని దర్శించెను. అప్పుడు శివాజీ తన రాజ్యమంతయు గురుదక్షిణగ రామదాసున కర్పించెను. గురుశిష్యు లిద్దఱును మహా శ్చర్య నిమగ్నులై యొకరివంకనొకరు చూడ నారంభించిరి. గురువు శిష్యునియొక్క స్వార్థత్యాగమునకు నక్కజపడి నిశ్చేష్టుఁ డయ్యెను. శివాజీ గురువుగారి నోటనుండి యే యాజ్ఞవెడలునో యని యెదురు చూచుచు నిలువఁబడెను. శివాజీయొక్క మనస్సు రాజ్యతంత్ర నిమగ్నమయ్యు నెంత

భక్తిప్రపత్తులతోఁ గూడ నిండియుండెనో యీ విషయమును బట్టి తెలిసికొనవచ్చును. రామదాసుఁడు తన శిష్యుఁ డెంత యాత్మజ్ఞానముకలవాడయ్యెనో తెలిసికొని సంతోషించి రాజ్యము మఱల నతని కిచ్చివేసెను. "శివబాబా! నన్ను గుఱించి నీ వేమనుకొనుచున్నావు? నేను వట్టి సన్యాసిని. నే నీ ధరాభారము వహింపఁగలనా? నీవంటి క్షత్రియులు మాత్రమే యీ రాజ్యధర్మము సమర్థముగ నిర్వహింపఁగలరు. నాయనా! వెనుకటివలెనే స్వార్థత్యాగ పరతంత్రుఁడవై రాజ్యపాలనము చేయుము. అట్లు చేసిన ముక్తి నీకు సన్నిధాన వర్తినియై యుండును. నీవు నాకిచ్చిన రాజ్యము మఱల గ్రహించుట నీ కిష్టము లేదు గనుక నాపక్షమున నీవు ప్రతినిధివై యుండి భూమండలపరిపాలనము చేయుమని నే నిప్పుడు నిన్నాజ్ఞాపించుచున్నాను. ఇందుకు నిదర్శనముగ నీ ధ్వజమునకు నా శాటిగుడ్డరంగు గల కాషాయవస్త్రముఁ గట్టుకొని వ్యవహరింపుము. శివాజీ గురునాజ్ఞ శిరసావహించెను. నాఁటంగోలె మహారాష్ట్ర హిందువుల జండా "భగవత్ జండా" యని పేరు పడెను.

---

# పదునొకండవ ప్రకరణము

## చరమ ప్రకరణము

ఈ సంగ్రహ చరిత్రము మీద తెఱ పడవేయకమునుపు రాజకీయాందోళనమున రామదాసు డెంతవఱకు పనిచేసెనో సంగ్రహముగ తెలుపందగును. రామదాసశివాజీల సమావేశములకు మున్ను శివాజీయొక్క రాజకీయ వ్యవహారము కొంత వఱకు ప్రోత్సాహకరముగ నుండినను, తరువాత నా వ్యవహారములు తాల్చినంత వైశాల్యమును, బలమును నవి పొందియుండ లేదు. శివాజీ రామదాసులు చేతులు కలుపుగొనిన తరువాతను, రామదాసుని మతబోధకులు స్వరాజ్యసంస్థాపనకుకూడ పాటుపడజొచ్చిరి. మతబోధకులు స్వధర్మ సంరక్షణకై యొక మహావీరుడు దేశమున ప్రభవించినాడని బోధించి సిపాయీలను, గుమాస్తాలను, రాయబారులను, వేగులవాండ్రను, శివాజీ కొలువులో జేర్ప జొచ్చిరి. రామదాసుడు మానవతత్వమును, జక్కగా విభాగించి పరిశోధింపగల ప్రజ్ఞావంతుడు గనుక గొలువుచేయుటకు దనకడ కెవ్వరు వచ్చినను, వాడెందుకు పనికివచ్చునో యావిషయమై యొక జాబు వ్రాపి శివాజీకడకు బంపుచుండును, ఇత్తెఱంగున, వందలు, వేలు, భటులు శివాజీ ధ్వజముక్రింద నిలిచి, మహమ్మదీయుల యొక్కయు, మహారాష్ట్రప్రభువుల యొక్కయు, సర్దారులయొక్కయు, నాటంకములను నొకమూలకు ద్రోసి, శివాజీని సింహాసన మెక్కించిరి. అందు చేతనే శివాజీ మొట్టమొదట రామదాసుని గద్దె నెక్కించి, పిమ్మట, నాతని యాజ్ఞప్రకారము సింహాసనమెక్కి, రాజయ్యెను. రామదాసునియొక్క, విశాల దృష్టి ఏజాతివానినైన విడువక, జాతి పునర్నిర్మాణమునకు, నెల్లవారి సానుభూతిని సంగ్రహించెను. రాజ్యాంగవ్యవహారములనేగాక, రామదాసుడు శివాజీకి శాసననిర్మాణమందుగూడ సహాయపడెను. దండయాత్రలు జరుపుటలో గూడ

రామదాసుడు స్థిరమైన యాలోచనలు శిష్యునకు చెప్పుచుండెను. ఆపదలు తప్పించుకొను నుపాయములుగూడ జెప్పుచుండును. ఒకానొక సమయమున మహారాష్ట్ర సామ్రాజ్యము నేలమట్ట మగునట్టి మహాపత్తు వచ్చినప్పుడు రామదాసుడు చెప్పిన యుపాయమే శివాజీని రక్షించెను. ఈనాటి పాశ్చాత్యశిల్పులుగూడ మెచ్చుకొని, నాశ్చర్యపడునట్లు, గొప్పగొప్ప కోటలు నిర్మించుటలో రామదాసు బుద్ధి యసమానమైనది. సున్నము తయారు చేయుట, తోటలు వేయుట, కోటలు కట్టుట మొదలయిన విషయములలో నప్పు డప్పు డాశుధారగా కవిత్వముతో, నుపన్యాసము లిచ్చెడివాడు. మొక్క లెక్కడెక్కడ పాత వలెనో, యేయేవరుసలుగ నాటవలెనో యతనికి మిక్కిలి బాగుగా తెలియును. మహమ్మదీయులన్న రామదాసునకు, ద్వేషము లేదుగాని, వారి దండయాత్రలను, తిరుగుబాటులను నణచి ఎదిరించవలసినదని, రామదాసుడు ప్రజలను పురిగొల్పుచుండెను. హిందూమతధర్మరక్షణమే యతని ముఖ్యోద్దేశ్యము. శిక్కుమతస్థాపకుడైన నానక్‌నందును, ఆతని మతమునందును రామదాసుడు చూపిన గౌరవము ఇంతింత యనరాదు. అత డితరమతములయందు ద్వేషము చూపగూడదని చెప్పునుగాని, హిందూమతసముద్ధరణ మనిన, నతనికి ప్రీతి. అయినను తన మతధర్మము నవలంబించునట్టివారిని బాధించువారిని జూచి, భరింపలేడు. మఠములలో జరుగునట్టి యుత్సవము లన్నిటికి, సర్వమతములవారిని, సర్వవర్ణములవారిని, నతడు చేర్చుకొనుచు వచ్చెను. ఈవిధముగ రామదాసుడు, సర్వజనులను తన మతబోధక్రిందకు దీసికొనివచ్చి, హిందువుల యార్థిక, నైతిక, సాంఘిక వ్యవహారస్థితిని వృద్ధిచేసెను. హిందువుల గౌరవము స్వాతంత్ర్యము నెక్కువయగునట్లతడు చేసెను. దాసబోధయను గ్రంథము రామదాసు రచించిన పుస్తకములలో, బహు వేదాంతవిషయములు గలిగియుడును. ఆకారణమున మహారాష్ట్రులు భగవద్గీత తరువాత దీనినే మహాగ్రంథముగ నెంచి, పూజింతురు. ఇది సకల విషయములు కలిగి గ్రంథకర్తయొక్క దివ్యజ్ఞానమును, జూబుచుండును, అది యొక్కసారి రచియింపబడలేదు. అప్పుడప్పుడతడు, పద్యరూపమున నాశుధారగా నిచ్చిన పద్యములందు గలవు. కాగితము, కలము, పుచ్చుకొని నిరంతరము గురు

వుగారివెంట నుండు, "కళ్యాణస్వామి" యను శిష్యుడు, గురువు నోటనుండి వెడలిన ప్రతిముక్క, నెప్పటికప్పు డెక్కించి దాచుచుండును. అందు చేత, నది పెద్ద సంపుట మయ్యెను. రామదాసుడు చనిపోవు రెండు మూడు దినములక్రిందవరకు, శిష్యునకు జెప్పి, యాగ్రంథము వ్రాయించు చుండెను. చివరదినములలో, నతడే యాగ్రంథమునందు కొన్నిమార్పులను తన స్వహస్తములతో జేసెను.

దాసబోధలో నిరువది దశకములు గలవు. దశకమునకు పదేసి శ్లోకము లుండును. కొన్ని చోట్ల గురుశిష్యులకు సంవాదము జరిగినట్లుగ వ్రాయ బడెను. ఆ గ్రంథములో నత డనేక ప్రపంచసమస్యలను విప్పెను. అతని శైలి ఖడ్గధారవలె, నిశితమై, పరవాదములను ఖండించుకొని పోవుచుండును. కఠినమై చిక్కులుగల సమస్యలను విప్పుటలో దాసబోధవంటి మహాగ్రంథ మింకొకటి లేదనియే చెప్పవచ్చును. మహారాష్ట్రదేశము స్వాతంత్ర్యమను యమృతము చవిచూచుచు, మహోత్కృష్టదశను బొందుచుండగ శివాజీ 1680 సం॥ రాయఖడ్ కోటలో మృతినొందెను. చనిపోవునప్పటికి, నతనికి వేబది మూడు సంవత్సరములు, అందుచే నతనిని అల్పాయుష్మంతుడ నియే జెప్పవచ్చును. ఆయన మరణము రామదాసునకు పిడుగుపాటు వంటిది. ఆవార్త వినగానే మొగము దిగాలు వేసుకొని నిశ్శబ్దముగ తన గదిలోనికి బోయెను. శివాజీ తరువాత, సింహాసన మెక్కిన యతనికొడుకు శంభాజీ తండ్రివలెనే, శౌర్యవంతుడు, బలవంతుడునై, రాజ్యము వృద్ధిచేయు తలంపుగలవాడే కాని ఔరంగజీబు యొక్క కుతంత్రములవలన, నాతని చారుల చేతులలో బడెను. చారులు మిత్రులవలె నటించి, శంభాజీని జారునిగను, త్రాగుబోతుగను, జేసిరి. పూర్వపు మంత్రులు, శత్రువుల చారుల బారినుండి తొలగించుటకు బహుప్రయత్నములు చేసిరిగాని, యవి నిష్ఫలము లయ్యెను. శంభాజీ కన్యాకుబ్జబ్రాహ్మణుడైన "కలుషు" డను నొక బ్రాహ్మణుని వశములో నుండెను. వాడు తక్కిన చారులతో గలిపి, శంభాజీ మెడకు దుస్తంత్రములను నురిత్రాళ్ళను గట్టిగ బిగించెను. గొఱ్ఱె కటికవానిని నమ్మినట్లు, శంబాజీ వాడేదిచెప్పిన, నది చేయు చుండెను. "కలుషు"డు శంభాజీని వశవర్తుని జేసికొని, పవతితల్లియగు

"తారాబాయిని" బ్రతికి యుండగనే, గోడలోబెట్టి కట్టించునట్లు చేసెను. అదిగాక, శంభాజీ వాని సలహాప్రకారము భక్తివిశ్వాసములు గలిగి మహారాష్ట్ర సామ్రాజ్యసౌధమునకు నిర్మాతలైన ప్రధాన మంత్రులను, ముఖ్యపురుషులను, నేనుగుకాళ్ళచే ద్రొక్కించి, చంపించెను. ఈ దౌర్జన్యములు రామదాసుని హృదయమును మండజేసెను. మహారాష్ట్ర సామ్రాజ్యము చాలకాలము నిలువదని, యతడు భయపడెను. శంభాజీ యప్పు డప్పుడు, రామదాసుని నిలయమైన, పైజాన్‌ఖాడ్‌నకు బోవుచుండెను గాని, రామదాసు డత నిని గలుసుకొనుట కిష్టపడడయ్యెను. ఒకానొకప్పుడు శంభాజీ రామదాసుని దర్శనము చేసినప్పుడు శంభాజీని రామదాసుడు, వాని దుర్నయమునకై కఠినముగ, జీవాట్లు పెట్టెను. శంభాజీ తన తండ్రి మార్గము ననుస రించి, వర్తింతునని నొక్కి చెప్పి, వెడలిపోయెను. రామదాసుని యొక్క హితోపదేశములకంటె దనచుట్టు జేరిన, దురాచారుల మాటలే యెక్కువ ప్రియములుగ నుండెను. ఎట్టకేలకు రామదాసుడు కడపటి ప్రయత్నముగ నొక జాబు వ్రాసెను. అదియు నిష్ప్రయోజనమే యయ్యెను. 1681 సంవత్సరమున అనగా శివాజీపోయిన సంవత్సరమునకే రామదాసుడు తన దాసబోధ యను గ్రంథమును బూర్తి జేసెను. అది మొదలుకొని, రామదాసునకు దేహారోగ్యము చెడెను. అందుచేత, నత డెవరికి, దర్శనమీ యక యొక గదిలో కూర్చుండెను. రోగసంబంధమైన బాధలు నివారణజేసి కొనుటకు గొన్ని గ్రహశాంతులు మొదలయినవి చేసికొమ్మని, కొందఱు శిష్యులు చెప్పి శంభాజీమహారాజుయొక్క యాస్థానవైద్యుని, బిలిపింపుమని, కోరినప్పుడు రామదాసుడు, కఠినముగ నిట్లు చెప్పెను. "ఇది యెంత పరిహాసాస్పద మయినపని, అది మన విశ్వాసమును, వైరాగ్యమును భంగ పఱుపదా? ఈ భౌతిక శరీరము క్షణభంగురమని, బోధించునట్టి మనమే, దీనికొరకింత, విశ్వప్రయత్నము చేయదగునా? ఈ శరీరము మనదిగాదు, ఇది యొక చొక్కావంటిది. ప్రాతగలినప్పుడు, దానిని త్రోసి పారవేయ వలసినదే! ఈ సంగతి భగవద్గీతలో చెప్పలేదా? ఈ శరీరము పంచభూతము లలో గలిసిపోవువఱకు విధి దాని కేమివిధించెనో యవియన్నియు యనుభ వించితీరవలసినదే! గ్రహశాంతులు నవసరము లేదు; వైద్యుని యవసరము

లేదు" రోగము క్రమక్రమముగ వృద్ధిబొందెను. చరమదశ వచ్చెను. అన్ని మఠములనుండి శిష్యులందఱు చేరిరి. ఈ మఠములయొక్క యధికారము, తన యన్నగారైన శ్రేష్ఠుని కొమరునకు నప్పగించెను. తన మరణానంతరమున తనతో, మాటలాడదలచినవారు దాసబోధలో జెప్పబడిన ప్రకారము నడచుకొనవలెనని, యానతిచ్చెను. అతడు రెండురోజులకు చనిపోవుననగా దేశమంతటినుండి భక్తులు, శిష్యులు, కొన్ని లక్షలమంది వచ్చి, మఠమును జుట్టవేసిరి. ఆకసము మాఱు మ్రోగునట్లు, రామభజనలు జరిగెను. రామదాసుడును, తన యిష్టదైవతమగు రామనామము స్మరించుచుండెను. పదునొకండుసారులు రామ, రామ యనుచు, రామదాసుడు, ప్రాణములు విడిచెను.

ఆతని మరణముచేత, మహారాష్ట్ర మంధకారబంధుర మయ్యెను. మహారాష్ట్రుల పాలిటి కోహినూర్ రత్నము పోయెను. ఇతడు 1681 సంవత్సరమున మాఘమాసమున శుద్ధ నవమినా డస్తమించెను. అది మహారాష్ట్రశకము ప్రకారము 1603 వ సంవత్సర మయ్యెను. ఈ దినము, మనదేశము భీష్ముని యేకాదశివలె మహారాష్ట్రదేశ మంతటను దాసనవమి పేరిట బరగుచుండును. ఆదినమున, నేఁటి నుత్సవములు, నుపవాసములు, భజనలు జరుగుచుండును.

చరమ ప్రకరణము సమాప్తము.

# అనుబంధము

రామదాసుయొక్క వ్రాఁతలలోనుండి కొన్ని యాంధ్రీకరించి యీ క్రిందఁ బొందుపఱచుచున్నాను.

## 1. రాజధర్మం

రాజధర్మమును గుఱించి యీ క్రిందివిధముగ రామదాసు వ్రాసెను.

అంతరాయములకెల్ల నంతకుఁ డగు గణేశ్వరుని, విజ్ఞానాధిదేవత యైన సరస్వతిని మా యిలవేల్పైన శ్రీరాముని స్తవముఁ జేసి రాజధర్మ మునుగుఱించి యీ క్రిందివిధముగఁ జెప్పుచున్నాను. వినువారి కెవరికైన నిష్టములేనిపక్షమున దానిని త్రోసివేయుఁడు. వివేకమునుబట్టి సౌఖ్యము గలుగును. కార్యసిద్ధులు పునఃపునః ప్రయత్న ఫలములు. ఏమనుష్యునిగాని కొలువులోఁ బెట్టకమునుపు వానినిగుఱించి బరీక్షించి వాని గుణములు గ్రహింపవలెను. పనికిమాలినవాండ్రను దూరముగ నుంచవలెను. ప్రతి కార్యముయొక్క సర్వభావమును, పర్యాప్తిని గ్రహించి చేసినపక్షమున నది తప్పిపోక చేసినవానికి శ్రమ లేకుండఁ జేయును.. కార్యమారంభించిన వాని యొక్క గుణమును బట్టియు శక్తినిబట్టియు గార్యసిద్ధి కలుగుచుండును. కొందఱు మందవర్తనులు తలబిరుసువాండ్రు కొలువులో నుందురు. కాని వారితప్పులను మహోదారమనసుతోను బ్రసన్నచిత్తముతోను క్షమించవలెను. రాజద్రోహులను వెంటనే యడఁచి వేయవలెను. తగినవిచారణ లేక నిరప రాధిని వట్టి యనుమానముమీఁద నడచివేయఁగూడదు సేవకులను సదా సంతుష్టులుగాను, సంతోషవంతులుగాను జేయుటచేత మన యదృష్టము వృద్ధిబొందును. కాని కొన్నిసమయములయందు సేవకులలోఁ గొందఱు కఠినపద్ధతుల కర్హులై యుందురు. మనుష్యులనే సమయముల

నెట్లు ఉపయోగించవలెనో మనసులో నుంచుకొనవలెను. మనకు వ
ష్యబల మెల్లప్పుడు మిక్కిలి యవసరము. కనుక వారిలోపముల నెప్పు
క్షమించవలెను. న్యాయమునకు బద్ధులము గావలెను. న్యాయము నుపే
చిన యెడల మనము నాశనము నొందుదుము. వివేకమును ధర్మము
దాటవద్దు. న్యాయము లేకుండ యే సత్కార్యమును గాదు. తన ధర్మ
నెడల ప్రాలుమాలినవాఁడు భాగ్యవంతుఁడు గానేరఁడు. మంచిసమయము
ధైర్యము విడనాడుట వినాశ హేతువు కష్టపరంపరచేత విసుగు చెం
వద్దు. ఉత్సాహము గోలుపోవద్దు. కార్యభంగ మయినప్పు దుత్సాహము
బునఃప్రయత్నముఁ జేసిన నీకు గొఱఁత యుండదు. నీ ప్రభుత్వపువల
జాగ్రత్తగఁబన్ని గొప్ప రాజనీతిధురంధరులకుఁగూడ నాశ్చర్యము గల్గున
మెలఁగుము. కాఠిన్యము ప్రభుత్వము యొక్క ముఖ్యకీలకము. కాఠిన్య
కొంచెము తగ్గినపక్షమునఁ బ్రభుత్వ మంతయు క్షణములో శిధిల మగు
యుద్ధభూమిని రాజు శత్రువుల కెట్టయెదుట నెప్పుడు నిలువఁగూడ
అట్లు నిలుచుట రాజనీతికి విరుద్ధము. వందలకొలఁది మనుష్యులకు రా
వేషములు వేసి వారే రాజు లని భ్రమపుట్టునట్లు చేయవలెను. అట్టివారి
యెట్టయెదుట నిలుపవలెను. మనుష్యబలము మిక్కిలి బలిష్ఠముగా
దగినంతగాను నుండవలెను. కాని యందఱను నొక్క విధముగా
యాదరింపఁగూడదు. వారి వారి శక్తినిబట్టి వారికిఁ జిన్నతనము
కుండ వేఱువేఱు పనులు వారి కొప్పగింపవలెను. మహావీరుఁ డాత
గౌరవము చేతను మహోత్సాహముచేతను బురికొల్పఁబడినప్పుడు వాఁడ
తనప్రాణములనైనఁ దెగించును. అట్టి శూరులను గలిపి యేక ముఖముగ
బనిచేయుటకై నిలుపలో నుంచుము. భయంకరమైన బెబ్బులిబొబ్బ గొఱ్ఱె
నెట్లు చెల్లాచెదరుగఁ జేయునో చూడుము! తెగ బలిసిన దున్నపోతు లగ
టవలన లాభము లేదు. మీరు పెద్దపులులు గండు. రాజులు రాజధర్మము
గమనింపవలెను. క్షత్రియులు తమధర్మమయిన యుద్ధమును జేయవలెను
బ్రాహ్మణులు తమమతధర్మములను నిర్వర్తింపవలెను. రాజు సంగ్రామశాస్త్ర
మును వశ్యశాస్త్రమునుగూడ బఠింపవలెను. శత్రువులను జయించుట క
సాధనము గనుక, మిక్కిలి యవసరము. నా ప్రభువైన శ్రీరామునిచేత
బ్రేరేపింపఁ బడి నా నేర్చినకొలఁదిని రాజధర్మమును గూర్చి పలికితిని.

## 2. యుద్ధవీరుల ధర్మము.

రాజధర్మమునుగుఱించి సంగ్రహముగ మాటలాడితిని. ఇప్పుడు క్షత్రియధర్మమునుగుఱించి ప్రసంగించెదను. ఆ ధర్మము నెఱవేర్చుట మిక్కిలి కష్టము. ప్రాణభయము గలవారు యుద్ధవీరులవృత్తిలోఁ బ్రవేశించఁగూడదు. వారు మఱియొక వృత్తివలన జీవయాత్ర గడుపవలెను. రణరంగమునుండి వెన్నిచ్చి పరుగెత్తినవాఁడు నరకదుఃఖము ననుభవించును. యుద్ధములో మగతనముఁ జూపక యింటికిఁ బారిపోయినవాఁడు బహుపాపములు చేసినవాఁడగును. యుద్ధములోఁ జచ్చిపోయిన వానికి వీరస్వర్గము సిద్ధముగ నుండును. నీవు జయించి గృహమునకుఁ బోయితివేని యింటిలోఁగూడ నీకు మహానందము గల్గును. పురుషుడు విశేష శౌర్యము మహోత్సాహముఁ గలిగియున్న పక్షమున, దేశకాలపరిస్థితుల నెఱింగిన పక్షమునను విజయము స్వయముగ వచ్చి వానిపాదములపైఁ బడును. తాను చేయఁదలచిన కార్యముయొక్క స్వభావమును, ప్రాముఖ్యమును గ్రహింపని నిర్భాగ్యుఁడు రణరంగమున నేమి చేయఁగలఁడు. జనులను సంతోషపఱచినప్పుడే యుద్ధమును చేయవచ్చును. గెలువవచ్చును ఇప్పుడు చూడుఁడు! పుణ్యక్షేత్రము లన్నియు మైలపఱుపబడినవి. ప్రతిష్ఠలములోను మత మగౌరవింపఁబడి యణఁగఁ ద్రొక్కఁబడుచున్నది. ఇటువంటి దురవస్థ చూచుచు బ్రతికి యుండుటకన్న మీరందఱు చచ్చిపోవుట మేలు. కావున "నేను, మహారాష్ట్రుఁడను" అని చెప్పుకొను ప్రతిమానవుడు పదిమందితోఁ గలిసి నడుముగట్టి సేనలోఁ జేరి నడువవలయును. మన మహారాష్ట్రధర్మమును తిరిగి వ్యాపింపఁజేయుటకు సకల ప్రయత్నములు చేయవలెను. ఈవిషయమున నే మాత్రము సందేహము మీకుఁ గలిగినను మీపితృపితామహప్రపితా మహాదుల శాపములు మీతలపైఁ బడును. మీరు మరణము తప్పించుకొనలేరు. కావున మంచి యాలోచనతో శక్యమయినంత పని మీరేల చేయరాదు? మేము గొప్పవారము ముఖ్యులము అనుకొనువారందఱు నొక్క జెండాక్రిందఁ జేరవలెను. అట్లు వారు చేరనిపక్షమున వారు తమ తప్పునకు ముందుముందు పశ్చాత్తాపము నొందుదురు. తన జాతిని తన ధర్మమును వదలినవాఁడు గొప్పవాఁడ నని యెట్లనుకొనఁగలఁడు?

నా వాక్యములు మీలోఁ గొందఱ కాగ్రహము దెప్పించవచ్చును; గాని క్షమింపుఁడు. భగవంతునికి ద్రోహులైనవారు కుక్కలుగాని మనుష్యులు కారు. అట్టివారిని తన్నివేయుఁడు. ధర్మమతు లైన దేవభక్తులే విజయము గాంతురు. మతసంస్థాపనకొఱకు దేవునిపాదములను మీశిరస్సులమీఁద ధరించి మీయుత్సాహపూరితము లైన పనులతో దేశ మంతయుఁ బ్రతిధ్వనించునట్లు చేయుఁడు. చులుకుగ నుండుఁడు. మంచి యాలోచన గలిగియుండుఁడు. ఏ ప్రయత్నమును జేయ మానకుఁడు. జగన్మాత యైన "తుల్యభవాని" వరముచేతనే శ్రీరాముఁడు రావణుని సంహరించె నన్న మాట మనసులో నుంచుకొనుఁడు. ఓ మిత్రులారా! ఈ తుల్యభవాని శ్రీరామునికి వరములిచ్చి ప్రసిద్ధికెక్కినది. అందుచేతనే రామదాసుఁ డని ప్రసిద్ధిజెందిన నే నామెను గొలుచుచుందును.

## 3. శ్రద్ధ.

ఈప్రసంగము రామదాసుఁడు శివాజీకి భగవత్ పతాక నిచ్చినప్పుడు చేయఁబడెను.

ఎవరిని నమ్మవద్దు. నీ పన్నాగములు నీవే స్వయముగ నాలోచించుకొని పన్నుకొనవలెను. నీ ప్రయత్నము లన్నిటిలోను నిశ్శంక మైన ధైర్యము వహింపుము. శరీరబాధలు వచ్చినప్పు డధైర్యముఁ బూనకుము. సమస్తచికిత్సలు చేయింపుము. అంతట నీకుఁ దప్పక సుఖము కలుగును. కఠినసమస్యలను నీ వేకాంతముగఁ గూర్చుండి యాలోచించి సాధింపుము. నీ జ్ఞాపకశక్తిని జక్కఁగ నిలుపుకొనుము. శత్రువులను మిత్రులను కఠిన శోధనలఁ జేయుము. ఏప్రయత్నమును మానకుము. భోగములపొంతఁ బోకుము. నేర్పు గల యుపాయములు పన్నునట్లు వ్యవహరింపుము. నాయకుఁడు శౌర్యమునందు వెనుకఁబడఁగూడదు. తన కార్యములలో ముఖ్యసూత్రములవిషయమై యశ్రద్ధ చేయఁగూడదు. అతఁ డెప్పుడు సోమరియై యుండఁగూడదు. అట్లుండినఁ బశుప్రాయుఁ డగును. ఎవఁడు తన ధర్మమువిషయమై ప్రాలుమాలి యుండునో, యాలోచించుట మానునో,

వాఁడు మానవజాతిలో నధముఁ డగును. కార్యమునందుఁ గట్టిపూనిక గలవానికి నేకార్యము నసాధ్యమై యుండదు. మనుష్యు లెంత సమర్థులైనను, నెంత తెలివిగల వారైనను వారిని దూరముగ నుంచి వారిపని యవసర మైనప్పుడే వారిం జేరఁ బిలువవలెను. చూడఁగనే యే మనుష్యుని యందును విశ్వాస ముంచవద్దు. నీవు నీ విశ్వాసములోనికిఁ దీసికొనక ముందు ప్రతిమనుష్యుని కఠినపరీక్ష చేయవలెను, మీఁద దైవ మున్నాఁడు, అతనిదయవలన మంత్రశక్తి బలవత్తర మగును. పూర్వము గొప్పవారైన వారందఱు నిరంతరము పాటుపడుటవల్లనే ఘనులైరి. నీ మనస్సును వశపఱచుకొనుము. ఇతరుల మనస్సులను బరిశోధింపుము. వారు తొండవలె రంగులు మార్చుకొనకుండఁ జూడుము. రాజకార్యవిషయములలో నితరులు గమనించినట్లు గమనింపుము. వారు పోయిన పోకడలు పొమ్ము, సంజ్ఞలవలన జేయఁదగిన పనిని నోటితో బలికి చెప్పకుము. మాటలాడఁదగిన విషయము లిఖితపూర్వకముగఁ జేయకుము. ఆలోచించి చేయఁదగిన విషయములను తొందరపడి నోటితోఁ జెప్పకుము.

## 4. మహారాజా ఛత్రపతి శంభాజీకి రామదాసుఁడు వ్రాసిన లేఖ.

శంభాజీ మహారాష్ట్రప్రభు వైన శివాజీ కుమారుఁడు, పితురనంతరము నితఁడే సింహాసన మెక్కెను. కాని యితఁడు శివాజీవంటివాఁడు గాడు. దుర్వ్యసనాసక్తుఁడై తాను పాడై రాజ్యమును బాడుచేసెను.

నీ వెప్పుడును శ్రద్ధగ నుండుము. విషాదమునకు నీ హృదయమున స్థాన మీయకుము. ముఖ్యవిషయములను నీ వేకాంతముగఁ గూర్చుండి శోధించుచుండుము. భయంకరమై క్రూరమైన నీ ప్రస్తుతస్వభావమును విడిచిపెట్టుము. శాంతము వహింపుము. విదేశీయుల కుట్రలనుండి నీ దేశమును దప్పించుటకు నీ హృదయమును సిద్ధముగ నుంచుము. పూర్వపు మంత్రుల నందఱను క్షమించి వారల మరల రప్పింపుము. వారల హృదయములను సంతుష్టిపఱచి వారిపూర్వపు టుద్యోగముల వారి కిమ్ము.

ప్రవాహమున కడ్డగట్టు గట్టినయెడల నీరు ప్రవహింపదు. జనసామాన్యముల మనస్సులు నిర్బంధము లేకుండ స్వేచ్ఛ గనున్నప్పుడే ఘనకార్యములు సాధింపఁబడును. జనసంఘములు. పలుతావులయందు నిరోధింపఁబడినప్పుడపాయము సన్నిహితమై యుండును. నీ పెద్దలు సంపాదించిన ప్రశాంతి చెడఁగొట్టి వివాదములు కలహములు పెంచుట వినాశ కారణ మగును. నీ శత్రువు లా సందుఁ గనిపెట్టి నిన్ను చెఱుపఁజూతురు; కావున దానిని దప్పించుకొనుము. రెండు కుక్క లొకయెముకకొఱకుఁ బోరాడినయెడల మూఁడవకుక్క దాని నెత్తుకొనిపోవు నను లోకోక్తి నీవు వినలేదా ఇది? చక్కఁగ విచారించి, నడుముగట్టి చేయవలసిన మహాకార్యములను జేయుము. ధైర్యహీనత నాశనమునకు దారితీయును. సకలజనుల మనఃక్షేత్రములందు శాంతిబీజములను జల్లుము. జను లందఱిని జేరఁదీసి, వా రేక కార్యముఖులై యుండునట్లు చేసి వారిచేత శత్రువులను బాఱదోలింపుము. ఇందువలన నీ కీర్తి ప్రపంచమం దన్ని దిక్కులయందు వ్యాపించును. ప్రపంచ మంతయు నీ కత్తికి జడిసి, నీ పేరు చెప్పిన భయమున గడ గడ వడంకి లోఁబడును. నీ విట్లు చేయనిపక్షమున రాజ్య మెప్పుడో యొకప్పుడు కూలిపోవును. దేశకాలపరిస్థితులను గమనించి, క్రోధమునకు తావొసంగకుము. క్రోధ మణఁచుకోలేనిపక్షమున శాంతికవచమునైనఁ దొడుగుకొని, నీలో కోప మున్నట్లు ప్రజలకు దెలియనీయకుము. ప్రజలు తమ హృదయములలో నిన్ను గుఱించి భయపడఁగూడదు. లెక్కలేని సైన్యమును బోగుచేసి వారిచేత మ్లేచ్ఛులను బాఱఁదోలింపుము. ప్రస్తుత మున్న దానిని రక్షించి నూతనరాజ్య మార్జించి దానికిం గలిపి మహారాష్ట్రప్రభ దేదీప్యమానమై శాశ్వతముగ వెలుఁగునట్లు చేయుము. అనంతమైన యుత్సాహశక్తిని గలిగియుండును. నీ శౌర్యముకొలఁది నీ ఖడ్గమును బ్రయోగింపుము. నీ వొక మహారాజువై మహోన్నతదశను బొందుదువు. నీవు శివాజీమాట జ్ఞాపక ముంచుకొని యీ ప్రపంచమునను బరలోకమునను నీ కీర్తి శాశ్వతముగ నుండునట్లు ప్రయత్నింపుము. నీ ప్రాణములను తృణప్రాయముగ నెంచుము. శివాజీ యొక్క యెడతెగని యుత్సాహమును, నసమాన ఘనతను జ్ఞాపక ముంచుకొనుము. అవియే యతనిని మృతజీవుని జేసినవి.

అతని కార్యము లెట్లుండినవి? అతని వాఙ్మాధుర్య మెట్లుండెడిది? అన్యుల మనసులను వశపఱచుకొనుటలో నతఁ డెంత యనుభవశాలి? భోగముల నొకమూలకుఁ ద్రోసి యీ యోగసిద్ధికై పాటుపడుము.. రాజ్యాంగవిషయ మైన గొడవ యెప్పుడు నిట్లే యుండును, సుప్రసిద్ధుఁడైన నీతండ్రి చేసిన దానికంటె నెక్కువ చేయుటకుఁ బ్రయత్నింపుము. నీకు నే నింతకంటె నేమి వ్రాయఁగలను?

* * *

T. T. D. Religious Publications Series No. 423.

Price Rs. 10/-

Printed and Published by Sri N. Ramesh Kumar, I.A.S., Executive Officer,

T.T. Devasthanams and Printed at T.T.D. Press, Tirupati – C. 2,000